ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి



# విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY




ఆదివారం 28 జూన్ 2026 | సంపుటి: 28 సంచిక: 86
Sunday 28 June 2026 | Vol.No 28 Issue No .86
హైదరాబాద్ | Hyderabad
పేజీలు: 12+12
వెల: రూ.1.00
PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA
www.visionandhra.in

## 14 నైబర్‌హుడ్ సెంటర్లకు ఉచిత రవాణా

**ఈ- ఆటోలను ప్రారంభించిన మంత్రి సీతక్క**

హైదరాబాద్,జూన్27 :దివ్యాంగుల కోసం రాష్ట్రంలోని 14 నైబర్‌హుడ్ సెంటర్లకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించే లక్ష్యంతో ఈ–ఆటోల పంపిణీని తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క పాల్గొన్నారు. హెలెన్ కెల్లర్ జయంతి సందర్భంగా దివ్యాంగుల రవాణా సదుపాయాలను మెరుగుపరిచే లక్ష్యంతో ఈ–ఆటోలను పంపిణీ చేయడం శుభపరిణామమని మంత్రి సీతక్క అన్నారు. దివ్యాంగులు జీవితాన్ని సవాల్‌గా స్వీకరిస్తే



అసాధారణ విజయాలను సాధించగలరని ఆమె పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల మిగతా 2లో..

## సీషెల్స్ చేరుకున్న ప్రధాని మోడీ

**ఘనంగా స్వాగతం పలికిన ప్రవాస భారతీయులు**

న్యూఢిల్లీ,జూన్27 : భారత ప్రధాని నరేంద్ర మోదీ మూడు రోజుల పర్యటన నిమిత్తం సీషెల్స్ వెళ్లారు. శనివారం సాయంత్రం సీషెల్స్ ఇంటర్‌నేషనల్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. అక్కడ ఆయనకు ఘన స్వాగతం లభించింది. ప్రవాస భారతీయులు.. భారతీయ సంప్రదాయ నృత్యాలతో ఆయనకు స్వాగతం పలికారు. ఎయిర్‌పోర్టులోని జనం మోదీ, మోదీ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సీషెల్స్ ఎయిర్‌పోర్టులో తనకు లభించిన ఘన స్వాగతంపై ప్రధాని మోదీ ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. పోస్టులో.. 'అద్భుతమైన సాంస్కృతిక అనుబంధం. సీషెల్స్



ఎయిర్‌పోర్టులో లభించిన స్వాగతంలో కచ్ డ్యాన్స్ కూడా భాగమైంది. మన ప్రవాస భారతీయులు భారతదేశంలోని మిగతా 2లో..

# రాష్ట్ర రోడ్లకు ఇక మహర్దశ

- హ్యామ్ రోడ్లకు నేడు సిఎం శంకుస్థాపన
- నల్లగొండ జిల్లా కనగల్‌లో నేడు శ్రీకారం

నల్లగొండ,జూన్27 : తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా రహదారుల రూపురేఖలను మార్చేలా ప్రభుత్వం భారీ ప్రాజెక్టుకు శ్రీకారం చుడుతోంది. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హ్యామ్) పద్ధతిలో చేపట్టనున్న ఈ ప్రతిష్ఠాత్మక రోడ్ల పనులకు 28న నల్గొండ జిల్లా కనగల్ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. రాష్ట్ర చరిత్రలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఈ మెగా రోడ్డు ప్రాజెక్టు కోసం ప్రభుత్వం సుమారు రూ. 13,006 కోట్ల భారీ బడ్జెట్‌ను కేటాయించింది. దీని ద్వారా రాష్ట్రంలోని అన్ని ప్రధాన ప్రాంతాలను అనుసంధానిస్తూ వేగవంతమైన, సురక్షితమైన , అత్యాధునిక రవాణా సౌకర్యాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ మెగా ప్రాజెక్టులో భాగంగా మొదటి విడత కింద రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 6,092 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న 441 రోడ్లను అభివృద్ధి చేయనున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య రవాణా వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు, వాణిజ్య పరంగా కీలకమైన మార్గాలను బలోపేతం చేసేందుకు ఈ నిధులను ఖర్చు చేయనున్నారు. హ్యామ్ విధానం లో చేపట్టడం వల్ల పనులు అత్యంత నాణ్యతతో, నిర్ణీత గడువులోగా పూర్తవుతాయని అధికారులు భావిస్తున్నారు. ప్రయాణ సమయాన్ని తగ్గించడంతో

### ప్రపంచాన్ని ఆకర్శిస్తున్న తెలంగాణ రైజింగ్

- నైపుణ్యాభివృద్ధి ద్వారా పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలు
- ఎక్స్ వేదికగా సిఎం రేవంత్ రెడ్డి వెల్లడి



పాటు రోడ్డు ప్రమాదాల నివారణకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ ఈ రహదారుల మిగతా 2లో..

## అభివృద్ధి పనులు వేగంగా చేపట్టాలి

- అధికారులకు మంత్రి పొంగులేటి ఆదేశం



ఖమ్మం,జూన్ 27 : పాలేరు నియోజకవర్గ పరిధిలోని కూసుమంచి మండలంలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విస్తృతంగా పర్యటించారు. మండలంలోని దుబ్బతండా, లాల్ సింగ్ తండా, జీళ్లచెరువు గ్రామాల్లోని పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఈ గ్రామాల్లో రూ.16.13 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్లు, వంతెనల నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం మిగతా 2లో..

## హైదరాబాద్‌లో డోనాల్డ్ ట్రంప్ అవెన్యూ

- భారత్‌కు కృతజ్ఞతలు అంటూ ట్రూత్‌తో ట్రంప్ వెల్లడి



మిగతా 2లో..

## రెండేళ్లలో 500 నగరాలకు భారత్ ట్యాక్సీ సేవలు

**గుజరాత్‌లో ట్యాక్సీ సేవలు ప్రారంభించిన అమిత్ షా**




గాంధనగర్,జూన్27 : రెండేళ్లల్లో 500 నగరాలకు ఈ ట్యాక్సీ సేవలు విస్తరిస్తాయని మిగతా 2లో..

## అజిత్ రెడ్డికి మెట్రో అడిషన్ ఎండిగా అదనపు బాధ్యతలు

**ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం**



హైదరాబాద్,జూన్ 27 : సీనియర్ ఐఏఎస్ అధికారి అజిత్ రెడ్డికి తెలంగాణ ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. ప్రస్తుతం ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓగా కొనసాగుతున్న ఆయనను హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ అదనపు మేనేజింగ్ డైరెక్టర్ గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తాజా ఉత్తర్వుల మిగతా 2లో..

## ఆర్టీసీ కార్మికుల హామీలను నెరవేరుస్తున్నాం

- వాస్తవాలను వక్రీకరించే ప్రయత్నం తగదు
- మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టీకరణ

హైదరాబాద్,జూన్27 :తెలంగాణ ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. శనివారం ఉదయం మీడియాతో మాట్లాడుతూ... 32 డిమాండ్లలో 29 పరిష్కారానికి చర్యలు పూర్తి అయ్యాయన్నారు. 11శాతం పీఆర్సీ జులై



జీతాల నుంచే అమలు చేయనున్నట్లు తెలిపారు. గుర్తింపు సంఘాల ఎన్నికలను త్వరలో నిర్వహిస్తామన్నారు. విలీన కమిటీలో కార్మిక ప్రతినిధులకు చోటు కల్పిస్తామని చెప్పారు. గుర్తింపు సంఘం ఎన్నికల తర్వాతే విలీన కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు మిగతా 2లో..

## ఓటరు జాబితా ప్రత్యేక సవరణపై అప్రమత్తంగా ఉండాలి

- రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు కృతజ్ఞతలు
- బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్

విజన్ ఆంధ్ర(27)హైదరాబాద్ : ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, బూత్ లెవల్ ఏజెంట్లు అప్రమత్తంగా లేకపోతే అర్హులైన ఓటర్లు ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని తెలంగాణ బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, సర్ పార్లమెంట్



మిగతా 2లో..

## బంజారాహిల్స్ గోల్డెన్ టెంపుల్‌లో వైభవంగా పానిహటి చిడా దహీ మహోత్సవం



విజన్ ఆంధ్ర(27)హైదరాబాద్ : బంజారాహిల్స్‌లోని హరే కృష్ణ గోల్డెన్ టెంపుల్‌లో శనివారం పానిహటి చిడా దహి మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు, ఈ సందర్భంగా హైదరాబాద్‌తో పాటు జంట నగరాల నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు, హరినామ సంకీర్తనల్లో పాల్గొని భగవంతుని మిగతా 2లో..

## అర్హుల ఓట్లు తొలగించకుండా చూసుకోవాలి

- సర్ కార్యక్రమాన్ని సీరియస్‌గానే తీసుకోవాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

రంగారెడ్డి,జూన్ 27 : కార్యకర్తలే కథానాయకులై కదం తొక్కితే ప్రతి బూత్‌లో బీఆర్ఎస్ పార్టీకే మెజారిటీ వస్తదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం,ఎస్ఐఆర్ కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని కార్యకర్తలు అత్యంత సీరియస్‌గా తీసుకోవాలన్నారు. అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని దిశానిర్దేశం చేశారు. డిజిటల్ రూపంలో పార్టీ సభ్యత్వ మిగతా 2లో..



## పౌరసత్వానికి, పాస్‌పోర్టుకు తేడా తెలియదా?

- బాధ్యతాయుత పదవిలో ఉన్న ఎంపి ఇలాగేనా వ్యాఖ్యలు
- అసదుద్దీన్ వ్యాఖ్యలపై మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



హైదరాబాద్,జూన్ 27 :ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ భారత పాస్‌పోర్టులు, పౌరసత్వంపై ఇటీవల చేసిన వ్యాఖ్యలు చట్టపరంగా తప్పుదారి పట్టించేవిగా మిగతా 2లో..

# సంక్షేమంతో పాటు... అభివృద్ధి కూడా ముఖ్యమే

- కేవలం సంక్షేమంతో అభివృద్ధిని సాధించలేం
- రోడ్లు, ఆస్పత్రులు, స్కూళ్లను అభివృద్ధి చేయాలి
- కులాల పేరుతో హాస్టళ్ల ఏర్పాటు సరికాదు
- కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఇదే చేస్తున్నాం
- కేవలం బటన్ నొక్కితే వైకాపా గతేమయ్యిందో చూశాం
- అభివృద్ధిపై గ్రామస్థాయిలో జనసేన ఆధ్వర్యంలో చర్చ సాగాలి
- వైకాపా కులరాజకీయాలతో భ్రష్టు పట్టించే యత్నం
- 11 సీట్లు వచ్చినా తిట్ల దండకం ఆపని వైకాపా నేతలు
- జనసేన నిర్మాణ సారధుల కార్యాచరణ సమావేశంలో పవన్

అమరావతి,జూన్27 : ఒక్క సంక్షేమ పథకాలే కాదు..అభివృద్ధి కూడా ముఖ్యమన్నది జనసేన విదానమని ఆ పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. సంక్షేమ పథకాల మిగతా 2లో..




# నాలుగు జిల్లాల తలరాత మార్చే వెలిగొండ

- భూములు ఇచ్చిన రైతులు త్యాగం మరువలేనిది
- తొలివిడతలో నిర్వాసితులకు 300 కోట్ల పరిహారం
- కృష్ణాజలాలు వస్తాయని ఎవ్వరూ ఊహించలేదు
- గత ప్రభుత్వ పూర్తిచేయకుండానే ప్రారంభోత్సవం
- వెలిగొండ ప్రాజెక్టు ద్వారా లక్షల ఎకరాలకు సాగునీరు
- నిర్వాసిత రైతులతో సిఎం చంద్రబాబు భేటీ

మార్కాపురం,జూన్ 27 : నాలుగు జిల్లాల తలరాతలు మార్చే ప్రాజెక్టు వెలిగొండ అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. వెలిగొండ ప్రాజెక్టుకు భూములు ఇచ్చిన రైతుల త్యాగాలు వృథా కావని చంద్రబాబు అన్నారు. మార్కాపురం జిల్లా పర్యటనలో భాగంగా వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ పనులను పరిశీలించిన అనంతరం





నిర్వాసితులు, లబ్దిదారులతో సీఎం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. శనివారం దోర్నాల మండలం గంటావానిపల్లిలో వెలిగొండ ప్రాజెక్ట్ నిర్వాసితులు, రైతులతో సీఎం సమావేశమయ్యారు. అనంతరం మాట్లాడుతూ.. నీళ్లు లేక చాలా మంది ఫ్లోరైడ్ వాటర్ తాగుతున్నారని.. కృష్ణా నదీ జలాలు ఈ ప్రాంతానికి వస్తాయని ఎవరూ ఆలోచన చేసి ఉండరని తెలిపారు. రాయలసీమ, మార్కాపురం ప్రాంతానికి కృష్ణా జలాలు తీసుకురావాలని ఎన్టీఆర్ ఆలోచన చేశారని గుర్తుచేశారు.1996 మార్చి 26న వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రారంభించామని.. రూ.900 కోట్లు పునరావాసం కోసం కేటాయించామని అన్నారు. రూ.300 కోట్లు మొదటి విడతలో మిగతా 2లో..

## ఓటరు జాబితా ప్రత్యేక సవరణపై అప్రమత్తంగా ఉండాలి

కంట్రోల్ రూమ్ మహబూబాబాద్ కోఆర్డినేటర్ నూతి శ్రీకాంత్ గౌడ్ అన్నారు, శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో ప్రతి గ్రామం, ప్రతి బూత్‌లో బీఎల్‌వోలతో సమన్వయం పెంచుకుని అర్హులైన ఒక్క ఓటు కూడా తొలగి పోకుండా చూడాలని సూచించారు, ముఖ్యంగా ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన ఓటర్ల వివరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎన్నికల అధికారులు ఇంటింటి సర్వే నిర్వహించే సమయంలో వారు అందుబాటులో లేకపోతే వారి పేర్లు తొలగించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు, ఓటర్ల జాబితాలోని లోపాలను గుర్తించి వెంటనే సరిదిద్దాలని, సందేహాస్పద ఓట్లను నిబంధనల ప్రకారం పరిశీలించాలని ఆయన కోరారు, బూత్ లెవల్ ఏజెంట్లు క్షేత్ర స్థాయిలో చురుకుగా పనిచేసి అర్హులైన ప్రతి ఓటరికి ఓటు హక్కు కొనసాగేందుకు చర్యలు తీసుకోవాలని, ఈ సందర్భంగా తనను నర్ పార్లమెంట్ కంట్రోల్ రూమ్ మహబూబాబాద్ కో ఆర్డినేటర్‌గా నియమించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు నూతి శ్రీకాంత్ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు, ఎస్ఐఆర్ ప్రక్రియ ఉద్దేశం అర్హులైన ఓటర్ల పేర్లను జాబితాలో కొనసాగించడం, మరణించినవారు, డూప్లికేట్ పేర్లు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలి పోయిన వారి పేర్లను తొలగించడమే అని ఆయన వివరించారు

## బంజారాహిల్స్ గోల్డెన్ టెంపుల్‌లో వైభవంగా పానిహటి చిడా దహి మహోత్సవం

ఆశీస్సులు పొందారు, మహోత్సవంలో భాగంగా శ్రీశ్రీ నిత్యానంద గౌరాంగుల పల్లకి సేవ, అభిషేకం, మహా మంగళ హారతి, ఆధ్యాత్మిక ప్రవచనాలు నిర్వహించారు, అనంతరం భక్తులకు సంప్రదాయ అటుకులు పెరుగు ప్రసాదంతో పాటు మహా ప్రసాద విందును అందించారు, ఈ సందర్భంగా హరే కృష్ణ మూవ్‌మెంట్ హైదరాబాద్ అధ్యక్షులు శ్రీమాన్ సత్య గౌర చంద్ర దాస్ ప్రభుజీ మాట్లాడుతూ, పానిహటి చిడా దహి మహోత్సవం గురువు, వైష్ణవులకు సేవ చేయడం ద్వారా భగవంతుని కృపను పొందే గొప్ప సందేశాన్ని అందిస్తుందని పేర్కొన్నారు, కలియుగంలో హరే కృష్ణ మహామంత్ర జపమే మానవాళికి శాంతి, ఆధ్యాత్మిక ఆనందాన్ని ప్రసాదించే ఉత్తమ మార్గమని తెలిపారు, మహోత్సవంలో పాల్గొన్న భక్తులకు మహా ప్రసాదాన్ని పంపిణీ చేయగా, కార్యక్రమం భక్తి, ఆధ్యాత్మికత, సేవాభావాల సమ్మేళనంగా విజయ వంతంగా ముగిసింది

## 14 నైబర్‌హుడ్ సెంటర్లకు ఉచిత రవాణా

సంక్షేమం కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి, వారి అభివృద్ధికి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. 'వైకల్యం అనేది కేవలం శరీరక లోపమే. మానవత్వంలేని వారే అసలైన దివ్యాంగులు. ఇతరులను అవమానించే అహంకారం కూడా ఒక రకమైన వైకల్యమే. పుట్టుకతో వచ్చిన లోపాలను తల్లిదండ్రుల ప్రోత్సాహం, సరైన శిక్షణ, సమాజం సహకారంతో అధిగమించవచ్చు. చూపు, వినికిడి లేకపోయినా హెలెన్ కెల్లర్ ప్రపంచానికి స్ఫూర్తిగా నిలిచారు' అని అన్నారు. 'దివ్యాంగులను చీదరించుకుండా వారికి అవకాశాలు కల్పిస్తే అన్ని రంగాల్లో అద్భుతంగా రాణిస్తారు. బ్రెయిలీ వంటి సాంకేతిక పరిజ్ఞానం ద్వారా అనేక మంది దివ్యాంగులు తమ లక్ష్యాలను చేరుకుంటున్నారు. తల్లిదండ్రులపై ఉన్న ఆర్థిక, రవాణా భారాన్ని తగ్గించడానికే ఈ-ఆటోల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టాం' అని సీతక్క చెప్పారు. ఈ సందర్భంగా ఐఏసీఎల్‌కు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## సీషెల్స్ చేరుకున్న ప్రధాని మోదీ

వివిధ ప్రాంతాల సంస్కృతులను కాపాడుకుంటున్న తీరు నిజంగా అభినందనీయం' అని పేర్కొన్నారు. ఇక, పర్యటన సందర్భంగా ఇరు దేశాల మధ్య జరిగిన పలు ఒప్పందాలపై ప్రధాని మోదీ సంతకాలు చేశారు. అనంతరం బొటానికల్ గార్డెన్‌కు వెళ్లారు. 194 ఏళ్ల తాబేలును వీక్షించారు. ఆ తర్వాత ప్రవాస భారతీయులతో మోదీ సమావేశం అయ్యారు.

## రాష్ట్ర రోడ్లకు ఇక మహర్దశ

రూపకల్పన జరిగింది. కనగల్‌లో జరిగే ఈ శంకుస్థాపన కార్యక్రమానికి మంత్రులు, ఉన్నతాధికారులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరు కానున్నారు. ఈ పనులు పూర్తయితే తెలంగాణలో మౌలిక వసతుల రంగం సరికొత్త మైలురాయిని అధిగమిస్తుందని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని ప్రభుత్వం ధీమా వ్యక్తం చేస్తోంది.

**ప్రపంచాన్ని ఆకర్షిస్తున్న తెలంగాణ రైజింగ్**

తమ ప్రభుత్వం చేపట్టిన 'తెలంగాణ రైజింగ్' విజన్ దేశీయ, అంతర్జాతీయ సంస్థల దృష్టిని ఆకర్షిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలోని యువతకు నైపుణ్యాభివృద్ధి ద్వారా పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. తెలంగాణలో శిక్షణ పొందిన యువతకు ప్రముఖ బహుళజాతి సంస్థల్లో ఉద్యోగాలు లభిస్తున్నాయని వివరించారు. ఈ మేరకు సీఎం ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. ఇటీవల జరిగిన నియామకాల్లో ష్నైడెర్ ఎలక్ట్రిక్ సంస్థలో 47 మంది యువకులు ఉద్యోగాలు పొందారని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. పుణెలోని టాటా మోటార్స్ యూనిట్‌లో 36 మంది విద్యార్థులు ఎంపికయ్యారని చెప్పుకొచ్చారు. అలాగే ఫాక్స్‌కాన్ సంస్థకు చెందిన ఆపిల్ ఐఫోన్ విభాగంలో 14 మంది మహిళా విద్యార్థినులు ఉద్యోగాలు సాధించారని తెలిపారు. బ్లూ కాలర్ ఉద్యోగాల రంగంలో తెలంగాణను దేశానికే కేంద్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో తమ ప్రభుత్వం ముందుకు సాగుతోందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు శిక్షణ అందిస్తూ, ఉద్యోగ కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు వెల్లడించారు. తెలంగాణలో అందుబాటులో ఉన్న నైపుణ్యవంతమైన మానవ వనరులు, పారిశ్రామిక అనుకూల విధానాలు, మెరుగైన మౌలిక వసతులు ప్రపంచస్థాయి సంస్థలను ఆకర్షిస్తున్నాయని సీఎం తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని అంతర్జాతీయ కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టి ఉపాధి అవకాశాలు కల్పించే అవకాశముందని సీఎం రేవంత్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

## అభివృద్ధి పనులు వేగంగా చేపట్టాలి

ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ.. వర్షాకాలంలో తండా వాసులకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోకుండా ఉండేందుకే త్వరితగతిన పనులు పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. వానలు పడుతున్న అభివృద్ధి పనులు కొనసాగుతాయని.. నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశిత గడువులోగా పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మంత్రి వెంట జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, తదితరులు ఉన్నారు.

## హైదరాబాద్‌లో డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ

వాషింగ్టన్,జూన్27 : భారత్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ పక్కనున్న రహదారికి 'డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ' అని పేరు పెట్టిన నేపథ్యంలో ఆయన స్పందించారు. 'ఈ విధంగా గౌరవం పొందిన అమెరికా తొలి అధ్యక్షుడిని నేను. ధన్యవాదాలు భారత్' అంటూ ఆయన తన సామాజిక మాధ్యమ వేదిక 'ట్రూత్'లో పోస్టు చేశారు. అమెరికా 250వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 23న హైదరాబాద్‌లో ఓ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సులేట్ పక్కన ఉన్న రోడ్డుకు 'డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ'గా నామకరణం చేశారు. ఆ ప్రత్యేక ఫలకాన్ని అమెరికా రాయబారి సెర్గియో గోర్‌తో కలిసి తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క ఆవిష్కరించారు.మెరికాకు చెందిన కీలక టెక్ కంపెనీలు అయిన మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్‌లు ఈ రోడ్డుకు దగ్గర్లోనే ఉన్నాయి. ఈ పేరు మార్పును తెలంగాణ ప్రభుత్వం భారత్-అమెరికా సంబంధాలకు గుర్తింపుగా, అలాగే హైదరాబాద్ అంతర్జాతీయ సాంకేతిక కేంద్రంగా ఎదుగుతున్న నేపథ్యంలో తీసుకున్న ప్రతీకాత్మక నిర్ణయంగా పేర్కొంది. ఈ నేపథ్యంలో ట్రంప్ ధన్యవాదాలు తెలియజేశారు.

## అర్హుల ఓట్లు తొలగించకుండా చూసుకోవాలి

నమోదును పెద్దఎత్తున విజయవంతం చేయండిప్రతి కార్యకర్తకు పార్టీ తరఫున ప్రత్యేక గుర్తింపు కార్డును ఇస్తామన్నారు. ఈ గుర్తింపు కార్డుతో కార్యకర్తలు ఎక్కడికెళ్లినా గౌరవం లభిస్తుందన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల యుద్ధానికి? ఇప్పటి నుండే పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మహేశ్వరంలో బీఆర్ఎస్ కార్యకర్తల జోష్ చూస్తుంటే.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలిచిపోయినట్లు కనిపిస్తుందన్నారు. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అయిపోయినారని అనిపిస్తోందన్నారు. మహేశ్వరంలో మరోసారి సబితమ్మ గెలుపు తథ్యమని తేలిపోయింది. అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడొచ్చినా.. కాంగ్రెస్ బంగాళాఖాతంలో కలిసేది పక్కా. బ్రహ్మాండంగా బీఆర్ఎస్ గెలిచేది పక్కా. రాష్ట్రంలో గులాబీ జెండా ఎగిరేది పక్కా తెలంగాణ నలుదిశలా ఒకే నినాదం మారుమోగుతోంది.. అదే కాంగ్రెస్ పోవాలె.. కేసీఆర్ రావాలె. రాష్ట్రంలో వికాసం పోయింది.. విధ్వంసం, విషాదం మాత్రమే మిగిలిందన్నారు. కేసీఆర్ కిట్ పోయింది.. కరెంటు కోతల కాలం వచ్చింది.రైతుబంధు పోయింది.. రాహుల్ బంధు వచ్చింది. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు పాతాళ.. కుంభకోణాల జాతర నడుస్తోంది. సీఎంగా రేవంత్ ఉన్నా.. ప్రజలు కేసీఆర్ తలుచుకుంటున్నరని కేటీఆర్ గుర్తు చేశారు. తెలంగాణలో ఉద్యమంలో మహేశ్వరం ముద్దుబిడ్డ సిరిపురం యాదయ్య ఓయూ వద్ద రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేశారు. ఎంతోమంది అమరవీరుల త్యాగాల స్ఫూర్తితోనే.. పదేళ్ల పాలన సాగింది. ప్రజాసంక్షేమం.. ప్రగతిపథం.. రెండు జోడెడ్లలా ముందుకు సాగాయి. ఇవాళ బీఆర్ఎస్ ఓడిపోవడం వల్ల ఎవరు నష్టపోయారో ఆలోచించండి. కేసీఆర్‌కు పదవులు కొత్త కాదు. ఎన్నో పదవులను త్యాగం చేశారని.. 50 సంవత్సరాల సుదీర్ఘ అనుభవం కేసీఆర్ సొంతం కేటీఆర్ పేర్కొన్నారు.

## ఆర్టీసీ కార్మికుల హామీలను నెరవేరుస్తున్నాం

మంత్రి తెలిపారు. విలీన పక్రియపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు వెళ్తుందన్నారు. కార్మికులను తప్పుదోవ పట్టించే ప్రచారాలను నమ్మొద్దన్నారు. ఎన్నికల నోడల్ అధికారిగా జేఎల్‌సీ సునీత నియామకం జరిగిందన్నారు. ఏపీ తరహా ఇబ్బందులు రాకుండా విలీన విధివిధానాలను రూపొందించనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తోందని రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. కొంతమంది కార్మిక సంఘాల నాయకులు వాస్తవాలను వక్రీకరిస్తూ కార్మికులను, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం బాధాకరమని ఆయన అన్నారు. ఆర్టీసీ సమ్మె సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రులు పొన్నం ప్రభాకర్ , శ్రీధర్ బాబు, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో లతో కలిసి చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు తో పాటు సీనియర్ ఐఏఎస్ అధికారులు ౖ÷నాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వికాస్ రాజ్, లేబర్ అండ్ ఎంప్లాయిమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ దానా కిషోర్ , ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి ,ఇతర ఆర్టీసీ ఉన్నతాధికారులు, ప్రతి కార్మిక సంఘం నుంచి ఇద్దరు చొప్పున దాదాపు 30 మంది కార్మిక సంఘాల ప్రతినిధులతో సుదీర్ఘంగా 14 గంటల పాటు చర్చించి అందరి ఆమోదంతో ఏకగ్రీవ నిర్ణయాలు తీసుకున్నామని మంత్రి గుర్తుచేశారు. సమావేశంలో మొత్తం 32 డిమాండ్లలో 29 అంశాలు ఆర్టీసీ యాజమాన్యం పరిధిలో, మూడు అంశాలు ప్రభుత్వ పరిధిలో ఉన్నట్లు నిర్ణయించడం జరిగిందన్నారు. యాజమాన్యం పరిధిలో ఉన్న 29 అంశాల పరిష్కారానికి ఈడి ల కమిటీ ద్వారా ఇప్పటికే చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పరిధిలో ఉన్న మూడు కీలక అంశాలైన ఆర్టీసీ గుర్తింపు సంఘాల ఎన్నికలు, 2021 పీఆర్సీ, ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం.పీఆర్సీ విషయంలో ప్రభుత్వం ప్రకటించిన 11 శాతం జూలై నెల జీతాల నుంచే అమల్లోకి రానుందని తెలిపారు. ఆర్టీసీ కార్మికుల మొదటి డిమాండ్ ఆర్టీసీ గుర్తింపు సంఘాలు ఎన్నికలు అని ఇప్పుడు మాట మార్చి ప్రజలను,కార్మికులను పక్కదోవ పట్టించడం సరికాదన్నారు. ఆర్టీసీ విలీనానికి సంబంధించి విధివిధానాలు రూపొందించే అధికారుల కమిటీలో కార్మిక ప్రతినిధులు తప్పనిసరిగా ఉండాలని సమావేశంలో కార్మికులు ఏకగ్రీవంగా నిర్ణయించారని మంత్రి పేర్కొన్నారు. అయితే ఆ కమిటీలో ఉండే కార్మిక నాయకులు గుర్తింపు పొందిన సంఘం నుంచి ఉండాలంటే ముందుగా గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించాలనే నిర్ణయం అందరి సమక్షంలో తీసుకున్నామని వెల్లడించారు. దీనిలో భాగంగానే ప్రభుత్వం ఇప్పటికే గుర్తింపు సంఘాల ఎన్నికల పక్రియను ప్రారంభించిందని, లేబర్ జాయింట్ కమిషనర్ సునీతను ఎన్నికల నోడల్ అధికారిగా నియమించినట్లు తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసి త్వరలోనే గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించే దిశగా వెరిఫికేషన్ పక్రియ కొనసాగుతుందని చెప్పారు. కార్మికుల ప్రయోజనాలను కాపాడేందుకే ముందుగా గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించి, ఆ సంఘం నుంచి ప్రతినిధులను విలీన కమిటీలో చేర్చే పక్రియను ప్రభుత్వం అనుసరిస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్ మాదిరి విలీనం తర్వాత ఇబ్బందులు కలగవద్దని గుర్తింపు కార్మిక సంఘాల నేతలను కమిటీ లో చేర్చి విధివిధానాలు రూపొందించేలా నిర్ణయం తీసుకున్నామన్నారు.ఈ పరిస్థితుల్లో కొంతమంది కార్మిక సంఘాల నాయకులు గుర్తింపు సంఘాల ఎన్నికలు జరగకుండా, విలీన పక్రియను కూడా వివాదాస్పదం చేసేలా వ్యవహరించడం సరికాదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తోందని, కార్మికులు వాస్తవాలను గుర్తించి అసత్య ప్రచారాలను నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. మాట మీద నిలబడే కాంగ్రెస్ ప్రభుత్వం విలీన పక్రియ గురించి భవిష్యత్ లో ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలని గుర్తింపు సంఘం కార్మిక నేతలను కమిటీ లో చేర్చి విలీన విధివిధానాలు రూపొందించాలని భావిస్తుంది దీనిని సమస్త కార్మిక లోకం గమనించగలరని అన్నారు.

## పౌరసత్వానికి, పాస్‌పోర్టుకు తేడా తెలియదా?

ఉన్నాయని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఒక ప్రజాప్రతినిధిగా, న్యాయవాదిగా ఉన్న అసదుద్దీన్‌కు పాస్‌పోర్టుకు, పౌరసత్వానికి మధ్య ఉన్న చట్టపరమైన తేడాలు తెలిసి ఉండాలని ఆయన హితవు పలికారు. రాజ్యాంగ బద్ధమైన పదవుల్లో ఉన్నవారు బాధ్యతాయుతంగా మాట్లాడాలని పేర్కొన్న కిషన్ రెడ్డి.. ప్రజలను తప్పుదారి పట్టించే ముందు అసదుద్దీన్ ఒవైసీ పౌరసత్వ చట్టం1955, పాస్‌పోర్ట్ చట్టం1967లను మరోసారి క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని సూచించారు. అసదుద్దీన్ వ్యాఖ్యలు చట్టంపై ఆయనకున్న అవగాహన లోపాన్ని, రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల్లో అయోమయం సృష్టించే ప్రయత్నాన్ని సూచిస్తున్నాయని మండిపడ్డారు. విదేశాంగ మంత్రిత్వ శాఖ ఇచ్చిన వివరణను కొందరు తప్పుగా చిత్రీకరిస్తున్నారని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. విదేశాంగ శాఖ వివరణ ప్రకారం భారత పాస్‌పోర్టు విలువలేనిదని అర్థం కాదని, పాస్‌పోర్టు ఒక్కటే భారత పౌరసత్వానికి తుది, ఖచ్చితమైన ఆధారం కాదని మాత్రమే ప్రభుత్వం పేర్కొందని ఆయన వివరించారు. భారత పౌరసత్వం అనేది ఎల్లప్పుడూ భారత రాజ్యాంగం , పౌరసత్వ చట్టం1955 ప్రకారమే నిర్ణయించబడుతుందని స్పష్టం చేశారు. పాస్‌పోర్ట్ చట్టం1967 ప్రకారం పాస్‌పోర్టు అనేది ప్రధానంగా విదేశీ ప్రయాణాల కోసం ఉపయోగించే ఒక పత్రం (÷సజీల ఆనీఇబీపనిబి) మాత్రమేనని కేంద్ర మంత్రి తెలిపారు. ఆ చట్టంలోని సెక్షన్ 20 ప్రకారం.. ప్రజాహితం దృష్ట్యా భారత పౌరుడు కాని వ్యక్తికి కూడా కేంద్ర ప్రభుత్వం పాస్‌పోర్టు లేదా ట్రావెల్ డాక్యుమెంట్‌ను జారీ చేసే ప్రత్యేక అధికారాన్ని కలిగి ఉంటుందని గుర్తుచేశారు. గతంలో కూడా ఇటువంటి ప్రత్యేక సందర్భాలు ఉన్నాయని, అందువల్ల పాస్‌పోర్టును మాత్రమే పౌరసత్వానికి తుది ప్రాతిపదికగా పరిగణించలేమని చెప్పారు. ఇది ఇప్పటికప్పుడు తెచ్చిన కొత్త నిబంధన కాదని, 1967లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఈ చట్టం అమల్లోకి వచ్చిందని తెలిపారు. దాదాపు 60 ఏళ్లుగా అమల్లో ఉన్న చట్టపరమైన అంశాన్ని ఇప్పుడు మోదీ ప్రభుత్వంపై నెట్టడం అవగాహన లోపమో, లేదా వాస్తవాలను దాచిపెట్టే కుట్రో అవుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పౌరసత్వ చట్టం1955 ప్రకారం ఒక వ్యక్తికి భారత పౌరసత్వం అనేది జననం, వంశపారంపర్యం, నమోదు లేదా నేచురలైజేషన్ పక్రియల ద్వారా మాత్రమే లభిస్తుందని కిషన్ రెడ్డి వివరించారు. గతంలో 2013లో బొంబాయి హైకోర్టు ఇచ్చిన తీర్పును ప్రస్తావిస్తూ.. పాస్‌పోర్టు, జనన ధృవీకరణ పత్రం వంటి పత్రాలు మాత్రమే పౌరసత్వాన్ని నిరూపించడానికి పూర్తిగా సరిపోవని న్యాయస్థానం స్పష్టం చేసిందని, దేశంలోని ఇతర హైకోర్టులు కూడా ఇదే సూత్రాన్ని అనుసరించాయని గుర్తుచేశారు. విదేశాంగ మంత్రిత్వ శాఖ ఎలాంటి కొత్త విధానాన్ని లేదా నిబంధనను ప్రకటించలేదని, దేశ చట్టాలు, న్యాయస్థానాలు ఇప్పటికే స్పష్టం చేసిన పాత అంశాన్నే మరోసారి పునరుద్ఘాటించిందని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

## నాలుగు జిల్లాల తలరాత మార్చే వెలిగొండ

నిర్వాసితులకు ఇస్తున్నామని చెప్పారు. ఏపీలో చాలా ఇబ్బందులు ఉన్నాయని సీఎం అన్నారు. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వొచ్చు. సుంకేశుల గ్యాప్ పనులను 1998లోనే ప్రారంభించాం. గత ప్రభుత్వాలు కూడా మాలాగే చేసుంటే పరిస్థితి మరోలా ఉండేది. మార్కాపురం జిల్లాలో పండ్ల తోటలు బాగా రావాలన్నారు. భూములు ఇచ్చిన రైతుల త్యాగం గొప్పది. మీరు ఇచ్చిన భూముల వల్ల నాలుగైదు జిల్లాలు బాగుపడతాయి. వెలిగొండ నీళ్లు వచ్చాక చుట్టుపక్కల భూముల విలువ పెరుగుతుంది. మాది ప్రజా ప్రభుత్వం.. అందరికీ లబ్ది చేకూరుస్తాం. కరవు జిల్లా పరిస్థితులు తెలిసిన కలెక్టర్‌ను నియమించామని సీఎం తెలిపారు.మోసాలు చేయడంలో గొడ్డలి పార్టీ నేతలు దిట్ట. వైకాపా నేతలు కళ్లు ఆర్పకుండానే అబద్ధాలు చెబుతున్నారు. ఆ పార్టీ నేతలు ఇప్పుడు వితండవాదం చేస్తున్నారు. వెలిగొండ పేరుతో వైకాపా ప్రభుత్వం అనేక మోసాలు చేసింది. టన్నెల్-2లో బోరు ఇరుక్కు పోయినా ప్రాజెక్టును ప్రారంభించేశారని మండిపడ్డారు. నక్సలిజంపై పోరాటం చేశానని.. క్లైమోర్ బాంబులు పెడితే వేంకటేశ్వరస్వామి తనను కాపాడారన్నారు. గత పాలకులు రూ.10 లక్షల కోట్లు అప్పులు పెట్టిపోయారని విమర్శించారు. 3,351 వెలిగొండ నిర్వాసిత కుటుంబాలకు రూ.300 కోట్లు జమ చేశామన్నారు. నిర్వాసితుల త్యాగం వృథా కాదని.. అందరికంటే మెరుగైన జీవితం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. వెలిగొండ ప్రాజెక్టుపై ఈ టర్మ్‌లో రూ.3,900 కోట్ల వ్యయం అవుతోందన్నారు. 2027 నాటికి మిగిలిన పనులన్నీ పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఫేజ్-1, ఫేజ్-2 పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఇడుపూరు, గోగులదిన్నే, తోకపల్లి తదితర పునరావాస కాలనీల్లో మౌలిక వసతులు పూర్తి చేశామన్నారు. మార్కాపురానికి ప్రత్యేక జిల్లా ఇచ్చామని.. కలెక్టరేట్ కూడా పునరావాస కాలనీ పక్కనే వస్తుందని తెలిపారు. పునరావాస కాలనీ భవిష్యత్తులో ఆదర్శ టౌన్‌షిప్‌గా అభివృద్ధి చెందుతుందని అన్నారు.4.47 లక్షల ఎకరాలకు సాగునీరు.. 23 లక్షల మందికి తాగునీరు అందేలా వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం జరుగుతోందని సీఎం తెలిపారు. 43.5 టీఎంసీల నీటిని వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. సుంకేసుల, గొట్టిపడియ డ్యామ్‌లకు రూ.120 కోట్ల పరిపాలనా అనుమతి ఇచ్చామని.. రూ.98 కోట్లతో సుంకేసుల పనులను ప్రారంభించినట్లు చెప్పారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లే వెలిగొండ ఆలస్యమైందని విమర్శించారు. పదేళ్ల ముందే ప్రాజెక్టు పూర్తయి ఉంటే రైతుల జీవితాలు మారిపోయేవన్నారు. గొడ్డలి పార్టీ మోసాలు డిజిటల్ మోసాలుగా ఉన్నాయని వ్యాఖ్యానించారు. ఎన్నికల ముందు డ్రామాలు, మోసాలతో ప్రజలను తప్పుదోవ పట్టించారని మండిపడ్డారు. డిజిటల్ అరెస్ట్ మోసాల తరహాలో వైసీపీ మోసాలు అంటూ దుయ్యబట్టారు. 2024లో కేటాయించిన నిధులను గత ప్రభుత్వం సరిగా వినియోగించలేదన్నారు. టన్నెల్-2లో యంత్రం చిక్కుకుపోయినా తొలగించకుండా ప్రారంభోత్సవం చేశారని విమర్శించారు. నిర్వాసితులకు న్యాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రాజెక్టుల కోసం భూములు ఇచ్చిన రైతులకు నష్టం జరగనివ్వమని.. బాధిత రైతులందరికీ న్యాయం చేయడం ప్రభుత్వ బాధ్యత అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వెలిగొండ ప్రాజెక్టుతో నాలుగు జిల్లాల అభివృద్ధి, భూముల విలువ పెరుగుతుందని చెప్పారు. ప్రతి నిర్వాసిత కుటుంబానికి పూర్తి న్యాయం చేస్తామన్నారు. వెలిగొండ పెండింగ్ బిల్లులన్నీ చెల్లించామని తెలిపారు. మార్కాపురం జిల్లాకు కరువు పరిస్థితులు తెలిసిన కలెక్టర్‌ను నియమించామని.. ఈ ప్రాంతంలో హార్టికల్చర్‌కు పెద్దపీట వేస్తామన్నారు. మార్కాపురాన్ని హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేస్తామని అన్నారు. హార్టికల్చర్ అభివృద్ధికి రూ.1 లక్ష కోట్ల ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. రూ.40 వేల కోట్లు ప్రభుత్వం, రూ.60 వేల కోట్లు ప్రైవేట్ పెట్టుబడులు పెట్టనున్నట్లు వెల్లడించారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలతో స్థానిక యువతకు ఉద్యోగాలు లభిస్తాయన్నారు. ఎఫ్‌పీఓల ద్వారా రైతుల ఆదాయం పెంచే చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.రామాయపట్నం పోర్టు, ఎయిర్‌పోర్ట్‌తో ఎగుమతులకు అవకాశముందని సీఎం అన్నారు. రోడ్లు, రైల్వే కనెక్టివిటీతో ప్రాంత అభివృద్ధి వేగవంతం చేస్తామన్నారు. అన్నదాత సుఖీభవ పథకంలో రైతులకు ఏడాదికి రూ.20 వేల సాయం అందిస్తున్నామని.. మైక్రో ఇరిగేషన్‌కు మళ్లీ ప్రోత్సాహం అందిస్తామన్నారు. సాగునీటి ప్రాజెక్టులకు రూ.24 వేల కోట్లు ఖర్చు చేశామన్నారు. హంద్రీ-నీవా పూర్తి చేసి చివరి ప్రాంతాలకు నీళ్లు అందించామని వెల్లడించారు. పోలవరం ఆలస్యం వల్ల రాష్ట్రంపై భారీ ఆర్థిక భారం పడిందన్నారు.

# సంక్షేమంతో పాటు... అభివృద్ధి కూడా ముఖ్యమే

విషయంలో జనసేన పార్టీకి ఎలాంటి వ్యతిరేకత లేదని అన్నారు. నిజంగా నిస్సహాయ పరిస్థితుల్లో ఉన్నవారికి ప్రభుత్వ సహాయం, ఉచిత పథకాలు అవసరమేనని ఆయన పేర్కొన్నారు. అయితే సంక్షేమం పేరుతో మాత్రమే ప్రభుత్వాన్ని నడపడం సాధ్యం కాదని, ప్రజలు అభివృద్ధిని కూడా కోరుకుంటారని వ్యాఖ్యానించారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జనసేన నిర్మాణ సారధుల సమాచార సేకరణ కమిటీ కార్యాచరణ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రోడ్లు, ఆసుపత్రులు, స్కూళ్ల అభివృద్ధి కూడా చాలా ముఖ్యమని అన్నారు. దీనిపై గ్రామస్థాయిలోనే చర్చ సాగాలని పార్టీ నేతలకు పవన్ సూచించారు. కేవలం బటన్ నొక్కి నగదు బదిలీలు చేస్తే ప్రజలు ఎప్పటికీ ఓట్లు వేస్తారనే భావన సరికాదని అన్నారు... అలాంటి రాజకీయాలకు నిలువెత్తు ఉదాహరణ గత ప్రభుత్వం అని, సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన కూడా సమానంగా ఉండాలని ఆయన చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, రోడ్ల నిర్మాణం వంటి అంశాలు నిర్లక్ష్యానికి గురయ్యాయని పవన్ విమర్శించారు. ప్రస్తుతం ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు మెరుగైన రహదారులు, మౌలిక వసతులు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఎంతసేపు బటన్ నొక్కి డబ్బులు పంపించామని చెప్పడం కంటే, ప్రజలు ప్రయాణించే రోడ్లు ఎవరు వేశారు? దశాబ్దాలుగా నిర్మించని రహదారులు ఇప్పుడు ఎలా నిర్మితమయ్యాయి? అనే విషయాలను కూడా చూడాలని పవన్ కల్యాణ్ అన్నారు.. ప్రజలకు సంక్షేమం ఎంత అవసరమో, నాణ్యమైన రహదారులు, ఆసుపత్రులు, ఇతర మౌలిక వసతులు కూడా అంతే అవసరమని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వాలు తమ బాధ్యతగా అభివృద్ధిపై దృష్టి పెట్టకపోతే, ఎన్ని ఉచిత పథకాలు అమలు చేసినా ప్రజలు పూర్తిస్థాయిలో సంతృప్తి చెందరని పేర్కొన్నారు. వైకాపా నేతలు ఎప్పుడూ విధానాలపై మాట్లాడరని.. తిట్ల దండకం అందుకుంటారని జనసేన అధినేత, అన్నారు. గతంలో కాకినాడకు చెందిన వైకాపా నేత ఎంత దారుణంగా దూషించారో అంతా చూశారన్నారు. 11 సీట్లు వచ్చిన తర్వాత కూడా వైకాపా నేతలు ఏమాత్రం తగ్గకుండా మాట్లాడుతున్నారని అన్నారు. జనసేన నేత పంతం నానాజీ మాట్లాడిన మాటలు తాను విన్నానన్న పవన్.. అలాంటి వాటిని ప్రోత్సహించ నని చెప్పారు. కుల రాజకీయాలను ఎప్పటికీ ప్రోత్సహించనని, దేశ వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీల పేరిట వేర్వేరు హాస్టళ్లు ఉండకూడదని పవన్ కల్యాణ్ అన్నారు. పిల్లలందరికీ ఒకటే హాస్టల్ ఉండాలని కోరుకుంటున్నట్టు చెప్పారు. కులాలతో రాజకీయాలు చేయను, చేయబోనని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో పనిచేసిన వారి వివరాలు ఎప్పటికప్పుడు సేకరిస్తా. సమాచారాన్ని పారదర్శకంగా సేకరించడమే కమిటీల బాధ్యత. కమిటీల ఎంపికపై కొందరు విమర్శలు చేస్తున్నారు.. అది సరికాదు. ఎన్ని ఏళ్లుగా కష్టపడుతున్నారనే దాన్ని బేరీజు వేసుకున్నాం. కమిటలో ఉన్న వారికి విధివిధానాలు అందిస్తాం. సేకరించిన సమాచారాన్ని నా దృష్టికి తేవాలి. ఎన్నో ఏళ్లుగా కష్టపడుతున్న వారిని గుర్తించాలని పవన్ సూచించారు. గాదె సాయికృష్ణ వివాదంపై పవన్ కల్యాణ్ స్పందించారు. కృష్ణలంకలో ఒక గొడవ జరిగితే క్రిమినల్‌కు కులాన్ని ఎలా అంటగడుతున్నారని ప్రశ్నించారు. తప్పు ఎవరు చేసినా.. ఏ కులం వారు చేసినా.. తప్పే కదా అని నిలదీశారు. కాపు అయితే ఒప్పు.. ఇంకొకరు అయితే తప్పు అవుతుందా అని ప్రశ్నించారు. తనకు పేపర్లు, ఛానళ్లు లేవని.. జనసైనికులే తన మీడియా అని వ్యాఖ్యానించారు. ఇలాంటి అంశాలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అన్నివర్గాలను సమానంగా చూడటమే సామాజిక న్యాయమని తెలిపారు. కుల రాజకీయం పొలిటికల్ విక్టరీ అవుతుందేమో గానీ.. సామాజిక విక్టరీ కాదని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. అధికారం ఎప్పుడూ జగన్ అండ్ కో చేతిలోనే ఉండాలా అని ప్రశ్నించారు. వైసీపీ వాళ్లను చూడాలి.. ప్రతి అంశంలోనూ కులాన్ని, మతాన్ని కూడా వాడతారని ఎద్దేవా చేశారు. వైసీపీలో పనిచేసిన నాయకులు మన వేదిక మీద ఉన్నారని ప్రస్తావించారు. వీరు దిగజారి మాట్లాడిన దాఖలాలు ఎప్పుడైనా చూశారా అని ప్రశ్నించారు. వైసీపీలో ఇతర నేతలు నోరు తెరిస్తే అసభ్య వ్యాఖ్యలే చేస్తారని.. వ్యక్తిత్వ హననాలు చేస్తారని చెప్పుకొచ్చారు. బాలినేని శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్ మనిషి.. ఆయన విలువలతో మాట్లాడారని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. 18వేల మంది సాధక్‌లను కలవాలనేది తన భావన అని పవన్ కల్యాణ్ చెప్పుకొచ్చారు. ప్రతి ఊరిలో బాధ్యతలు అప్పగించిన నాయకుడు.. అక్కడ 2వేల మంది ప్రజలకు తెలిసి ఉండాలని తెలిపారు. ఎమ్మెల్సీ నాగబాబును అరకుకు పంపించామని.. ఆయన జనాలతో మాట్లాడతారని.. ప్రకృతిని సంరక్షిస్తారని అన్నారు. పల్నాడుకు బాలినేని శ్రీనివాసరెడ్డి కరెక్టు అని భావించి.. ఆ బాధ్యత అప్పగించామని చెప్పారు. కాకినాడను తట్టుకోవాలంటే.. సామినేని ఉదయభాను కరెక్టు అని భావించామని తెలిపారు. మంత్రి కందుల దుర్గేశ్‌ని అమలాపురం పంపితే బంధువులు ఎక్కువ అని అన్నారని చెప్పారు. మొహమాటానికెళ్లి.. ఎవరినైనా పెట్టాల్సి వస్తుందేమేనని ఆయన అన్నారని చెప్పారు. కానీ ఈ విషయంలో పని చేసే వారికే ప్రాధాన్యం అనేది ప్రజల్లోకి వెళ్లాలని సూచించారు. 'పుష్కర కాలం పాటు మీరంతా నలిగారని.. మీరు ఏపని చేస్తున్నారో కాదు.. దేశానికి సేవ చేసే వారిని ప్రోత్సహిస్తా' అని స్పష్టం చేశారు. తనకు దేశం తర్వాతే ఏదైనా.. కులం అనేది సోషల్ రియాలిటీ అని చెప్పుకొచ్చారు. తాను ఈ విషయాన్ని మార్చాలనో, సరిదిద్దాలనో ప్రయత్నం చేయనని పేర్కొన్నారు. తాను కులాల గురించి మాట్లాడతానని కొంతమంది అంటారని.. తాను కులం కార్డు తీసుకుని ఎప్పుడూ పాలిటిక్స్ చేయనని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. రాష్ట్రం బాగుండాలని, దేశం బాగుండాలని.. మానవత్వం ఉండాలనేదే తన ఆలోచన అని వ్యాఖ్యానించారు. కులం ఎప్పుడూ ఇంటి గడప లోపలే ఆగిపోవాలని.. గడప దాటాకా మన సంస్కృతి, ధర్మాలు ఉండాలని సూచించారు. ఇంకో పది అడుగులు వేస్తే.. దేశం, మానవత్వం గుర్తుకు రావాలని తెలిపారు. స్థాయికి దిగజారి మాట్లాడే వారికి కూడా కౌంటర్‌గా తాను మాట్లాడాల్సి వస్తుందని అన్నారు. క్షేత్రస్థాయిలోకి మీరంతా ఓ మెసేజ్ తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ హాస్టల్స్ కాకుండా పిల్లలు అందరికీ ఒకే హాస్టల్ ఉండాలనేది తన కోరిక అని ఉద్ఘాటించారు. ఆయా ప్రభుత్వాలే దశాబ్దాలుగా ఈ కులాల పేరుతో పిల్లలను విడదీస్తున్నాయని చెప్పుకొచ్చారు. ఓట్ల కోసం ప్రజల్లోకి వెళ్తే.. ఇటు దళితులు, అటు కాపులు, ఈ రోడ్డులో బీసీలు అంటూ విడగొట్టి మాట్లాడతారని అన్నారు. రాజకీయం ఇలానే నడుస్తుందనేది తనకు తెలియదని.. తనకు కులాల ఐక్యత ముఖ్యమని స్పష్టం చేశారు. కులం ఐడెంటిటీని తాను మార్చలేనని... లింగమనేని రమేశ్‌కు రాజ్యసభ ఇస్తే.. ఆ కులం మీద కొంతమంది చర్చ, రచ్చ చేశారని పవన్ కల్యాణ్ ప్రస్తావించారు. శివ లాగానే రమేశ్‌ని గుర్తించి.. ఆయన పడిన కష్టానికి తాను బాధ్యతలు అప్పగించానని అన్నారు. కొవైసీపీ పొలిటకల్ గేమ్ కోసం తన మీద విమర్శలు చేయడం తగదని హితవు పలికారు. ఇన్ని బలమైన కులాలు ఉండి అధికారంలోకి ఎందుకు రాలేకపోతు న్నాయని ప్రశ్నించారు. బీసీ సామాజిక వర్గాలు 105 కులాలు ఉంటే.. కాపుల్లో బలిజ, ఒంటరి, తెగలు ఉన్నాయని వివరించారు. ఇప్పటి వరకు అధికారం కోసం తాను పని చేయలేదని.. అవకాశాలు అడిగే స్థాయిలోనే ఉన్నానని తెలిపారు. యాభై శాతం బీసీ కులాలు ఉన్నవారంతా కలెక్టివ్‌గా ఉండి అధికారం సాధించుకోవచ్చు కదా అని చెప్పారు.

## రెండేళ్లలో 500 నగరాలకు భారత్ ట్యాక్సీ సేవల

హోం మంత్రి అమిత్ షా చెప్పారు. గుజరాత్‌లో తాజాగా భారత్ ట్యాక్సీ సేవలను ఆయన ప్రారంభించారు. కోఆపరేటివ్ మోడల్‌లో డ్రైవర్లే భాగస్వాములుగా ఉండే ఈ యాప్ ప్రారంభ వేడుకల్లో హోం మంత్రి ప్రసంగిస్తూ ట్యాక్సీ సేవలు ప్రస్తుతం నిత్యావసరంగా మారాయని అన్నారు. భారత్ ట్యాక్సీలో ఇలాంటి శ్రమదోపిడీ ఉండదని హోం మంత్రి హామీ ఇచ్చారు. ఒక న్యాయమైన ప్రత్యామ్నాయంగా నిలుస్తుందని అన్నారు. ఇటీవల కాలంలో ఈ రంగం గణనీయంగా విస్తరించిందని అన్నారు. ప్రస్తుతం ద్విచక్రవాహనాలు కూడా బైక్ ట్యాక్సీలుగా కుంభమేళా లాంటి భారీ ఈవెంట్స్‌లో ఉపయోగపడుతున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా ప్రైవేటు రైడ్ హెయిలింగ్ యాప్స్‌పై కూడా విమర్శలు గుప్పించారు. కార్పొరేట్ యాప్‌లు ఒక క్రమపద్ధతితో శ్రమదోపిడీ చేస్తున్నాయని విమర్శించారు. రవాణా ఆపరేటర్లను డ్రైవర్లుగా పిలవడం కంటే సారథులని పిలుస్తానని చెప్పారు. ప్రైవేటు ఆపరేటర్లే అధిక శాతం లాభాలు దండుకుని వర్కర్లను వేధించిన ఘటనలు ఉన్నాయని అన్నారు. వినియోగదారులు, డ్రైవర్లకు ఎలాంటి నష్టం చేకూర్చని వ్యవస్థ ఇదేనని అన్నారు. ఇప్పటికే 7 లక్షల మంది డ్రైవర్లు ఈ యాప్‌లో భాగస్వాములయ్యారని అన్నారు. సుస్థిర ఆర్థిక భద్రతను సొంతం చేసుకున్నారని అన్నారు. భారత్ ట్యాక్సీలో రేట్లు ఎక్కువగా ఉన్నాయన్న వాదనలను కూడా హోం మంత్రి కొట్టిపారేశారు. ప్రత్యర్థి యాప్‌లు కావాలనే వ్యూహాత్మకంగా తమ ధరలను తగ్గిస్తున్నాయని కూడా హోం మంత్రి ఆరోపించారు. ఈ యాప్‌ను మార్కెట్ నుంచి తప్పించేందుకు ఈ వ్యూహాన్ని అమలు చేస్తున్నారని ఆరోపించారు. 'వాళ్లు ఇలా ఎంతకాలం చేయగలరు? భారత్ ట్యాక్సీ అలసిపోదు, యుద్ధ మైదానాన్ని వీడదు. నిలిచి పోరాడుతుంది. విజయం సాధిస్తుంది' అని అన్నారు. భారత్ ట్యాక్సీ దీర్ఘకాలిక అభివృద్ధికి సారథులు (డ్రైవర్లు), వినియోగదారులే బాధ్యులని అన్నారు. ఇతర కోఆపరేటివ్ సంస్థలు విజయం సాధించిన వైనాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు.

## అజిత్ రెడ్డికి మెట్రో అడిషన్ ఎండిగా అదనపు బాధ్యతలు

ప్రకారం.. ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓగా తన బాధ్యతలను కొనసాగిస్తూనే హైదరాబాద్ మెట్రో రైల్ అదనపు ఎండీగా కూడా అజిత్ రెడ్డి విధులు నిర్వర్తించనున్నారు. అజిత్ రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి బదిలీ చేసిన విషయం తెలిసిందే. బదిలీ అనంతరం తాజాగా ఆయనకు హైదరాబాద్ మెట్రో రైల్‌లో కీలక అదనపు బాధ్యతలు అప్పగించడం ప్రాధాన్యం సంతరించుకుంది. కాగా.. ప్రస్తుతం హెచ్ఎంఆర్ఎల్ మేనేజింగ్ డైరెక్టర్‌గా సర్ఫరాజ్ అహ్మద్ కొనసాతున్నారు. మెట్రో రైల్ ప్రాజెక్టుల నిర్వహణ, విస్తరణ పనులు వేగవంతం చేయడంతో పాటు పరిపాలనా వ్యవహారాల్లో సమన్వయాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ఈ నియామకం దోహదపడుతోందని ప్రభుత్వం భావిస్తోంది.

విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
ఆదివారం 28-06-2026




# సంపాదకీయం

## ప్రజల్లో ప్రశ్నించే తత్వం చచ్చిపోయిందా ?

దృశ్యం సినిమాలో హీరో ఓ వ్యక్తిని చంపి మాయం చేస్తాడు. పోలీస్ అధికారి కొడుకైన అతడి ఆచూకీ కోసం పోలీసులు ఎంతగా ప్రయత్నించినా పట్టుకోలేక పోతారు. శవాన్నా మాయం చేసినా గుర్తించలేక పోతారు. ఆధారాలు లేకుండా చంపేసి, పోలీస్ స్టేషన్‌లోనే పాతిపెట్టినా కనిపెట్టలేక పోతారు. ఇప్పుడు అచ్చంగా ఇలాంటి కథే ఒకటి విజయవాడలో చోటుచేసుకుంది. సాయకృష్ణ కస్టోడియల్ డెత్ జరిగి దాదాపు నెలదాటినా ఆచూకీ కనిపెట్టడం లేదు. ఎందుకంటే మాయమైన వ్యక్తిపై రౌడీషీట్ ఉంది. అందులోనూ ఓ సామాన్యుడు. ఘనత వహించిన చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం సాధించిన విజయమిది. జగన్ హయాంలోనూ ఓ డాక్టర్‌ను పిచ్చోడిని చేసి చంపారు. పిల్లలు మాయం అయ్యారు. పట్టించుకోలేదు. ఇకపోతే సాయికృష్ణ ఏమయ్యాడో అన్న సందర్భంలోనే తునిలో జ్ఞానేశ్వరి అనే ఓ చిన్నారి కూడా మాయం అయ్యింది. ఇప్పటికీ ఆమె ఆచూకీ కనుక్కోలేక పోయారు. నిజంగా ఇలాంటి ఘటనలు జరుగుతున్నా ప్రజలు స్పందించడం లేదు. మనుషులు చస్తున్నా, మాయం అవుతున్నా సమాజాం ఎందుకో నిస్తేజంగా మారిపోయింది. హక్కుల గురించి మాట్లాడే నేతల నోళ్లు మూతపడ్డాయి. ఆందోళన చేసేవారు కనిపించడం లేదు. ఎర్రజెండాల వాళ్లకు ఏమయ్యిందో కనిపించడం లేదు. పౌరహక్కుల కోసం అంటూ మాట్లాడే వారు మాయం అయ్యారు. అన్యాయాలు జరుగుతున్నా ప్రజలు ప్రశ్నించే శక్తని కోల్పోయారు. ఈ మధ్యే పుట్టిన కాక్రోచ్ జనతా పార్టీ వారు కూడా ఎక్కడా కిమ్మనడం లేదు. కొందరు ఆ మధ్య హైదరాబాద్ లో తామంతా కాక్రోచ్ అంటూ బయలుదేరారు. విజయవాడలో కస్టోడియల్ డెత్‌కు గురయ్యాడంటూ సిట్ చెప్పినా సాయికృష్ణణ వ్యవహారం గురంచి ఒక్కరు కూడా మాట్లాడడం లేదు. రాజకీయ లబ్ది కోసం వైకాపా నేతలు మాట్లాడినా అది ప ఎద్దగా ప్రభావం చూపడం లేదు. ఆంధ్రప్రదేశ్‌లో సాయకృష్ణ అనే వ్యక్తి ఇప్పటికీ కనిపించడం లేదు. పోలీసుల అదుపులో ఉన్న వ్యక్తిని కొట్టి చంపేశారు. చంపితే శవాన్ని ఇవ్వాలి. కానీ శవాన్ని ఇవ్వలేదు. మాయం చేశారు. కాల్చేశారా పాతరేశారా లేక కృష్ణానదిలో ఉన్న మొసళ్లకు ఆహారంగా వేశారా అన్ని తెలియదు. సిట్ మాత్రం కస్టోడియల్ డెత్ అంటూ కోర్టుకు నివేదించింది. అయితే మరి శవం ఏమయ్యిందనేదే ప్రశ్న. వియజవాడలో తీవ్ర సంచలనం సృష్టిస్తున్న సాయికృష్ణ మిస్సింగ్ కేసులో, తన కుమారుడు సాయి కృష్ణ చనిపోయాడని ధృవీకరిస్తూ సిఐ నాగరాజుపై చర్యలు తీసుకోవాలని ఈ నెల 19న అతని తల్లి విజయలక్ష్మి సీపీ రాజశేఖర్ బాబుకు ఫిర్యాదు చేసింది. పోలీసులు పట్టుకెళ్లినట్లు గుర్తించిన ఆమె సాయి కృష్ణ ఎక్కడున్నాడనే ప్రశ్నలకు తెరదించుతూ అతను చనిపోయడని తల్లి విజయలక్ష్మి తన ఫిర్యాదులో దృవీకరించినట్టు తెలస్తోంది. సిఐ నాగరాజు తన కుమారుడిని తన కళ్ళెదుటే కొట్టినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మే నెల మొదటి వారంలో సాయికృష్ణను పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిలబుల్ వారంట్‌తో కృష్ణలంక, మాచవరం పోలీసు స్టేషన్లో తీసుకొని వచ్చారని.. కృష్ణలంక స్టేషన్‌కు తెచ్చాకా సిఐ నాగరాజు తన కోడుకుని చంపేస్తాం దండ రెడీ చేసుకో అన్నారని ఆమె చెప్పుకొచ్చింది. అయితే సిఐ నాగరాజు సాయికృష్ణను మార్కాపురం నుంచి తీసుకొచ్చి కోర్టులో హాజరు పరచలేదని.. సాయి కృష్ణను అక్రమంగా నిర్బంధించి చిత్ర హింసలకు గురిచేసి తీవ్రంగా కొట్టారని ఆమె ఆరోపించింది. సిఐ నాగరాజు కొట్టిన దెబ్బలకు సాయి కృష్ణ చనిపోయాడని.. లాకప్ లో సాయి కృష్ణను కొట్టినప్పుడు అరుపులు కేకలు తాను విన్నానని ఆమె చెప్పుకొచ్చింది. తన కొడుకుని తనతో పంపమని అడిగితే.. తనపై సీఐ నాగరాజు గట్టిగా అరిచాడని ఆమె ఆరోపించింది. దీంతో ఏం చేయాలో తోచక తన చెల్లెలు ద్వారా హై కోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ ఫైల్ చేశామని.. సాయి కృష్ణ చనిపోయాడనే విషయం ఇబ్బందవుతుందని తన కుమారుడు శవాన్ని నామరూపాలు లేకుండా తగలబెట్టారని కూడా విజయలక్ష్మి ఫిర్యాదులో పేర్కొంది. సాయి కృష్ణను చంపి ఆధారాలు లేకుండా చేసిన సిఐ నాగరాజుపై చర్యలు తీసుకోవాలని విజయలక్ష్మి డిమాండ్ చేసింది. విజయలక్ష్మీ ఫిర్యాదు ఆధారంగా సిఐ నాగరాజుపై అక్రమంగా నిర్బంధించడం, ఆధారాలు ధ్వంసం చేయడం,హత్య చేసిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేసిన పోలీసులు సాయికృష్ణ కస్టోడియల్ డెత్ చెందాడంటూ కోర్టుకు నివేదించారు. ఈ కేసు ప్రత్యేక విచారణ బృందం అధికారులు, నిందితుడైన సీఐ నాగరాజు రిమాండ్ రిపోర్టును విజయవాడ రెండవ అదనపు జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టుకు సమర్పించారు. చట్టవిరుద్ధంగా నిర్బంధించడం, పోలీస్ స్టేషన్‌లోనే దారుణంగా థర్డ్ డిగ్రీ ప్రయోగించడం, ఆపై ఆధారాలు దొరకకుండా శవాన్ని తగలబెట్టి మాయం చేయడం వంటి విషయాలను సిట్ నిర్ధారించింది. పోలీసుల థర్డ్ డిగ్రీ వల్లే సాయికృష్ణ చనిపోయాడని, ఆ తరువాత మృతదేహాన్ని సీఐ నాగరాజు వేరే చోటుకు తరలించి దహనం చేశారని రిమాండ్ రిపోర్టులో తెలిపింది. డిజిటల్ సాక్ష్యాలను సైతం మాయం చేయడంతో పాటు విచారణలోనూ సహకరించలేదని సిట్ కోర్టుకు తెలిపింది. నిజంగా ఇంత జరిగినా సిఎం చంద్రాబు పెద్దగా స్పందించలేదు. సిట్ వేసి మిన్నకున్నారు. ఓ మహిళ హోంమంత్రిగా ఉన్నా ఓ తల్లికి న్యాయం జరగలేదు. సాయికృష్ణ రౌడీషీటర్ అయితే, కేసులు పెట్టి బొక్కలో తోయాలి. కానీ ఉగ్రవాదిని చంపినట్లు చంపేశారు. తగులబెట్టేశారు. ఆధారాలు మాయం చేశారు. ఇంత జరుగుతున్నా, పోరాటాల గడ్డ బెజవాడ కిమ్మనడం లేదు. ఎర్రజెండా పార్టీల నోళ్లు మూతలు పడ్డాయి. దీనిని ఓ కేసుగా పెద్దగా ఎవ్వరూ పరిగణించడం లేదని తేలింది. దీంతో ఎలాంటి సందేశాన్ని ఇవ్వాలనుకుంటున్నరో కూటమి పెద్దలు చెప్పాలి. ఓ వ్యక్తి కస్టోడియల్ డెత్ ఇప్పుడు సామాన్య వార్తగా మారడం విషాదం.

# ముప్పనపల్లిలో మురుగుమయం
# డ్రైనేజీ నిర్లక్ష్యంపై గ్రామస్తుల ఆగ్రహం

### సర్పంచ్, కార్యదర్శి స్పందించడం లేదంటూ ఆరోపణలు



ములుగు జూన్ 27;విజన్ ఆంధ్ర ప్రతినిధి కన్నాయిగూడెం మండలం ముప్పనపల్లి గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమై మురుగునీరు రోడ్లపైనే ప్రవహిస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ప్రధాన వీధులతో పాటు సందుల్లో సైతం కాలువలు పూడుకుపోయి మురుగు బయటకు రావడంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. వర్షాకాలం మొదలైనప్పటికీ కాలువల్లో పూడికతీత పనులు చేపట్టకపోవడంతో దోమలు, ఈగల బెడద విపరీతంగా పెరిగిందని స్థానికులు వాపోతున్నారు. దీంతో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. "సమస్యపై సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి దృష్టికి అనేకసార్లు తీసుకెళ్లాం. వినతిపత్రాలు కూడా ఇచ్చాం. కానీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అధికారులు వచ్చి చూసిన దాఖలాలు లేవు" అని గ్రామస్తులు మండిపడుతున్నారు. మురుగునీరు నిల్వ ఉండటంతో పిల్లలు, వృద్ధులు ఇళ్ల నుంచి బయటకు రావాలంటే ఇబ్బంది పడుతున్నారని, స్కూల్‌కు వెళ్లే విద్యార్థులు సైతం మురుగు దాటుకుంటూ వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. గ్రామ పంచాయతీ నిధులు ఏమవుతున్నాయని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో డ్రైనేజీ సమస్యను తక్షణమే పరిష్కరించాలని, సర్పంచ్, కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో ఆందోళనకు దిగుతామని హెచ్చరిస్తున్నారు.

# కమిషనర్ మయాంక్ సింగ్ తో కలిసి 'సర్' ప్రక్రియను జోనల్ పరిశీలించిన జిల్లా కలెక్టర్ మనుచౌదరి



మల్కాజిగిరి, జూన్ 27, (విజన్ ఆంధ్ర): ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా శనివారం కూకట్ పల్లి నియోజకవర్గం పరిధిలో జరుగుతున్న 'సర్' ప్రక్రియను జోనల్ కమీషనర్ మయాంక్ సింగ్ తో కలిసి జిల్లా కలెక్టర్ మను చౌదరి పర్యవేక్షించారు. హౌజింగ్ బోర్డు తిరుమ హిల్స్ లో బిఎల్ఓ లు ఇంటింటికి అందిస్తున్న ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రతిరోజు ఉదయం ఇదే విధంగా బిఎల్ఓల అటెండెన్సును తెలుసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్ని ఎన్రోల్ మెంట్ పత్రాలు ఇచ్చారని, ఒక్కొక్కరికి ఎన్ని ఎన్రోల్ మెంట్ పత్రాలు ఇస్తున్నారని, ఎన్రోల్ మెంట్ యాప్ ద్వారా అప్ లోడ్ చేసే ప్రక్రియను బిఎల్ఓ ను అడిగి తెలుసుకున్నారు. ఒక్కొక్కరికి రెండు పత్రాలు అందజేస్తున్నామని, సెల్ ఫోన్ లో క్యూఆర్ కోడ్ ద్వారా అప్ లోడ్ చేస్తున్నామని బిఎల్ ఓలు వివరించారు. పత్రాలు ఇచ్చిన తరువాత తప్పనిసరిగా యాప్ లో అప్ లోడ్ చేయాలని సూచించారు. మ్యాపింగ్ కాని వారి వివరాలను బిఎల్ఏ తో సమన్వయం చేసుకుంటూ ఎన్యూమరేషన్ ఫామ్స్ అందించాలన్నారు. ఈ పర్యటనలో కూకట్ పల్లి తహసీల్దారు అశోక్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# అరెస్టులతో ప్రజా ఉద్యమాలను ఆపలేరు

### సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్



ఖమ్మం అర్బన్ జూన్ 27 (విజన్ ఆంధ్ర) పేదల పక్షాన పోరాడుతున్న నాయకులను అరెస్టు చేయడం ద్వారా ప్రజా ఉద్యమాలను నిలువరించలేరని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల పట్ల అనుసరిస్తున్న వైఖరి ఆక్షేపణీయమని ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకుని జీవిస్తున్న వారిని అమానుషంగా తొలగించడమే కాకుండా వారికి మద్దతుగా నిలిచిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావుతో పాటు వామపక్ష నాయకులను అరెస్ట చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గుడిసెలు తొలగించిన పేదలకు తక్షణం ప్రత్యామ్నాయ స్థలాలను చూపించాలని ఆయన డిమాండ్ చేశారు. కూనంనేనితో పాటు వామపక్ష నేతల అరెస్టుకు తగిన మూల్యం చెల్లించక తప్పదని సురేష్ తెలిపారు. గతంలో పేదలను విస్మరించిన ప్రభుత్వాలు ఏ పరిస్థితి ఎదురైందో ఈ ప్రభుత్వానికి కూడా అదే పరిస్థితి ఎదురవుతుందన్నారు. వందల ఎకరాలు ప్రభుత్వ భూములను కబ్జా చేసిన వారిపై ఎటువంటి చర్యలు తీసుకోని ప్రభుత్వం తలదాచుకునేందుకు గుడిసెలు వేసుకున్న వారి పట్ల మాత్రం నిర్దాయగా వ్యవహరిస్తుందని ఆయన తెలిపారు. ఖమ్మంలో పేదలను ప్రభుత్వ స్థలాల నుండి తరలించి పెద్దలు అక్రమించుకుంటే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో జిల్లా అధికారులు సమాధానం చెప్పాలన్నారు. నివాస స్థలాలను ప్రభుత్వమే కేటాయించాలని లేని పక్షంలో పేదలను సమీకరించి రాష్ట్ర వ్యాప్తంగా సిపిఐ నేతృత్వంలో ఆందోళనలు చేపడతామని ఆయన తెలిపారు

# ప్రతి ఇంటికీ ఓటర్ల ఎన్యూమరేషన్ ఫారాలు



వనపర్తి జిల్లా ప్రతినిధి, జూన్ 27 (విజన్ ఆంధ్ర) బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియపై అవగాహన కల్పిస్తూ, ఫారాలు నింపే విధానాన్ని వివరించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభికి శనివారం కలెక్టర్ ఛాంబర్‌లో సంబంధిత బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్‌వో) ఎన్యూమరేషన్ ఫారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వయంగా ఎన్యూమరేషన్ ఫారాన్ని స్వీకరించి, పరిశీలించారు. ఓటర్లు ఫారాన్ని పూర్తిగా, స్పష్టంగా నింపే విధంగా వారికి తెలియజేయాలనీ సూచించారు. ప్రతి ఓటరు అవసరమైన వివరాలను సక్రమంగా నమోదు చేసి, అవసరమైన పత్రాలను జతచేసి నిర్ణీత గడువులోగా సమర్పించేలా చూడాలని తెలిపారు. బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియపై అవగాహన కల్పిస్తూ, ఫారాలు నింపే విధానాన్ని వివరించాలని ఆదేశించారు. ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా ప్రతి ఓటరికి ఫారం అందేలా చర్యలు తీసుకోవాలని, ఈ ప్రక్రియను పారదర్శకంగా, సమయపాలనతో పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఆర్డీవో సుబ్రహ్మణ్యం, సీ సెక్షన్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా హెలెన్ కిల్లర్ జయంతి



మల్కాజిగిరి, జూన్ 27,(విజన్ ఆంధ్ర): హెలెన్ కిల్లర్ 146వ జయంతి వేడుకలు నేరేడ్ మెట్ లోని హెలెన్ కిల్లర్ విద్యాసంస్థ లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హెలెన్ కిల్లర్ విద్యాసంస్థ, లైన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్, హైటెక్ సిటీ, వికలాంగుల హక్కుల జాతీయ వేదిక, ఎన్.పి.ఆర్.డి సంయుక్త ఆధ్వర్యంలోఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గత నాలుగు సంవత్సరాల నుండి మేడం పఠాన్ రమీజాబీ పేరు మీద ఉత్తమ సేవలు అందించిన అధ్యాపక సిబ్బందికి ప్రోత్సహక నగదు బహుమతిని అందజేసి ఘనంగా సత్కరించారు. 34 సంవత్సరాలు తమ సేవలను అందించిన సత్యవతి దేవి, గీతలను ఈ సందర్భంగా సన్మానించారు. అదే విధంగా ఈ వార్షిక సంవత్సరంలో యాన్యువల్ ఎగ్జామినేషన్లో ఉత్తమ ఫలితాలను సాధించిన టెన్త్, ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు మెమోంటోస్, సర్టిఫికెట్లు, హ నగదు బహుమతిని సంస్థ ప్రిన్సిపాల్ పఠాన్ సాజిదా ఖాన్ చేతులు మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమం లో భాగంగా విద్యార్థులు వివిధ సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హెలెన్ కిల్లర్ సంస్థ చైర్మన్ పటాన్ ఉమర్ ఖాన్ , సమస్త ప్రిన్సిపాల్ డాక్టర్ ఆరుముగం, లైన్స్ క్లబ్ ప్రెసిడెంట్ లెనిన్ బాబు, అంజయ్య, వికలాంగుల హక్కుల జాతియ వేదిక ప్రెసిడెంట్ వెంకటే, ఎన్. పి. ఆర్.డి సెక్రెటరీ అడివయ్య, సంస్థ ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పఠాన్ ఉమర్ ఖాన్ హెలెన్ కెల్లర్ 146వ జయంతి వేడుకల్లో భాగంగా ఆమె జీవిత విషయాలను విద్యార్థులకు వివరించారు. 140 సంవత్సరాల క్రితం సాంకేతి పరిజ్ఞానం అందుబాటులో లేని రోజుల్లోనే ఆవిడ ప్రాథమిక స్థాయి నుండి డిగ్రీ వరకు ఎంతో కష్టపడి అంధ,చెవిటి, మూగ సమస్యలు ఎదుర్కొంటూ, చదువులో ముందుండి ప్రపంచం మొత్తం అన్ని దేశాల్లో వికలాంగులు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల పోరాటం చేసి ఎన్నో రకాలైన పుస్తకాలను, ప్రసంగాలను సైన్ లాంగ్వేజ్ ద్వారా పొందుపరిచారని చెప్పారు. మొట్టమొదటి డిగ్రీ పొందిన వికలాంగురాలుగా ఆమె చరిత్రలో నిలిచి ఉన్నారని ఆమె సేవలను కొనియాడారు. వికలాంగుల హక్కుల జాతియ వేదిక ప్రెసిడెంట్ వెంకటే మాట్లాడుతూ.. సమాజంలో హెలెన్ కెల్లర్ ను ఆదర్శవంతంగా తీసుకొని ఉన్నతమైన స్థానానికి వెళ్లాలని విద్యార్థులకు సూచించారు. అడివయ్య ప్రసంగిస్తూ మన తెలంగాణ లో ఈ వికలాంగుల పట్ల చిన్నచూపు ఉందని, అనేక సమస్యలతో బాధపడు తున్న దివ్యాంగులకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహాన్ని ఇవ్వాలని కోరారు. తన వంతు బాధ్యతగా ప్రతి సంవత్సరం ఈ హెలెన్ కిల్లర్ జయంతి రోజు ఆమె పేరు మీద, పఠాన్ రమీజాభి పేరు మీద, ప్రతిభను కనబరిచిన టీచర్స్, ఉత్తమ ఫలితాలు పొందిన విద్యార్థులను సత్కరిస్తానని తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో అంజయ్య, శ్రీధర్, శశిధర్, పఠాన్ సాజిదా ఖాన్, గౌసుద్దీన్, బిక్షపతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు

# రూల్స్ బ్రేక్ లైఫ్ రిస్క్..!

- గూడ్స్ వాహనాల్లో గొర్రెల మందల్లా కూలీలు ...!!
- ఆర్టీఏ 'మామూలు' నిర్లక్ష్యంతో రక్షణ లేని ప్రయాణం..!!
- సీట్లు లేవు, సేఫ్టీ లేదు... గాల్లోనే ప్రాణాలు..!
- చిమ్మే రక్తం చూడకముందే... అక్రమ రవాణాను అరికట్టండి..!
- ఆర్టీఏ, పోలీస్ శాఖల నిర్లక్ష్యం వీడాలి



మల్దకల్, జూన్ 27 ( విజన్ ఆంధ్ర ) : జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రం మీదుగా ప్రతీ రోజు కూలీల రవాణా అక్రమంగా, అత్యంత ప్రమాదకరంగా సాగుతోంది. నిబంధనల ప్రకారం కేవలం సరుకులు మాత్రమే రవాణా చేయాల్సిన గూడ్స్ ఆటోలను, అక్కడి డ్రైవర్లు ప్రయాణికుల రవాణాకు వాడుతున్నారు. లాభాల కక్కుర్తితో నిత్యం ఒక్కొక్క గూడ్స్ వాహనంలో సుమారు 50 మందికి పైగా కూలీలను గొర్రెల మందల్లా ఎక్కించి రోడ్లపైకి వదులుతున్నారు. అయినప్పటికీ, రవాణా శాఖ (అర్ టి ఏ) అధికారులు మాత్రం ఈ దారుణాన్ని చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండల కేంద్రం గుండా ప్రతిరోజూ ఇన్ని వాహనాలు ఇంత ప్రమాదకరంగా వెళ్తున్నా, ఆర్టీఏ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వెనుక ఉన్న మర్మమేమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు...?గూడ్స్ వాహనాల్లో ప్రయాణికులకు ఎలాంటి రక్షణ ఉండదు. కనీసం కూర్చోవడానికి సీట్లు కూడా లేని ఆ వాహనాల్లో, కూలీలు ఒకరినొకరు పట్టుకుని నిలబడి ప్రయాణించాల్సి వస్తోంది. రోడ్డుపై వాహనం కొద్దిగా అదుపు తప్పినా కూలీల ప్రాణాలు గాల్లో కలవడం ఖాయంగా కనిపిస్తోంది. ఇంత జరుగుతున్నా ఉన్నతాధికారులు స్పందించకపోవడంపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పెద్ద ప్రమాదం జరిగి ప్రాణనష్టం జరగకముందే అర్ టి ఏ, స్థానిక పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టి ఈ గూడ్స్ ఆటోల అక్రమ రవాణాను అరికట్టాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# పల్స్ పోలియోను విజయవంతం చేయండి

### -వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



వనపర్తి జిల్లా ప్రతినిధి జూన్ 27 (విజన్ ఆంధ్ర)అప్పుడే పుట్టిన పిల్లల నుంచి ఐదేళ్ల లోపు వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పిలుపునిచ్చారు. వనపర్తి జిల్లాలో జూన్ 28న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమానికి సంబంధించిన అవగాహన ర్యాలీని శనివారం వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పల్స్ పోలియో వ్యాధి దేశంలో చాలా సంవత్సరాల క్రితమే నిర్మూలన అయినప్పటికీ, పొరుగు దేశాల నుంచి వచ్చే వలసదారుల కారణంగా మళ్లీ వ్యాప్తి చెందే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ముందస్తు జాగ్రత్త చర్యగా పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. అప్పుడే పుట్టిన పిల్లల నుంచి ఐదేళ్ల లోపు వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని, దీనివల్ల ఎలాంటి హాని ఉండదని తెలిపారు. జిల్లాలో గుర్తించిన 46,150 మంది ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయడానికి 343 పోలియో కేంద్రాలు ఏర్పాటు చేసి, దాదాపు 1,300 మంది వైద్య, ఆరోగ్య సిబ్బందిని అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. తల్లిదండ్రులు తమ చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, అలాగే ప్రజలు, ప్రజాప్రతినిధులు, పత్రికా మిత్రులు అందరూ సహకరించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్ , జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సాయినాథ్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్లు, వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు, అధికారులు, నర్సింగ్ విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

# భారతీయ జనతా పార్టీ కామారెడ్డి జిల్లా కార్యాలయంను వర్చువల్ గా ప్రారంభించ నున్న బీజేపీ జాతీయ అధ్యక్షులు నితిన్ నభీన్

కామారెడ్డి బ్యూరో జూన్ 27(విజన్ఆంధ్ర)భారతీయ జనతా పార్టీ కామారెడ్డి జిల్లా కార్యాలయంను బీజేపీ జాతీయ అధ్యక్షులు నితిన్ నభీన్ చే ఆదివారం వర్చువల్ గా ప్రారంభం కానుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడునీలం చిన్న రాజులు తెలిపారు ఈ సందర్భంగా కామారెడ్డి బీజేపీ జిల్లా కార్యాలయంలో ఉదయం 9 గంటల నుండి పూజా కార్యక్రమం11 గంటలకు వర్చువల్ గా ప్రారంభోత్సవ కార్యక్రమం జరుగుతుందని అన్నారు.బీజేపీ రాష్ట్ర, జిల్లా, మండల, పట్టణ నాయకులు ప్రజా ప్రతినిధులు( సర్పంచ్, ఉప సర్పంచ్, కౌన్సిలర్ లు) ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు.

# ఓట్ల విషయంలో జాగ్రత్త అవసరం..

## ఎస్ఐఆర్ ప్రక్రియను గమనించండి.. ఒక్క ఓటు కూడా పోకుండా అప్రమత్తంగా ఉండండి.. బీఎల్ఏ-2 సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు సూచనలు



ఆదిలాబాద్, జూన్ 27 (విజన్ ఆంధ్ర): ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా విపక్ష ఓట్ల తొలగింపుతో ప్రజాస్వామ్య మనుగడకి ముప్పు వాటిల్లనుందని తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ అండ్ ప్రోహిబిషన్ , పర్యాటక ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం ఆదిలాబాద్ పట్టణంలో ఎస్ఐఆర్ ప్రక్రియపై బీఎల్ఏ-2లకు నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై శ్రేణులకు పలు సూచనలు చేశారు. కాంగ్రెస్ పార్టీకి బలమైన మైనార్టీ, మహిళలు, ఎస్టీ, ఎస్సీల ఓట్ల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. పార్టీ అనుకూల ఓట్లు తొలగించే ప్రక్రియ జరుగుతోందన్నారు. బీఎల్ఏలు పార్టీ మండలాధ్యక్షులు , సూపర్ వైజర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. వారు జాగ్రత్తగా లేకపోతే పెద్ద ఎత్తున ఓట్లు గల్లంతయ్యే ప్రమాదముందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ మళ్ళీ అధికారంలోకి రావాలన్నా, దేశంలో రాహుల్ గాంధీ ప్రధాని కావాలన్నా ఈ ప్రక్రియపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. పట్టణాలు, గ్రామాల్లో ఎన్యుమరేషన్ చేస్తున్న బీఎల్వో లతో కాంగ్రెస్ బూత్ లెవల్ ఏజెంట్లు సత్సంబంధాలతో ఉంటూ రోజువారి వివరాలు తెలుసుకోవాలన్నారు. ఇంచార్జిలతో వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసుకొని రోజువారీ అప్ డేట్ పంపించాలన్నారు. తొలగించిన ఓట్ల విషయంలో ఎందుకు తొలగించారో ఆరా తీయాలన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ లో 23 లక్షల పైచిలుకు ఓట్లకు గాను 18 లక్షల ఓట్లు మాత్రమే మ్యాపింగ్ లో ఉన్నాయన్నారు. ఇంకా 5 లక్షల పై చిలుకు ఓట్లు మ్యాపింగ్ కాలేదన్నారు. దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతీ ఓటు ముఖ్యమేనని ఒక్క ఓటు కూడా పోకుండా అప్రమత్తంగా వ్యవహరంచాలన్నారు. బీఎల్వోలతో ఇంటింటికి తిరగాలన్నారు. ఈ నెల రోజులు విరామం లేకుండా పార్టీకోసం కష్టపడి పని చేయాలన్నారు. ఒక్కసారి ఓటు పోతే తిరిగి రావడం కష్టమన్నారు. బీహార్, వెస్ట్ బెంగాల్ ఎన్నికలలో పెద్ద ఎత్తున ఓట్లు తొలగించబడ్డాయన్నారు. అలాంటి పరిస్థితి రాష్ట్రంలో రాకూడదంటే మనమంతా అప్రమతతంగా ఉండాలన్నారు. స్థానికంగా లేనివారి ఓట్లు ఎక్కువగా గల్లంతయ్యేఅవకాశం ఉందని మనకు సంబంధించినవారు ఇతర ప్రదేశాలలో ఉంటే రప్పించి మ్యాపింగ్ చేయించాలన్నారు. ఆదిలాబాద్ లో అత్యధికంగా 44.04 శాతం మ్యాపింగ్ కాలేదని తెలిపారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలలోకి తీసుకెళ్లాలని సూచించారు. ప్రజా ప్రభుత్వం పై బీఆర్ఎస్ నాయకులు అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని వాటిని సమర్ధవంతగా తిప్పికొట్టాలన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం ఎంతో ముందుందన్నారు. అమరుల త్యాగాల ఫలితంగా వచ్చిన తెలంగాణ ప్రజల ఆకాంక్షలకనుగుణంగా చేస్తారని గత టీఆర్ఎస్ కు ప్రజలు అవకాశమిస్తే ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని విమర్శించారు. కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, నియోజకవర్గ ఇన్చార్జ్ శ్రీనివాస రెడ్డి, డీసీసీ అధ్యక్షులు నరేష్ జాదవ్, నియోజకవర్గ అబ్జర్వర్ రమేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష, మాజీ పార్లమెంటు సభ్యులు సోయం బాపూరావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నరసయ్య నాయకులు సాజిద్ ఖాన్, గంద్రత్ సుజాత,
అల్లూరి సంజీవరెడ్డి, అడ్డి బోజారెడ్డి, అశ్విన్ రెడ్డి, గోక గణేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నాగర్‌కర్నూల్ జిల్లాలో ఆబ్కారీ శాఖ దాడులు



నాగర్ కర్నూల్ జిల్లా (విజన్ ఆంధ్ర) జూన్ 26 శుక్రవారం : ఉమ్మడి మహబూబ్‌నగర్ డిప్యూటీ కమిషనర్ విజయభాస్కర్ రెడ్డి, జిల్లా ఆబ్కారీ అధికారి వి. వేణుగోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు దాడులు. నాగర్‌కర్నూల్ జిల్లా తాడూర్ మండలం పాపగల్ గ్రామంలో ఆబ్కారీ శాఖ ఆకస్మిక దాడులను నిర్వహించింది. ఈ దాడిలో వీణ అన్వర్ కిరాణా దుకాణంలో నాటుసారా తయారీకి ఉపయోగించే ముడి పదార్థాల 600 కిలోల నల్లబెల్లం, 50 కిలోల నవసాగరం, పటిక స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు వీణ అన్వర్‌పై ఆబ్కారీ కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో నాగర్‌కర్నూల్ ఆబ్కారీ సీఐ కళ్యాణ్, ఎస్ఐలు చిన్న రాములు, నవీన్ రెడ్డి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళా సంఘాలను మరింత బలోపేతం చేయాలి

### -జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు



గద్వాల జూన్ 27(విజన్ ఆంధ్ర బ్యూరో)గ్రామ స్థాయిలో మహిళా సంఘాలను మరింత బలోపేతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు. శనివారం ఐడీఓసీ సమావేశ మందిరంలో సెర్ప్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని జిల్లా సమాఖ్య అధ్యక్షులు, మహా సమాఖ్య అధ్యక్షుల నెలవారీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ,మహిళా స్వయం సహాయక సంఘాల ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. గ్రామ స్థాయిలో ప్రతి మహిళను స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా చేర్పించాలని, మహిళా సంఘాల ద్వారా ఆర్థిక స్వావలంబనను పెంపొందించాలని సూచించారు. గ్రామ స్థాయిలో మహిళా సంఘాల సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తూ మహిళా సాధికారత, బాలికల విద్య, బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వం మహిళల ఆర్థిక, సామాజిక సాధికారతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అధికారులు తెలిపారు. స్వయం సహాయక సంఘాల ద్వారా వడ్డీలేని రుణాలు,ఉపాధి అవకాశాలు, స్వయం ఉపాధి యూనిట్లు,వివిధ సంక్షేమ పథకాలతో మహిళలను అన్ని విధాలుగా ఆదుకుంటూ ఆర్థికంగా బలోపేతం చేస్తోందని పేర్కొన్నారు. ఈ అవకాశాలను ప్రతి మహిళ సద్వినియోగం చేసుకొని ఆర్థిక స్వావలంబన సాధించాలని సూచించారు. అనంతరం జిల్లా సమాఖ్య అధ్యక్షులకు శ్రీ వినాయకుని చిత్రపటాలను జ్ఞాపిక,మెమెంటో లను అందజేశారు. అంతకముందు అలంపూర్‌లోని శ్రీ జోగులాంబ అమ్మవారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని రాష్ట్రంలోని జిల్లా సమాఖ్య అధ్యక్షులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి మూసాయిదా బేగం,అడిషనల్ డి.ఆర్.డి.ఓ శ్రీనివాసులు, గద్వాల్ మహిళా సమాఖ్య అధ్యక్షులు ప్రభావతి,వివిధ జిల్లాల సమాఖ్య అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి పేదవాడు ఆత్మగౌరవంతో బతకాలి

### -మంత్రులు జూపల్లి, అజారుద్దీన్



ఆదిలాబాద్, జూన్ 27 (విజన్ ఆంధ్ర):ప్రతి పేదవాడు ఆత్మగౌరవంతో బతకాలనే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం అని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కాలనీ, తాటిగూడ కాలనీలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు వారికి వస్త్రాలు అందజేసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన పేద కుటుంబాలకు శాశ్వత నివాస సౌకర్యం కల్పించడం ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి దశలవారీగా ఇందిరమ్మ ఇల్లు కేటాయించడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రు, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష, ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక నాయకులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అత్యాధునిక వసతులు

### మంత్రులు జూపల్లి, అజారుద్దీన్



ఆదిలాబాద్, జూన్ 27 (విజన్ ఆంధ్ర): విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అత్యాధునిక వసతులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, మహమ్మద్ అజారుద్దీన్ పేర్కొన్నారు. శనివారం ఆదిలాబాద్ పట్టణంలోని బంగారుగూడలో రూ.20 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల-కళాశాల (బాలుర) భవనాన్ని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీతో కలిసి ప్రారంభించి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. మైనార్టీ విద్యార్థులకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్యతో పాటు ఆధునిక వసతులు కల్పించి, వారిని అన్ని రంగాల్లో పోటీతత్వానికి సిద్ధం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూతన భవనంలోని తరగతి గదులు, వసతి గదులు, భోజనశాల, ఇతర మౌలిక సదుపాయాలను మంత్రులు పరిశీలించారు. మైనార్టీ విద్యార్థులు విద్యనే ఆయుధంగా మలుచుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. విద్యా రంగంలో సమాన అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, రాష్ట్రంలోని మైనార్టీ విద్యాసంస్థలను మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యతనిస్తూ, మైనార్టీ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సురక్షితమైన వసతి, ఆధునిక మౌలిక సదుపాయాలు, మెరుగైన బోధనా వాతావరణాన్ని అందిస్తోందని తెలిపారు. ఇలాంటి విద్యాసంస్థల ద్వారా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ఉన్నత విద్యలో రాణించే అవకాశాలు మరింత మెరుగుపడతాయని అన్నారు. కార్యక్రమంలో ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### -జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



ఆదిలాబాద్, జూన్ 27 (విజన్ ఆంధ్ర): దేశవ్యాప్తంగా సైబర్ నేరగాళ్లు నూతన పద్ధతులను అనుసరిస్తూ ప్రజలను మోసగిస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై పూర్తి అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయం నుంచి విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్ కు కాల్ చేయడం లేదా జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్లో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. ఆర్థిక సైబర్ నేరాల్లో "గోల్డెన్ అవర్" అత్యంత కీలకమని, వెంటనే ఫిర్యాదు చేస్తే మోసపోయిన నగదును తిరిగి పొందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు ఏపీకే ఫైల్స్ ద్వారా మొబైల్ ఫోన్లను హ్యాక్ చేయడం, ఏఐ ఆధారిత వీడియో కాల్స్, వీడియో సందేశాల ద్వారా నమ్మబలికి డబ్బులు దోచుకోవడం వంటి కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. అలాగే ఐపీఓ, స్టాక్ మార్కెట్ పెట్టుబడుల పేరుతో అధిక లాభాలు వస్తాయని ఆశ చూపించి, థర్డ్ పార్టీ యాప్‌ల ద్వారా పెట్టుబడులు పెట్టించి మోసం చేస్తున్నారని తెలిపారు. ప్రజలు అపరిచితుల నుంచి వచ్చే లింకులు, ఏపీకే ఫైల్స్ డౌన్‌లోడ్ చేయకుండా, వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం, ఓటీపీలు ఎవరికీ వెల్లడించవద్దని సూచించారు. ఈ వారం జిల్లాలో సైబర్ క్రైమ్‌కు సంబంధించిన 12 ఫిర్యాదులు నమోదైనట్లు జిల్లా ఎస్పీ వెల్లడించారు.

## పోలియో రహిత సమాజమే మన అందరి లక్ష్యం



నిజామాబాద్ జూన్ 27:( విజన్ ఆంధ్ర)జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమాన్నీ పురస్కరించుకొని ఈరోజు నిజాంబాద్ నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వద్ద నుండి పల్స్ పోలియో పై అవగాహన ర్యాలీ నిర్వహించడం జరిగిందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి రాజశ్రీ గారు తెలియజేశారు ఈ అవగాహన ర్యాలీని జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల మేరకు జిల్లా అడిషనల్ కలెక్టర్ స్థానిక సంస్థలు శ్రీ భుజంగరావు సార్ గారు జెండా ఊపి అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ పోలియో నిర్మూలనపై నిండు జీవితానికి రెండు చుక్కలు, మనందరి పంతం పోలియో అంతం ,లాంటి అవగాహన నినాదాలను చేస్తూ బస్టాండ్ మరియు తిలక్ గార్డెన్ చౌరస్తా మీదుగా డి ఐ ఓ ఆఫీసు వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఐదు సంవత్సరాలలోపు చిన్నారులందరికి జూన్ 28 ఆదివారం రోజున పల్స్ పోలియో చుక్కల మందును అందించాలని ఏ ఒక్కరు తప్పిపోకుండా పకడ్బందీ ప్రణాళికతో కార్యక్రమాన్ని నిర్వహించాలని అన్నారు .జూన్ 28 ఆదివారం బూతు వద్ద ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు పోలియో చుక్కల మందు వేస్తారని, బూతు వద్ద చుక్కల మందు వేయించని చిన్నారులకు జూన్ 29 మరియు 30 తేదీలలో గృహ సందర్శన చేసి ఐదు సంవత్సరాలలోపు చిన్నారులకు చుక్కల మందు అందించాలన్నారు. ఈ సందర్భంగా పోలియోపై అవగాహన కలిగించే పోస్టర్లను అడిషనల్ కలెక్టర్ గారి చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగింది. ర్యాలీ అనంతరం పోలియోనిర్మూలన పై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రెస్ మీట్ నిర్వహించి అనేక విషయాలు తెలియజేశారు. జిల్లాలో ఐదు సంవత్సరాలు లోపు చిన్నారులు మొత్తం 1,91,883, వీరందరికీ ఒక 1007 బూతులను ఏర్పాటు చేసినట్లు, పట్టణ కేంద్రాల్లో 241 బూతులను, గ్రామీణ ప్రాంతాల్లో 766 బూతులను, 37 ట్రాన్సిట్ బూతులను, 37 మొబైల్ బూతులను, 101 పర్యవేక్షణ అధికారులను, 4277 బూతు మెంబర్లను, 428 ఆరోగ్య కార్యకర్తలను, 1112 ఆశ కార్యకర్తలను,1501 అంగన్వాడీ కార్యకర్తలను ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమం కోసం 2,11,100 పోలియో డోసుల ను అందుబాటులో ఉంచినట్లు తెలియజేశారు. ముఖ్యంగా మారుమూల ప్రాంతాలు, తాండాలు, ఇటుక బట్టీలు, భవన నిర్మాణాలు జరిగే ప్రదేశాలు, మురికివాడలలో, హై రిస్క్ ఏరియాలలో ఐదు సంవత్సరాలలోపు చిన్నారులను తప్పిపోకుండా ప్రతి ఒక్కరికి పోలియో చుక్కల మందు వెయ్యాలన్నారు. అదేవిధంగా అన్ని శాఖల సమన్వయంతో సహకారంతో బూతు స్థాయి నుండి ప్రతి గ్రామం, పట్టణంలో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి పోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో జి జి హెచ్ సూపరిండెంట్ డాక్టర్ రాములు డిఐఓ డాక్టర్ అశోక్, డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ సికందర్ నాయక్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ వెంకన్న, డాక్టర్ నవ్య, డాక్టర్ వెంకటేష్, వైద్యాధికారులు డాక్టర్ అజ్మతునిస, డాక్టర్ సునేన, డాక్టర్ ప్రత్యూష, డాక్టర్ ప్రతాప్,ఎస్ ఓ రాజేశ్వర్, డిప్యూటీ డెమో దుర్గారావు, డి హెచ్ ఈలు ఘన్పూర్ వెంకటేశ్వర్లు, మనోహర్, సలీం, హెచ్ ఇ ఓ లు గోవర్ధన్, నాగరాజు,వెంకట్ రవి ,లింబారెడ్డి ,శంకర్, రవి చందర్, శాంత కుమారి పర్యవేక్షణ అధికారులు ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, నర్సింగ్ విద్యార్థినిలు పాల్గొన్నారు.

## అంతంపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు లను ప్రారంభించిన

### - ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి



గట్టు జూన్ 27 (విజన్ ఆంధ్ర)జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండలం అంతంపల్లిగ్రామంలో గోవిందమ్మ సవారీ వారి ఆహ్వానం మేరకు ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవం నూతన గృహప్రవేశ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి హాజరై రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. అనంతరం నూతన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం చేసిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే కానుకను అందజేశారు. ఎమ్మెల్యే కి లబ్ధిదారులు శాలువా కప్పి పుష్పగుచ్చం ఇచ్చి ఘనంగా సత్కరించారు. అనంతరం గట్టు మండలం పరిధిలో అంతంపల్లి గ్రామ సర్పంచ్ శంకరమ్మ దానయ్య వారి నూతన గృహప్రవేశంకు ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి హాజరై సత్యనారాయణ స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు తీసుకొని స్వామివారి ఆశీస్సులను పొందడం జరిగింది. ఇంటి యజమాని సర్పంచ్ కి ఎమ్మెల్యే కానుకను అందజేసి హార్థిక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ మాజీ చైర్మన్ జంబురామన్ గౌడ, మాజీ ఎంపీపీ విజయ్ కుమార్, చాగదోన సర్పంచ్ వీరేష్, నాయకులు మైలగడ్డ చంద్రశేఖర్, ఉపసర్పంచ్ దుబ్బా హనుమంతు, వేమారెడ్డి, రామిరెడ్డి, నర్సింలు, ఆంజనేయులు, తిమ్మప్ప, నరసింహులు, జయరాం గౌడు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## ములుగు రైస్ మిల్లర్ల సమస్యలపై మంత్రి సీతక్కకు వినతి బాదం ప్రవీణ్

### సివిల్ సప్లై కమిషనర్‌కు ఫోన్ చేసి పరిష్కరించాలని మంత్రి ఆదేశం



ములుగు జూన్ 27;విజన్ ఆంధ్ర ప్రతినిధిజిల్లాలోని రైస్ మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బాదం ప్రవీణ్ కోరారు. శనివారం అసోసియేషన సభ్యులతో కలిసి హైదరాబాద్‌లో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్కను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాదం ప్రవీణ్ మాట్లాడుతూ, 2024-25 రబీ సీజన్‌లో ములుగు జిల్లాలో 78 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ జరిగిందని, ఈసారి అనూహ్యంగా దిగుబడి పెరిగి 1.13 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్లు తెలిపారు. అయితే జిల్లాలో గోదాముల కొరత తీవ్రంగా ఉండటంతో సేకరించిన ధాన్యాన్ని ఆరుబయట ఓపెన్ స్పేస్‌లో నిల్వ చేయాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలకు ధాన్యం తడిసి నష్టపోయే ప్రమాదం ఉందని, వెంటనే గోదాముల సౌకర్యం కల్పించి రైస్ మిల్లర్లను ఆదుకోవాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. మిల్లర్ల సమస్యలపై సానుకూలంగా స్పందించిన మంత్రి సీతక్క, అక్కడికక్కడే సివిల్ సప్లై కార్పొరేషన్ కమిషనర్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. రైస్ మిల్లర్ల సమస్యను ప్రాధాన్యతగా తీసుకుని తక్షణమే పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు.

## మంత్రి పొన్నం ప్రభాకర్ కృషితో హుస్నాబాద్ నియోజకవర్గం అక్కన్నపేట తహసీల్దార్ కార్యాలయ నూతన భవన నిర్మాణానికి రూ.2.25 కోట్లు మంజూరు

సిద్దిపేట జిల్లా ప్రతినిధి జూన్ 27రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి, హుస్నాబాద్శాసనసభ్యులు పొన్నం ప్రభాకర్ గారి ప్రత్యేక కృషి ఫలితంగా హుస్నాబాద్ నియోజకవర్గంలోని అక్కన్నపేట మండల కేంద్రంలో నూతన తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి రూ. 2.25 కోట్ల పరిపాలనా అనుమతి మంజూరు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా అద్దె భవనాలు, శిథిలావస్థలో ఉన్న 10 రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలు (ఆర్డీవోలు), 107 తహసీల్దార్కార్యాలయాలకు నూతన భవనాల నిర్మాణం కోసం మొత్తం రూ. 263.25 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం జి.ఓ. విడుదల చేసింది. ఈ నిర్ణయంలో భాగంగా అక్కన్నపేట తహసీల్దార్కార్యాలయానికి రూ. 2.25కోట్లనిధులుకేటాయించడంవిశేషం. కొత్తగాఏర్పడినఅక్కన్నపేట మండలంలో ఆధునిక వసతులతో కూడిన తహసీల్దార్ కార్యాలయం నిర్మాణం ద్వారా ప్రజలకు మెరుగైన, వేగవంతమైన రెవెన్యూ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటివరకు ఎదురవుతున్నకార్యాలయ వసతి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది. అక్కన్నపేట తహసీల్దార్ కార్యాలయ భవనానికి నిధులు మంజూరు చేయించిన మంత్రి పొన్నం ప్రభాకర్ గారికి హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలు, అక్కన్నపేట మండల ప్రజాప్రతినిధులు, రైతులు మరియు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో మంత్రి పొన్నం ప్రభాకర్ గారు నిరంతరం ప్రత్యేక చొరవ చూపుతున్నారని వారు కొనియాడారు.

# మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

## అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్



వనపర్తి జిల్లా ప్రతినిధి, జూన్ 27 (విజన్ ఆంధ్ర) వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్ ఆదేశించారు. అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) శనివారం తన ఛాంబర్‌లో జిల్లా పరిధిలోని అన్ని మున్సిపల్ కమిషనర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మున్సిపాలిటీలో పారిశుధ్యం నిర్వహణ సహా పలు అంశాలపై కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్లు స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి పారిశుద్ధ్య పనులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. పట్టణాల్లో ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టి, దోమల వ్యాప్తి నివారణతో పాటు ప్రజారోగ్య పరిరక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పారిశుద్ధ్య నిర్వహణలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించి అర్హులైన లబ్ధిదారులను క్షేత్రస్థాయిలో ధృవీకరించి, నిజమైన అర్హులను గుర్తించే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్ఎఫ్‌బీఎస్ (చీఖఅశీఖుశ్రీ ఖీుఎఅశ్రీఎ దీవఅవటఱ్ ూాఎష్ట్రవఎవ) పథకంపై సమీక్ష నిర్వహిస్తూ, ఆయా మున్సిపాలిటీల పరిధిలో మరణించిన వారి వివరాలను సేకరించి, అర్హులైన కుటుంబాలకు పథకం ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో హౌసింగ్ పీడీ విటోబా, మున్సిపల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.

# సాలూరు ప్రభుత్వ బడిపై సర్కారు నిర్లక్ష్యం...!!

- సర్కారు బడిలో 'ఓపెన్ ఎయిర్' క్లాసులు..!!
- బడికి రమ్మని పిలుపు... తరగతి గదులకు కరువు..!!
- నాణ్యమైన విద్య మాట దేవుడెరుగు... కూర్చోవడానికి గది ఇవ్వండి సారూ..!!
- అక్షరాలు నేర్వాల్సిన చోట... అవస్థలు పడుతున్న విద్యార్థులు...
- ఆగ్రహిస్తున్న గ్రామస్థులు..!తరగతి గదుల కొరతతో చెట్ల కిందే విద్యాబోధన... సాలూర ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అవస్థలు





సాలూర, జూన్ 27 (విజన్ ఆంధ్ర ) : నిజామాబాద్ జిల్లా సాలూర మండల కేంద్రంలోని పీఎం శ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో తరగతి గదుల కొరత కారణంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సరిపడా తరగతి గదులు లేకపోవడంతో కొంతమంది విద్యార్థులు చెట్ల కింద కూర్చొని పాఠాలు వినాల్సి వస్తుండగా, మరికొంతమందికి డైనింగ్ హాల్‌లోనే బోధన కొనసాగుతోంది. కొన్ని తరగతులను పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన తాత్కాలిక షెడ్లలో నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నప్పటికీ, అవసరమైన మౌలిక వసతులు లేకపోవడం పట్ల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు లేకపోవడంతో ఉపాధ్యాయులు కూడా ఇబ్బందికర పరిస్థితుల్లోనే బోధన కొనసాగిస్తున్నారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో చెట్ల కింద లేదా తాత్కాలిక ప్రదేశాల్లో తరగతులు నిర్వహించడం విద్యార్థుల చదువుపై ప్రతికూల ప్రభావం చూపుతుందని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలంటే ముందుగా పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని వారు కోరుతున్నారు. ప్రభుత్వం, సంబంధిత విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి సాలూర ప్రభుత్వ పాఠశాలలకు అదనపు తరగతి గదులు మంజూరు చేసి, విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించాలని తల్లిదండ్రులు, గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఓటర్ సవరణ ప్రక్రియ పకడ్బందీగా సాగాలి

## జిల్లా అదనపు కలెక్టర్ మధు మోహన్



గద్వాల జూన్ 27 (విజన్ ఆంధ్ర బ్యూరో)గద్వాల పట్టణ ప్రాంతంలోని 22, 23 వార్డులలో బూత్ నెంబర్ ట219ఊ బూత్ నెంబర్ ట221ఊ లో బి ఎల్ ఓ లు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే ను జిల్లా అదనపు కలెక్టర్ మధు మోహన్, 22వ వార్డు కౌన్సిలర్ లత వంట భాస్కర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బిఎల్ఓ లు ఇంటింటికి ఎన్యూమరేషన్ పత్రాలు అందించి ఓటర్ జాబితా ప్రక్రియ సమగ్ర సవరణ ప్రక్రియను పకడబందిగా పూర్తి చేయాలని కోరారు.కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం తప్పులు లేని ఓటర్ జాబితా రూపకల్పనే లక్ష్యంగా బిఎల్ఓ లు పనిచేయాలని సూచించారు.వారి వెంట బిఎల్ఓ,బిఎల్ఏ ల సిబ్బంది వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# రైతులు క్యూలైన్లలో నిలబడే అవసరం లేకుండా

## ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

గద్వాల జూన్ 27 విజన్ ఆంధ్ర బ్యూరో)ి జోగులాంబ గద్వాల జిల్లా లో రైతులు ఎరువుల కోసం క్యూలైన్లలో గంటల తరబడి నిలబడాల్సిన అవసరం లేకుండా, తమ ఇంటి నుండే సులభంగా యూరియా బుక్ చేసుకునేందుకు వీలుగా రూపొందించిన ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్ ను గద్వాల నియోజకవర్గ శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో శనివారం గద్వాల పరిధిలో ప్రారంభించారు.ఃఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూరైతుల సౌకర్యార్థం ఈ నూతన యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. రైతులు తమ మొబైల్‌లో ఈ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుని, మొబైల్ నంబర్ ఎంటర్ చేయగానే వచ్చే ఓటీపీ ద్వారా లాగిన్ అయి నేరుగా యూరియా బుక్ చేసుకోవచ్చని ఆయన వివరించారు. ఈ యాప్ ద్వారా ఎరువుల పంపిణీ అత్యంత పారదర్శకంగా జరుగుతుందని, దీనివల్ల బ్లాక్ మార్కెట్‌ను పూర్తిగా నివారించవచ్చని ఎమ్మెల్యే నొక్కి చెప్పారు. ఃగద్వాల మండలం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి (డిఏఓ) ఎం . వీరయ్య, గద్వాల డివిజన్ పరిధిలోని మండల వ్యవసాయ అధికారులు, ఎరువుల డీలర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# పరిగిలో కేటీఆర్ ఫ్లాప్ షో..

## కేటీఆర్ చెప్పే అబద్దాలు వినలేక జనం వెళ్లిపోయారు...

## ఎమ్మెల్యే, టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ (ఎస్ఐఆర్) డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి.

పరిగి, జూన్ 27(విజన్ ఆంధ్ర ): పరిగి పట్టణంలో బిఆర్ఎస్ పార్టీ ఏర్పాటు చేసిన సమావేశంలో కేటీఆర్ చెప్పే అబద్దాలను వినలేక జనాలు లేచి వెళ్లిపోయారని పరిగి ఎమ్మెల్యే, టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ (ఎస్ఐఆర్ ) డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం గాంధీభవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత పదేళ్లలో 8 లక్షల కోట్లకు పైగా అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పుల కుంపటి చేసి ప్రజలను నిండా ముంచారన్నారు. అధికారంలోకి వచ్చే ముందు అనేక వాగ్దానాలు చేసి ఒక్కటి కూడా పూర్తి చెయ్యలేదన్నారు. 5 సార్లు పరిగికి వచ్చి నీళ్లు ఇస్తా అని మొండి చెయ్యి చూపించారన్నారు. ప్రతి నియోజకవర్గానికి 1 లక్ష ఎకరాలకు నీళ్లు ఇస్తా అని ఒక్క ఎకరానికి కూడా ఇవ్వలేదని అన్నారు. ప్రతి నియోజకవర్గంలో 100 పడకల హాస్పిటల్ అన్నారు కనీసం ఒక్కటి కూడా కూడా కట్టలేదు, ప్రతి పేదవాడికి డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టిస్తా అన్నారు ఒక్కటి కూడా కట్టలేదని మా ప్రభుత్వంలో తెలంగాణ వ్యాప్తంగా లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామన్నారు. పరిగి లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్ట్ ను కడతామని ప్రగల్బాలు పలికి తట్టెడు మట్టి కూడా తీయలేదని మా ప్రభుత్వంలో పరిగి ప్రజల కోసం లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్ట్ కోసం భూ సేకరణ కూడా చేశామని తెలిపారు. బిఆర్ఎస్ పార్టీ హయంలో మహిళలను పట్టించుకోలేదు కానీ మా ప్రభుత్వం మహిళలకు పెద్ద పీట వేసిందన్నారు. వివిధ రంగాల్లో మహిళలు ముందుండాలనే ఉద్దేశ్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 60 వేల కోట్ల రూపాయలు మహిళలకు వడ్డీ లేని రుణాలు అందించామన్నారు. గ్రీన్ ట్రిబ్యునల్ లో పెండింగ్ లో ఉన్న కేసును క్లియర్ చేయించి అప్ప జంక్షన్ నుండి మన్నెగూడ వరకు 4 లైన్ల రోడ్డు నిర్మాణ పనులకు ఎ ఆటంకం లేకుండా మా ప్రభుత్వం 1000 కోట్ల వ్యయంతో రోడ్డు నిర్మాణ పనులు శర వేగంగా కొనసాగుతున్నాయన్నారు. హైదరాబాద్ కు ఒక ల్యాండ్ మార్క్ సెట్ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అని తెలిపారు. 50 వేల కోట్ల రూపాయలతో పరిగి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జరుగుతున్నా ఆ అభివృద్ధి కేటీఆర్ కు బిఆర్ఎస్ వాళ్లకు కనిపించడం లేదు కేటీఆర్ గంటకు ఒక మాట మాట్లాడతాడు గతంలో కూడా కేటీఆర్, తెలంగాణ లో ఒక్క ఇందిరమ్మ ఇల్లు కట్టిన తాను రాజకీయ సన్యాసం తీసుకుంటా అని మాట మార్చారన్నారు. పదేళ్లు బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉండి 8 లక్షల కోట్ల కోట్ల అప్పులు చేసిన మీరు ఇచ్చిన మేనిఫెస్టోలో ఎన్ని హామీలు నెరవేర్చారని ప్రశ్నించారు. కేటీఆర్ చేస్తున్న అబద్ధపు ప్రచారాలను ప్రజలు ఎవరు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. బిఆర్ఎస్ అధికారంలోకి వస్తే ప్రతి నియోజకవర్గంలోని లక్ష ఎకరాలకు



నీరు అందిస్తామన్నారు.ఏ నియోజకవర్గానికి అయినా నీరు అందించారా. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నర సంవత్సరాలలోనే పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పనులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో శరవేగంగా కొనసాగుతున్నాయన్నారు. ఇందులో భాగంగా కొందరు-పరిగి-లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు నిర్మాణానికి భూసేకరణ పనులు కూడా మొదలయ్యాయన్నారు. ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులను, అధికారులను తీసుకెళ్లి సైట్ విజిట్ కూడా చేయడం జరిగిందన్నారు. గతంలో ఎన్నోసార్లు కేసీఆర్ పరిగికి వచ్చినప్పుడు పరిగి-లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు కడతాం అని, నియోజకవర్గానికి సాగునీరు ఇస్తామని చెప్పి ఇక్కడి ప్రజలకు గుండు సున్న ఇచ్చారన్నారు. మా ముఖ్యమంత్రి దమ్మున్న ముఖ్యమంత్రి కాబట్టే వచ్చిన రెండు సంవత్సరాల్లోనే కొందుర్గు పరిగి లక్ష్మీదేవి పల్లి ప్రాజెక్టు నిర్మాణానికి భూ సేకరణ కోసం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారన్నారు.

పది సంవత్సరాలు బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉండి దొంగ హామీలతో ప్రజలను మోసం చేశారు కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం వచ్చిన మొదటి సంవత్సరంలోనే రైతులకు రెండు లక్షల వరకు రుణమాఫీ చేయడమే కాకుండా ఇరవై ఒక్క వేల కోట్ల రూపాయలు రైతుల ఖాతాలో జమ చేయడం జరిగిందన్నారు. మళ్ళీ అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే మీ అబద్ధపు మాటలను ప్రజలు నమ్మే ప్రసక్తే లేదని ఈ సందర్భంగా తెలియజేశారు.

# లింగాపూర్ విద్యార్థుల జాతీయ సత్తా!!

## ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో రాష్ట్ర ర్యాంకులు లెవెల్ చూపించిన ప్రభుత్వ బడికి ఘన విజయం




పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూన్ 27 (విజన్ ఆంధ్ర):లింగాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు మరోసారి తమ సత్తా చాటారు. గ్రామీణ ప్రాంతం నుంచి జాతీయ స్థాయి పోటీల్లో మెరిసి, ప్రతిభకు చిరునామాగా నిలిచారు. ఇండియన్ టాలెంట్ ఒలింపియాడ్స్ నిర్వహించిన ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో టీజీఎంఎస్ లింగాపూర్ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించి పాఠశాల ఖ్యాతిని మరింత పెంచారు. బి. అద్వైత్ రాష్ట్రస్థాయిలో 6వ ర్యాంకు సాధించి రూ.700 నగదు స్కాలర్‌షిప్ అందుకోవడం పాఠశాలకు గర్వకారణంగా మారగా, ఎ. శ్రీనిత్ రాష్ట్రస్థాయిలో 17వ ర్యాంకు సాధించి తన ప్రతిభను చాటాడు. విద్యార్థుల విజయాల వెనుక ఉపాధ్యాయుల అంకితభావం నిలిచింది. మ్యాథ్స్‌లో సూర్య భగవాన్, సైన్స్‌లో అఖిల్, ఇంగ్లీష్‌లో జగదీశ్వర్, హిందీలో స్వాతి, సోషల్‌లో సునీత దత్తకు ఇండియన్ టాలెంట్ ఒలింపియాడ్స్ నుంచి అప్రిషియేషన్ సర్టిఫికెట్లు లభించాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. సదానందం విద్యార్థులను ప్రోత్సహిస్తూ ఉత్తమ ఫలితాల దిశగా నడిపించిన సేవలకు గుర్తింపుగా నేషనల్ వైడ్ అప్రిషియేషన్ సర్టిఫికెట్ అందుకోవడం పాఠశాలకు మరో గౌరవంగా నిలిచింది. ఈ విజయాలు కేవలం ర్యాంకులకే పరిమితం కాకుండా, ప్రభుత్వ పాఠశాలల్లోనూ నాణ్యమైన విద్య అందుతుందనే విషయాన్ని మరోసారి నిరూపించాయి. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు పి. సదానందం విజేత విద్యార్థులు, ఉపాధ్యాయులను అభినందిస్తూ, భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించి లింగాపూర్ పేరు దేశవ్యాప్తంగా నిలబెట్టాలని ఆకాంక్షించారు.

# మాంసం వ్యాపారులకు సీరియస్ వార్నింగ్!!

**అపరిశుభ్రంగా ఉంటే లైసెన్సులు రద్దు**
**ప్రజల ఆరోగ్యంతో ఆటలాడితే ఊరుకోం**
**వ్యర్థాలను కాలువల్లో వేస్తే భారీ జరిమానా**
**పశు వధశాలలనే ఉపయోగించాలి**
**ప్లాస్టిక్ కవర్లపై నిషేధం కఠినతరం**
**మార్కెట్ పక్కన 40 అడుగుల రోడ్డుకు మార్గదర్శకాలు**
**రామగుండం మేయర్ మహంకాళి స్వామి**



పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూన్ 27 (విజన్ ఆంధ్ర):అపరిశుభ్ర వాతావరణంలో మాంసం విక్రయాలు జరిపితే లైసెన్సు రద్దు చేయడమే కాకుండా, మార్కెట్ నుండి శాశ్వతంగా ఖాళీ చేయిస్తామని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి వ్యాపారులను తీవ్రస్థాయిలో హెచ్చరించారు. శనివారం 39వ డివిజన్ శివాజీనగర్ కూరగాయల మార్కెట్ సందర్శనలో భాగంగా, మాంసం దుకాణాల వద్ద నెలకొన్న అపరిశుభ్రతపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మునిసిపల్ వాహనాలకు చెత్త ఇవ్వకుండా పురుగులు పట్టేదాకా నిలువ ఉంచడం, మాంసం వ్యర్థాలను కాలువల్లో పడేయడంపై మండిపడుతూ, ఇకపై ఇలాంటి పనులు పునరావృతమైతే కఠిన చర్యలు ఉంటాయని, అందరూ తప్పనిసరిగా పశు వధశాలనే ఉపయోగించుకోవాలని స్పష్టం చేశారు. వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున, ఇలాంటి అపరిశుభ్ర పరిస్థితుల్లో విక్రయాలు జరిపి ప్రజల ఆరోగ్యంతో ఆటలాడవద్దని ఆయన హితవు పలికారు. ఒకవైపు స్థానిక ఎమ్మెల్యే సుమారు 4 కోట్ల నిధులు మంజూరు చేయించి మార్కెట్‌ను అందంగా, పరిశుభ్రంగా తీర్చిదిద్దుతుంటే, మరోవైపు వ్యాపారులు దుర్గంధపు వాసనతో కనీసం నిలబడలేని విధంగా మార్కెట్‌ను అస్తవ్యస్తంగా తయారు చేయడం ఎంతమాత్రం సరికాదని మేయర్ వ్యాఖ్యానించారు. ఈ క్రమంలోనే దుకాణాల ముందరి వ్యర్థాలు, పాత వస్తువులను తక్షణమే తొలగింపజేసిన ఆయన, నీడ కోసం క్రమపద్ధతిలో రేకులు వేసుకోవాలని సూచించారు. మార్కెట్‌లో నిషేధిత ప్లాస్టిక్ కవర్లు ఉపయోగిస్తే, రోడ్లపై చెత్త వేస్తే పరిమాణాన్ని బట్టి భారీ జరిమానాలు విధించాలని అధికారులను ఆదేశించారు. అలాగే, కూరగాయల వ్యర్థాలను మార్కెట్ పరిధిలోనే రీసైక్లింగ్ చేయడానికి చర్యలు తీసుకోవాలని, మార్కెట్ పక్కన 40 అడుగులకు తగ్గకుండా కొత్త రోడ్డు నిర్మించాలని ఇంజనీరింగ్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ పారిశుధ్య ప్రత్యేక డ్రైవ్‌లో పాల్గొన్న మునిసిపల్ సిబ్బందికి అల్పాహారం అందించిన లయన్స్ క్లబ్ ఆఫ్ రామగుండం నిర్వాహకులను, వారి 1000 రోజుల సేవా కార్యక్రమ మైలురాయిని అభినందిస్తూ మేయర్ మహంకాళి స్వామి ఈ పర్యటనను ముగించారు.

# మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

## జూనియర్ సివిల్ జడ్జ్ బి.శ్రీలత సూర్యచంద్ర ప్యాలెస్ పాఠశాలలో డ్రగ్స్‌పై అవగాహన సదస్సు




వనపర్తి జిల్లా ప్రతినిధి, జూన్ 27 (విజన్ ఆంధ్ర) యువత, విద్యార్థులు మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని జూనియర్ సివిల్ జడ్జ్ పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణాకు వ్యతిరేకంగా అంతర్జాతీయ దినోత్సవం (ఇంటర్నేషనల్ డే అగైనెస్ట్ డ్రగ్ అబ్యూస్) సందర్భంగా, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా కేంద్రంలోని సూర్యచంద్ర ప్యాలెస్ పాఠశాలలో శనివారం మాదకద్రవ్యాలపై ప్రత్యేక అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు.ఃఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జూనియర్ సివిల్ జడ్జ్ బి.శ్రీలత మాట్లాడుతూ... మదకద్రవ్యాలు తీసుకోవడం వల్ల చిన్న వయసులోనే యువత తీవ్ర అనారోగ్యాల బారిన పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. క్షణికానందం కోసం డ్రగ్స్ వైపు ఆకర్షితులై జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. చట్ట ప్రకారం డ్రగ్స్ విక్రయించినా, లేదా వాటిని స్వీకరించినా కఠిన శిక్షలు తప్పవని ఆయన హెచ్చరించారు.ఃఆకట్టుకున్న నాటిక ప్రదర్శనుడ్రగ్స్ వినియోగం వల్ల సమాజంలో, కుటుంబాల్లో ఏర్పడే తీవ్ర నష్టాలను, అనర్థాలను వివరిస్తూ పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన నాటిక అందరినీ ఆలోచింపజేసింది. డ్రగ్స్ మహమ్మారికి బానిసలై జీవితాలను ఎలా కోల్పోతున్నారో విద్యార్థులు తమ నటన ద్వారా కళ్లకు కట్టినట్లు చూపించారు.ఃఈ అవగాహన సదస్సులో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్స్ రఘు, శ్రీదేవి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు దివ్య తేజ, మహాలక్ష్మి, ఏవో బాలరాజుతో పాటు ఉపాధ్యాయులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ టీచర్లు,ఆయా ల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల

## అర్హులైన మహిళా అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

## -జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్




గద్వాల జూన్ 27 (విజన్ ఆంధ్ర బ్యూరో)జోగులాంబ గద్వాల్ జిల్లాలోని (3) ఐ.సి.డి.ఎస్ ప్రాజెక్ట్ కార్యాలయ పరిధిలోని ఖాళీగా ఉన్న అంగన్వాడీ టీచర్లు,గిరిజన ప్రాంతాల అంగన్వాడీ ఆయా పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఐసీడీఎస్ గద్వాల్ అర్బన్ ప్రాజెక్టులో 28 అంగన్వాడీ టీచర్ పోస్టులు,5 గిరిజన ప్రాంతాల అంగన్వాడీ ఆయా పోస్టులు కలిపి మొత్తం 33 పోస్టులు,ఐసీడీఎస్ మల్దకల్ ప్రాజెక్టులో 22 అంగన్వాడీ టీచర్ పోస్టులు,4 గిరిజన ప్రాంతాల అంగన్వాడీ ఆయా పోస్టులు కలిపి మొత్తం 26 పోస్టులు,ఐసీడీఎస్ మానవపాడు ప్రాజెక్టులో 14 అంగన్వాడీ టీచర్ పోస్టులు ఉన్నాయి.ఈ మూడు ప్రాజెక్టులలో కలిపి మొత్తం 64 అంగన్వాడీ టీచర్ పోస్టులు,9 గిరిజన ప్రాంతాల అంగన్వాడీ ఆయా పోస్టులు, మొత్తం 73 పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు.అర్హులైన మహిళా అభ్యర్థులు ఈ నెల 29వ తేదీ నుంచి జూలై 8వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.అర్హతలు, నిబంధనలు,పోస్టుల వివరాలు , దరఖాస్తు విధానం కోసం మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిక వెబ్‌సైట్ nsTTq https://www.wdcw.tg.nic.in/ ను సందర్శించాలని సూచించారు.ఆన్లైన్లో సమర్పించిన దరఖాస్తులు మాత్రమే పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు.అవసరమైతే ఈ నియామక ప్రక్రియను ఏ దశలోనైనా రద్దు చేసే అధికారం జిల్లా కలెక్టర్ కు ఉంటుందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే తండాల అభివృద్ధి

## శ్రీ హర్ష కంటి దవాఖానలో ప్రతి బుధవారం ఉచిత కంటి ఆపరేషన్లు

## ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్‌లు తప్పనిసరి


– హైదరాబాద్‌లో శస్త్రచికిత్సలు



ములుగు జూన్ 27;విజన్ ఆంధ్ర ప్రతినిధిపాల్ సాబ్ పల్లి రోడ్డు, పాత పోలీస్ స్టేషన్ పక్క గల్లిలో గల శ్రీ హర్ష కంటి దవాఖాన ఆధ్వర్యంలో ప్రతి బుధవారం ఉచిత కంటి ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి యాజమాన్యం తెలిపింది. కంటి శస్త్రచికిత్సలు హైదరాబాద్‌లో నిర్వహిస్తామని, శస్త్రచికిత్సకు వచ్చే వారు తప్పనిసరిగా ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్ పత్రాలు వెంట తెచ్చుకోవాలని కంటి వైద్యులు సూచించారు. ఉచిత ఆపరేషన్లకు సంబంధించిన పూర్తి వివరాలు, రిజిస్ట్రేషన్ కోసం డాక్టర్ నంబర్ 9848181314 కు సంప్రదించాలని ఆ ప్రకటనలో కోరారు. కంటి సమస్యలు ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు

## నిర్మల్‌లో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ ఆలీ గారికి ఘన స్వాగతం

నిర్మల్ జిల్లా,జూన్ 27,(విజన్ ఆంధ్ర);ఈరోజు అదిలాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా నిర్మల్ జిల్లా కేంద్రంలోని గంజాల్ టోల్ ప్లాజా వద్ద ప్రభుత్వ రంగ సంస్థలు తెలంగాణ ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ ఆలీ గారికి,వీ=జు×రా వైస్ చైర్మన్ ఫహీం ఖురేషి గారికి నిర్మల్ మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి గారు, నిర్మల్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ అర్జుమండ్ అలీ గారు ఘన స్వాగతం పలికారు.



## వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి రెండున్నర ఏళ్లలోనే తండాల ప్రగతికి రూ.45 కోట్లు

## నియోజకవర్గంలో ప్రతి తండాకు సేవాలాల్ ఆలయ నిర్మాణం

## వనపర్తిలో ఘనంగా 'ఇందిరమ్మ ఆశీర్వాద స్వర్ణోత్సవ బస్సు యాత్ర'

## గిరిజన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు భారీ స్వాగతం

వనపర్తి జిల్లా ప్రతినిధి, జూన్ 27 (విజన్ ఆంధ్ర)కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే గిరిజనతాండాలని అభివృద్ధి చెందాయని వనపర్తి నియోజకవర్గ పరిధిలోని తండాల అభివృద్ధికి రెండున్నర సంవత్సరాలలో 45 కోట్ల రూపాయలను మంజూరు చేసినట్లు వనపర్తి శాసనసభ్యులు గౌరవ శ్రీ తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. ఎస్టీ రిజర్వేషన్లు కల్పించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో గిరిజన ఎంపీలు ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు చేపట్టిన బస్సు యాత్ర శనివారం కొల్లాపూర్ నుంచి వనపర్తి నియోజకవర్గానికి చేరుకుందిఈ సందర్భంగా వనపర్తి శాసనసభ్యులు మేఘారెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శివసేన రెడ్డి నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాలు అన్ని గ్రామాల నుంచి 5000



మందితో ర్యాలీగా వెళ్లి బస్సు యాత్రకు స్వాగతం పలికారు. వనపర్తి పట్టణ శివారు మెట్టుపల్లి నుంచి మోటార్ సైకిల్ ర్యాలీతో అంబేద్కర్ చౌరస్తా కు చేరుకున్న నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి పాదయాత్రగా బయలుదేరి రాజీవ్ చౌరస్తా మీదుగా ఇందిరాగాంధీ పార్కు వద్దకు చేరుకొని స్వర్గీయ మాజీ ప్రధాని ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాజీవ్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యేలు మురళి నాయక్, రామచంద్రనాయక్, బాలు నాయక్, రాందాస్ నాయక్,ఎంపీ బలరాం నాయక్, మాజీ ఎమ్మెల్సీలు శంకర్ నాయక్,రాములు నాయకులతో పాటు బేలయ్యనాయక్ రవీందర్ నాయక్ లు మాట్లాడారు. గిరిజన రిజర్వేషన్ కల్పించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా చేపట్టిన ఇందిరమ్మ ఆశీర్వాద స్వర్ణోత్సవ బస్సుయాత్ర వనపర్తి కి చేరుకున్న సందర్భంగా ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆధ్వర్యంలో తమకు ఇంత ఘనంగా స్వాగతం పలికిన గిరిజన సహోదరులందరికీ ఎంపీలు ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు మొదటగా కృతజ్ఞతలు తెలియజేశారు. స్వతంత్రం వచ్చిన నాటి నుంచి గిరిజనుల సంక్షేమానికి పాటుపడిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమేనని తెలంగాణ రాష్ట్రంలోని గిరిజనులంతా కాంగ్రెస్ పార్టీ పక్షాన ఉన్నారని వారు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక రెండున్నర సంవత్సరాలలో గిరిజన తండాలలో ప్రతీ నిరుపేదకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసిందని, ఉచిత కరెంటు నిస్తోందని, రేషన్ కార్డును అందజేసి



నిరుపేద గిరిజనులకు సన్నబియాని పంపిణీ చేస్తూ మూడు పూటలా భోజనాన్ని అందిస్తుందని వారన్నారు. గిరిజనులు రిజర్వేషన్ కేటాయించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా గిరిజనులకు కాంగ్రెస్ పార్టీ చేసిన సేవలను మననం చేసుకుంటూ ఈ యాత్ర చేపట్టినట్లు వారు పేర్కొన్నారు. వనపర్తి నియోజకవర్గ పరిధిలో ఇంత పెద్ద ఎత్తున తమకు స్వాగతం పలికి ఈ సమావేశానికి హాజరైన మీరు ఎప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మరువకూడదన్నారు. గతంలో తండాలకు వెళ్లాలంటే రోడ్డు సౌకర్యం కూడా సరిగా లేదని నేడు ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి తండాకు పటిష్టమైన తారు రోడ్లు నిర్మించుకున్నామని వారి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గిరిజనుల పక్షపాతి అని గిరిజనుల అభివృద్ధి కోసం ఆయన అహర్నిశలు కష్టపడుతున్నారని వారి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వనపర్తి మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, మార్కెట్ యార్డ్ చైర్మన్, శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, గిరిజన నాయకులు మాజీ ఎంపీపీ శంకర్ నాయక్, సర్పంచ్ వాళ్లే నాయక్, గిరిజన గ్రామ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ ప్రజా ప్రతినిధులతో పాటు, అన్ని మండలాల గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ములుగులో పల్స్ పోలియో: 22,572 మంది చిన్నారులకు చుక్కల మందు

### 312 బూత్‌లు, 15 మొబైల్ టీమ్‌లు ఏర్పాటు డాక్టర్ నాగ అనేష్.

ములుగు జూన్ 27;విజన్ ఆంధ్ర ప్రతినిధి జిల్లాలో ఆదివారం నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రజలంతా భాగస్వాములై విజయవంతం చేయాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల నియంత్రణ అధికారి డాక్టర్ నాగ అనేష్ శనివారం కోరారు. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలో 0–5 ఏళ్లలోపు చిన్నారులు 22,572 మంది ఉన్నారని, వారందరికీ పోలియో చుక్కల మందు వేసేందుకు 312 పోలియో బూత్‌లు, 10 ట్రాన్సిట్ బూత్‌లు, 15 మొబైల్ టీమ్‌లతో ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశామని వివరించారు. పోలియో వ్యాధి నివారణకు వైద్య సిబ్బందితో పాటు ఇతర శాఖలను సమన్వయం చేసుకుంటూ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. వైద్య ఆరోగ్య శాఖతో పాటు ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు, ప్రజలందరూ భాగస్వాములైనప్పుడే ఈ కార్యక్రమం 100% విజయవంతం అవుతుందని డాక్టర్ నాగ అనేష్



పిలుపునిచ్చారు. 5 ఏళ్లలోపు పిల్లలందరికీ తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలని కోరారు.

## సర్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్ దీపక్ తివారి

వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 27 (విజన్ ఆంధ్ర) : ఎస్ఐఆర్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ తెలిపారు. శనివారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని ఆలంపల్లి వార్డులో స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ ఇంటింటి సర్వే తీరును క్షేత్ర స్థాయిలో జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ పరిశీలించారు. ఎన్యూమరేషన్ ఫారాలు బిఎల్ఓ ప్రతి ఇంటికి తిరిగి అందించాలని కలెక్టర్ తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా సర్ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. ఓటర్ జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని ఆయన బిఎల్ఓ లకు సూచించారు. ఎన్యూమరేషన్ ఫారంలో తప్పులు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత బిఎల్ఓలదేనని కలెక్టర్ తెలిపారు. ప్రజలు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములై తమ వివరాలను సరిచూసుకోవాలని కలెక్టర్ సూచించారు. అనంతరం కొత్తగడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం సంబంధించిన వంటకాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందించాలని అధికారుల సూచించారు.

# మహిళల భద్రతకు షీ టీమ్స్ వినూత్న కార్యాచరణ

## విద్యార్థినుల రక్షణకు కొత్త భరోసా షీ వాలంటీర్ వ్యవస్థకు శ్రీకారం

### పోకిరీలకు నో భద్రతకు యెస్

### గోప్య ఫిర్యాదులు, ప్రత్యేక నిఘా

### వేగవంతమైన స్పందనకు కొత్త ప్రణాళికలు

### షి టీం ఎస్ ఐ రమా దేవి

కొత్తగూడెం బ్యూరో జూన్ 28(విజన్ ఆంధ్ర)మహిళలు, యువతులు, విద్యార్థినులు భయరహిత వాతావరణంలో జీవించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన షీ టీమ్స్ రాష్ట్రవ్యాప్తంగా మరింత విస్తృతంగా పనిచేస్తున్నాయని షీ టీం ఎస్ఐ రమాదేవి తెలిపారు. మహిళలపై జరుగుతున్న వేధింపులు, ఈవ్‌టీజింగ్, సోషల్ మీడియా దుర్వినియోగం, మానసిక వేధింపులు, అనుచిత వ్యాఖ్యలు, వెంటపడటం, బెదిరింపులు, అసభ్య ప్రవర్తన వంటి ఘటనలను అరికట్టడమే షీ టీమ్స్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు మహిళల భద్రతను మరింత బలోపేతం చేయడానికి వినూత్న చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. మహిళల రక్షణ అనేది కేవలం పోలీసు శాఖ బాధ్యత మాత్రమే కాకుండా కుటుంబం, విద్యాసంస్థలు, సమాజం, ప్రజా రవాణా వ్యవస్థలు కలిసి నిర్వర్తించాల్సిన బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రస్తుతం స్కూల్‌లు, కాలేజీలు, బస్టాప్‌లు, రైల్వే స్టేషన్లు, మార్కెట్ ప్రాంతాలు, విద్యార్థులు ఎక్కువగా సంచరించే ప్రదేశాలు, ప్రజా రవాణా కేంద్రాల్లో ప్రత్యేక నిఘా కొనసాగుతోందన్నారు. సాధారణ దుస్తుల్లో సిబ్బందిని నియమించి అనుమానాస్పద ప్రవర్తన, మహిళలపై వేధింపులకు పాల్పడే వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఎస్ఐ రమాదేవి మాట్లాడుతూ మహిళలు, ముఖ్యంగా విద్యార్థినులు చిన్నగా కనిపించే వేధింపులను కూడా నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. మొదట్లో చిన్న ఇబ్బందిగా అనిపించిన సంఘటనలు తరువాత తీవ్రమైన సమస్యలకు దారితీసే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. ఎవరి నుంచైనా అసభ్యకర వ్యాఖ్యలు, అనవసరంగా వెంటపడటం, సోషల్ మీడియాలో అసభ్య సందేశాలు పంపడం, ఫోటోలు దుర్వినియోగం చేయడం, బెదిరింపులు వంటి ఘటనలు



ఎదురైతే వెంటనే పోలీసులకు లేదా షీ టీమ్స్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. షీ టీమ్స్ ఇప్పటి వరకు అనేక కేసుల్లో మహిళలకు రక్షణ కల్పించిందని తెలిపారు. ఈవ్‌టీజింగ్‌కు పాల్పడే వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైన సందర్భాల్లో కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తల్లిదండ్రులను కూడా పిలిపించి మహిళల పట్ల గౌరవభావం పెంపొందించేలా అవగాహన కల్పిస్తున్నామని వెల్లడించారు. ఒకసారి హెచ్చరికలు, కౌన్సిలింగ్ ఇచ్చిన తర్వాత కూడా అదే తరహా చర్యలకు పాల్పడితే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. మహిళలపై నేరాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించడమే లక్ష్యమన్నారు. విద్యాసంస్థల్లో కొత్త భద్రతా వ్యవస్థలుమహిళల భద్రతను మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు



ఈ ఏడాది పలు వినూత్న కార్యక్రమాలు ప్రారంభించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు ఎస్ఐ రమాదేవి తెలిపారు.

అందులో ముఖ్యంగా "షీ కంప్లైంట్ బాక్స్" ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. స్కూల్‌లు, కాలేజీల్లో విద్యార్థినులు తమ సమస్యలను పేరు బయటకు రాకుండా గోప్యంగా తెలియజేసే అవకాశం కల్పించనున్నారు. వేధింపులు, అసౌకర్యాలు, భద్రతా సమస్యలు, విద్యాసంస్థల పరిసరాల్లో ఎదురయ్యే ఇబ్బందులను ఇందులో నమోదు చేయవచ్చు. అందిన ఫిర్యాదులను సంబంధిత అధికారులు పరిశీలించి వెంటనే స్పందించేలా వ్యవస్థ రూపొందించనున్నట్లు తెలిపారు. షీ వాలంటీర్ వ్యవస్థ ▪ విద్యార్థినులకు కొత్త భరోసా

విద్యాసంస్థల్లో ప్రత్యేకంగా షీ వాలంటీర్ వ్యవస్థను అమలు చేయాలని ప్రతిపాదించారు. ఎంపిక చేసిన విద్యార్థులు, మహిళా అధ్యాపకులు, సిబ్బంది కలిసి భద్రతా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, సమస్యలను గుర్తించడం, బాధితులకు సహాయం చేయడం వంటి కార్యక్రమాల్లో భాగస్వాములు అవుతారని తెలిపారు.

ఇంకా ప్రత్యేక పరిస్థితుల్లో సహాయం అవసరమైన విద్యార్థినులకు పర్సనల్ వాలంటీర్ విధానం తీసుకురావాలని సూచించారు. దీని ద్వారా విద్యార్థులు నేరుగా విశ్వసనీయ వ్యక్తితో మాట్లాడే అవకాశం పొందడంతో సమస్యల పరిష్కారం వేగవంతమవుతుందని చెప్పారు.

**రవాణా వ్యవస్థలోనూ భద్రతకు ప్రాధాన్యం**

విద్యార్థుల రవాణాలో కీలకంగా ఉన్న ఆటో డ్రైవర్లను కూడా ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. స్కూల్, కాలేజ్ విద్యార్థులను తరలించే డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించి వారి బాధ్యతను పెంచాలని సూచించారు.

అదేవిధంగా స్కూల్‌లు, కాలేజీలు, బస్ స్టాప్‌లు, విద్యార్థులు ఎక్కువగా చేరే ప్రాంతాల్లో అదనపు పర్యవేక్షణ, అవసరమైన చోట్ల సీసీ కెమెరాల ఏర్పాటు, భద్రతా ప్రమాణాల అమలు వంటి చర్యలు చేపట్టాలని ప్రతిపాదించారు.

టి–సేఫ్ సేవలపై అవగాహన ▪అత్యవసర సమయంలో 112కు కాల్ చేయండి

మహిళల భద్రతకు సంబంధించిన టి–సేఫ్ సేవలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే 112 అత్యవసర సేవలను సంప్రదించాలని, సమయానికి సమాచారం అందితే వేగంగా స్పందించే అవకాశం ఉంటుందని వివరించారు.

మహిళలు, యువతులు, విద్యార్థినులు భయపడకుండా ముందుకు వచ్చి తమ సమస్యలను తెలియజేయాలని, మహిళల భద్రత అనేది ప్రతి ఒక్కరి బాధ్యత అనే భావనతో సమాజం మొత్తం కలిసి పనిచేయాలని షీ టీం ఎస్ఐ రమాదేవి పిలుపునిచ్చారు. మహిళలకు భద్రత కల్పించే దిశగా షీ టీమ్స్ మరింత సమర్థవంతంగా పనిచేస్తూ నమ్మకాన్ని పెంచుతున్నాయని పేర్కొన్నారు.

## పసిఫిక్ 'ఎల్ నినో' 'జ్వరంతో భారతదేశానికి 'తీరేనా దాహం'



( ఆకెళ్ళ విశ్వనాథ్)హైదరాబాద్ : – పసిఫిక్ మహా సముద్రం భారీ ఉష్ణోగ్రత మార్పు 'ఎల్ నినో' ' అఫెక్ట్ యావత్ ప్రపంచాన్ని కుదిపిస్తోంది. ప్రతి 6 నుండి 7 సంవత్సరాలకు పనికట్టుకుని ఒకసారి పసిఫిక్ మహాసముద్రంలో ఒక అదృశ్య శక్తి మేల్కొంది , అది నిశ్శబ్దంగా ప్రపంచ దేశాల తలరాతను మారుస్తోంది. పసిఫిక్ మహాసముద్రంలో ఒక ప్రభావంతమైన "సూపర్ ఎల్ నినో" ఇప్పుడు మరోసారి ఆవిర్భవించింది, ఇది ప్రపంచవ్యాప్తంగా వాతావరణ వ్యవస్థలు, ఆర్థిక వ్యవస్థలు, జీవనోపాధులకు విపరీతంగా విఘాతం కలిగించే సామర్థ్యాన్ని కలిగి ఉంది. అసాధారణ అధిక సముద్ర ఉష్ణోగ్రతల వల్ల ప్రేరేపించబడి, కొనసాగుతున్న గ్లోబల్ వార్మింగ్ ద్వారా తీవ్రతరం అయ్యి 'ఎల్ నినో' తో ఏకకాలంలో అనేక ప్రాంతాలలో కరువులు, మరొకచోట కుంభవృష్టి, వరదలు, ఇంకొక ప్రదేశంలో అధిక ఉష్ణోగ్రతలు , కార్చిచ్చులు ఆహార భద్రతకు, కొరతకు దారితీస్తున్నాయి. ముఖ్యంగా మనదేశ ఆర్థిక వ్యవస్థ, వ్యవసాయం, నీటి భద్రత, గ్రామీణ జీవనోపాధులు అన్నీ ముఖ్యంగా నైరుతి రుతుపవనాలపైన ఎక్కువగా ఆధారపడి ఉంటాయి. బలహీనమైన నైరుతి రుతుపవనాల వల్ల సకాలంలో వర్షాలు కురువకపోవడం, పంట దిగుబడులు తగ్గడం, భూగర్భ జలాల క్షీణత తీవ్రతరం కావడం, ఆహార ధరలు పెరగడం, గ్రామీణ దుస్థితి మరింత తీవ్రం కావడం జరగవచ్చు. ఈ పసిఫిక్ జ్వరం ఎల్ నినో ప్రభావంతో అధికంగా ఉష్ణోగ్రతలు పెరగడం, అవి వడగాలులను తీవ్రతరం చేసి, ప్రజారోగ్యం పైన సవాళ్లను విసురుతుంది. అయినప్పటికీ మనదేశానికి ఇది తప్పించుకోలేని పెద్ద విపత్తు కాదు. అధునాతన ముందస్తు అంచనాలు, చురుకైన పాలన, సంసిద్ధత, సమర్థవంతంగా సకాలంలో పటిష్టమైన చర్యలు, జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఈ ఎల్ నినో ప్రభావాన్ని గణనీయంగా తగ్గించవచ్చు, ప్రభావం నుండి బయటపడవచ్చు.

## ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ప్రాజెక్టుల నిర్మాణం వేగవంతం అయ్యేలా కృషి చేయాలి

### ఎమ్మెల్యే విజయుడు కి వినతిపత్రం అందజేసిన ఉమ్మడి పాలమూరు జిల్లా పెండింగ్ ప్రాజెక్ట్ సాధన జేఏసీ

అలంపూర్ జూన్ 27 (విజన్ ఆంధ్ర బ్యూరో)జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే విజయుడు కి ఉమ్మడి పాలమూరు జిల్లా పెండింగ్ ప్రాజెక్ట్ సాధన జేఏసీ నాయకులు ఉమ్మడి జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు వేగవంతంగా పూర్తి అయ్యేలా కృషి చేయాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూప్రత్యేక రాష్ట్రంలో కూడా ప్రాజెక్టు లపై వివక్ష , ఉమ్మడి పాలమూరు సాగునీటి ప్రాజెక్టు లపై వివక్ష కొనసాగుతుందని ఉమ్మడి పాలమూరు పెండింగ్ ప్రాజెక్ట్ సాధన జేఏసీ సభ్యులు అన్నారు. 1978 లో ఆర్డీఎస్ పై బచవత్ ట్రిబ్యునల్ ఇచ్చిన కేటాయింపులు చేసిన 15.9 టియంసీ ల నీరు రావటం లేదని, 1981 లో నిర్మాణం ప్రారంభించి, 1996 నుండి నీరు విడుదల అవుతున్న జూరాల డ్యామ్ లో సిల్ట్ పేరుకుపోయిందని, నెట్టెంపాడు,బీమా 1,2,కోయిల్ సాగర్ ప్రాజెక్టు లు పెండింగ్ లో ఉన్నాయని తెలిపారు. రీ డిజైన్ తో పనులు ప్రారంభించిన పాలమూరు... రంగారెడ్డి పనుల్లో సగం కూడా పూర్తి కాలేదు అని తెలిపారు. ఇలా జిల్లాలో ఎన్నో సాగునీటి ప్రాజెక్టు లు పెండింగ్ లో ఉన్నాయని అన్నారు. సాగునీటి వినియోగ సమస్యలు పరిష్కారం కోసం, ఇరిగేషన్ కమీషన్ లేకపోవటం, అవగాహనా రాహిత్యం, కాంట్రాక్టర్ల ప్రమేయం తో ప్రాజెక్ట్ ల పరిస్థితి మరింత గంధర గోలంగా మారిందని అన్నారు. ఇలాంటి అసమానతలు తొలగించి, ప్రాజెక్ట్ లను ముందుకు తీసుకెళ్లటంలో చొరవ చూపాలని, ఉమ్మడి పాలమూరు ప్రాజెక్టు ల నిర్మాణం వేగవంతం అయ్యేలా కృషి చేయాలనీ కోరారు. ఎమ్మెల్యే వెంటనే స్పందిస్తూ సంబంధిత మంత్రి కి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని తెలియజేయడం జరిగింది.

# పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**- జిల్లాలో 41,147 మంది చిన్నారులకు పోలియో చుక్కలు.. 358 బూత్‌ల ఏర్పాటు**

**- ప్రతి ఐదేళ్లలోపు చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలి: డీఎంహెచ్ఓ డాక్టర్ జి. ఎంజేలా అల్ఫ్రేడ్**



రాజన్న సిరిసిల్ల, జూన్ 27 : జిల్లాలో ఆదివారం నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రజలు పూర్తి సహకారం అందించాలని జిల్లా వైద్య & ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ జి. ఎంజేలా అల్ఫ్రేడ్ కోరారు. జిల్లాలో 0 నుంచి 5 సంవత్సరాల వయస్సు గల 41,147 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఇందుకోసం జిల్లాలోని 13 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 2 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో మొత్తం 358 పోలియో బూత్‌లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఆదివారం ఉదయం 7 గంటల నుంచి పోలియో చుక్కల కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. ప్రతి ఐదేళ్లలోపు చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ప్రయాణికుల సౌకర్యార్థం సిరిసిల్ల బస్ స్టాండ్‌లో ప్రత్యేక పోలియో బూత్‌ను ఏర్పాటు చేసి అక్కడికి వచ్చే చిన్నారులకు కూడా పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, తమ పరిసరాల్లోని ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించేందుకు సహకరించాలని డీఎంహెచ్ఓ పిలుపునిచ్చారు. పోలియో నిర్మూలన లక్ష్య సాధన కోసం ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, వాలంటీర్లు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. ప్రజల సహకారంతో జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# అర్హత కలిగిన దివ్యాంగులకు మాత్రమే సదరం ధ్రువపత్రాలు



మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 27,(విజన్ ఆంధ్ర ) :సదరం - యు డి ఐ డి శిబిరాల నిర్వహణలో అర్హత కలిగిన దివ్యంగులకు మాత్రమే ధ్రువపత్రాలు జారీ చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్, సెర్ప్ సి.ఈ.ఓ. దివ్య దేవరాజన్ అన్నారు. శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సదరం శిబిరాల నిర్వహణ, యు డి ఐ డి పోర్టల్ పార్ట్ బి వివరాల నమోదు, అటెండెన్స్ మార్కింగ్, దివ్యాంగుల హాజరు, పోర్టల్ లో వెయిటింగ్ లిస్ట్ ఉన్నవారికి వైద్య శిబిరం అసెస్మెంట్ షెడ్యూల్ కేటాయింపు అంశాలపై జిల్లా అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సి.ఈ.ఓ. మాట్లాడుతూ ప్రతి నెల నిర్వహించే సదరం- యు డి ఐ డి శిబిరాలను పారదర్శకంగా నిర్వహించాలని, అర్హత కలిగిన దివ్యాంగులకు మాత్రమే ధ్రువపత్రాలు జారీ చేయాలని తెలిపారు. పెండింగ్ దరఖాస్తులు లేకుండా పరిష్కరించాలని, ప్రతినెలా తప్పనిసరిగా ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని తెలిపారు. ప్రతినెల మండలానికి ఒక గ్రామం చొప్పున దివ్యాంగుల గుర్తింపు, సదరం ధ్రువపత్రం లేని వారికి మీ సేవలో నమోదు, లోకో మోటర్, ఈ ఎన్ టి, కంటి శిబిరాల నిర్వహణ, బేరా, సౌండ్ ప్రూఫ్ పరికరాల లభ్యత, వినియోగం అంశాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య మాట్లాడుతూ మీ-సేవ ద్వారా సదరం శిబిరం కొరకు అందిన దరఖాస్తులను క్రమ సంఖ్య వారీగా పరిశీలించి అభ్యర్థులకు వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, వైద్య పరీక్షల నిర్వహణలో ప్రభుత్వ నియమ నిబంధనలను అమలు చేస్తున్నామని, వైద్య పరీక్షలు పారదర్శకంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఎం.ఓ. శ్రీధర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మహత్య చేసుకున్న గుండెల్లి ఆంజనేయులు అంతిమయాత్రలో పాల్గొని పాడే మోసిన గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి గారు



సిద్దిపేట జిల్లా ప్రతినిధి జూన్ 28 : సిద్దిపేట జిల్లా కేంద్రంలో గల కొండపాక మండలందుద్దెడ గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్, ప్రస్తుత వార్డ్ మెంబర్ గుండెల్లి ఆంజనేయులు గారు ఆత్మహత్య చేసుకుని మృతి చెందడం జరిగింది. విషయం తెలుసుకున్న గజ్వేల్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి గారు ఈరోజు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం శోకసముద్రంలో ఉన్న గుండెల్లి ఆంజనేయులను కుటుంబ సభ్యులను ఓదారుస్తూ ధైర్యంగా ఉండాలని చెప్పి మనోధైర్యాన్ని కల్పించారు. గుండెల్ని ఆంజనేయులు అంతిమయాత్రలో పాల్గొని పాడే మోశారు. ఎంతటి సమస్య ఎదురైన మొక్కవుని గుండె ధైర్యంతోఉండాలని,ఆత్మహత్యలు సమస్యలకు పరిష్కారాలు కావని, ఆత్మహత్యలు చేసుకుని కుటుంబ సభ్యులనుశోకసముద్రంలో నెట్టవద్దని కోరారు. గుండెల్లి ఆంజనేయులు పవిత్ర ఆత్మకు భవంతుడు శాంతిని చేకూర్చాలని కోరుకున్నారు వారి వెంట మండల పార్టీ అధ్యక్షుడు నూనె కుమార్ యాదవ్, మాజీ జెడ్పిటిసి అనంతల అశ్విని ప్రశాంత్, దుద్దెడ గ్రామ సర్పంచ్ శివకుమార్, సీనియర్ నాయకులు దోమల ఎల్లం, బొడ్డుల కనకయ్య, మాజీ ఎంపిటిసి బాలాజీ గ్రామస్తులు తదితరులు ఉన్నారు

# అట్టహాసంగా 'ది హెవెన్లీ కన్స్ట్రక్షన్స్ అండ్ డెవలపర్స్ గ్రూప్' నూతన కార్యాలయ ప్రారంభం..!

**- నాణ్యమైన నిర్మాణాలతో వినియోగదారుల విశ్వాసాన్ని మరింత పెంపొందిస్తాం..!**




కాప్రా /జూన్ 27 ( విజన్ ఆంధ్ర ప్రతినిధి ) : మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా నాచారం సర్కిల్ పరిధిలోని 19వ డివిజన్ మీర్‌పేట్ హెచ్.బీ. కాలనీ, కృష్ణానగర్ ఎన్.ఎఫ్.సీ. మెయిన్ రోడ్డులో ది హెవెన్లీ కన్స్ట్రక్షన్స్ అండ్ డెవలపర్స్ గ్రూప్ నూతన కార్యాలయాన్ని శనివారం నాడు ప్రార్థనల నడుమ ఘనంగా ప్రారంభించారు. పాస్టర్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి రిబ్బన్ కట్ చేసి కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ సీ.ఎం.డీ.చల్లా రామిరెడ్డి, సీఈఓ చల్లా అనిల్ రెడ్డి పాల్గొన్నారు. పాస్టర్ మాట్లాడుతూ, ది హెవెన్లీ కన్స్ట్రక్షన్స్ గ్రూప్ నాణ్యమైన నిర్మాణాలతో వినియోగదారుల విశ్వాసాన్ని సంపాదించిందని కొనియాడారు. అపార్ట్‌మెంట్లు, ఇండిపెండెంట్ హౌస్‌లు, చర్చిలు, ఆసుపత్రులు, ఫామ్‌హౌస్‌లు తదితర నిర్మాణాలను నాణ్యతతో చేపడుతూ సంస్థ మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. అలాగే సంస్థను నమ్ముకుని పనిచేస్తున్న మేస్త్రీలు, కార్మికులు, ఇంజినీర్లు, సూపర్‌వైజర్లు, ప్లంబర్లు, ఎలక్ట్రికల్ వర్కర్లు, కార్యాలయ సిబ్బందిపై దేవుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించారు. అనంతరం సంస్థ ప్రతినిధులు ప్రత్యేక ప్రార్థనల మధ్య సీ.ఎం.డీ. అనిల్ కుమార్ రెడ్డిని ఆశీర్వదించారు. కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించగా, కార్యక్రమానికి హాజరైన అతిథులు, ఉద్యోగులు, కార్మికులకు అన్నప్రసాదం వడ్డించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సిబ్బంది, కార్మికులు, ఆహ్వానితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అవార్డ్స్ ఫర్ సేల్!!

**- అవార్డు అడుక్కో... లేదంటే కొనుక్కో...!!**

**- పైసలిస్తే ప్రతిభ పట్టం మీకే సొంతం..!!**

**- అవార్డుల పేరుతో కొత్త వ్యాపారం?**

**- ధనార్జనే ధ్యేయంగా నిత్య సన్మాన సభలు**

**- అర్హత కంటే ఆర్థిక సామర్థ్యానికే ప్రాధాన్యం**

**- అవార్డుల విశ్వసనీయతపై పెరుగుతున్న సందేహాలు...!**




**హైదరాబాద్, జూన్ 27 (విజన్ ఆంధ్ర) :** ఒకప్పుడు అవార్డు అంటే విశిష్ట సేవలకు, అసాధారణ ప్రతిభకు గుర్తింపుగా భావించేవారు. కానీ ప్రస్తుతం పరిస్థితులు పూర్తిగా మారిపోయాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. సామాజిక సేవ, విద్య, సాహిత్యం, కళలు, జర్నలిజం, వ్యాపారం... ఇలా ఏ రంగమైనా సరే, కొంత మొత్తాన్ని చెల్లిస్తే "జాతీయ అవార్డు", "అంతర్జాతీయ అవార్డు", "ప్రతిభా పురస్కారం" పేర్లతో సన్మానాలు పొందే పరిస్థితి ఏర్పడిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని స్వచ్ఛంద సంస్థలు, ట్రస్టులు, సంఘాలు అవార్డులను గౌరవ సూచకంగా కాకుండా ఆదాయ వనరుగా మార్చుకున్నాయి. సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపుల ద్వారా ప్రకటనలు ఇస్తూ, దరఖాస్తు రుసుములు, సభ్యత్వ ఫీజులు, నమోదు ఛార్జీల పేరుతో వేల రూపాయలు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అవార్డు అందుకునే వారి ప్రతిభ, సేవలు, అర్హతల కంటే వారు చెల్లించే మొత్తానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ప్రముఖుల ఫోటోలు, ప్రముఖ హోటళ్లలో కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ఈ వేడుకలకు ఆకర్షణీయ రూపం కల్పిస్తున్నప్పటికీ, అవార్డుల విశ్వసనీయతపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతి వారం, ప్రతి నెల కొత్త పేర్లతో అవార్డు కార్యక్రమాలు నిర్వహించబడుతుండటంతో నిజమైన ప్రతిభావంతుల కృషి విలువ తగ్గిపోతోందని మేధావులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అర్హత, ప్రతిభ, సేవల ఆధారంగా కాకుండా ఆర్థిక లావాదేవీల ఆధారంగా అవార్డులు పంపిణీ కావడం సమాజానికి మంచిది కాదని వారు అభిప్రాయపడుతున్నారు. ప్రతిభకు గుర్తింపుగా ఉండాల్సిన అవార్డులు నేడు అమ్మకపు వస్తువులుగా మారుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. అర్హత కంటే ఆర్థిక సామర్థ్యానికే ప్రాధాన్యం పెరుగుతోందని పలువురు అభిప్రాయపడుతున్నారు. దరఖాస్తు ఫీజులు, సభ్యత్వ రుసుముల పేరుతో అవార్డుల వ్యాపారం సాగుతోందనే ఆరోపణలు ఉన్నాయి. నిజమైన ప్రతిభావంతుల కృషి విలువ కోల్పోయే ప్రమాదం నెలకొంది. అవార్డుల వ్యవస్థలో పారదర్శకత, విశ్వసనీయత కాపాడాల్సిన అవసరం ఉందని మేధావులు సూచిస్తున్నారు. అవార్డుల పేరుతో జరుగుతున్న ఈ వ్యాపార ధోరణిపై సంబంధిత అధికారులు దృష్టి సారించి, పారదర్శక ప్రమాణాలు అమలు చేయాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు.

**- గడ్డం రాజు**
**స్పెషల్ కరస్పాండెంట్, విజన్ ఆంధ్ర**

# హుకుం జారీ... హద్దులు మీరి!!

**- గోదావరిఖని మీడియా సర్కిల్స్‌లో హాట్ టాపిక్**

**- సింగరేణి సాక్షిగా... కొందరి 'జర్నలిజం' నయా రాచరికం**

**- ప్రెస్ మీట్‌కు వారే రావాలట.. వేరే వాళ్లు వస్తే ఒప్పుకోరట**

**- గోదావరిఖనిలో సాటి కలంపైనే కక్ష సాధింపు**




పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూన్ 27 (విజన్ ఆంధ్ర): కలం పడితే సమాజం గొంతుక కావాలి. కానీ, ఇక్కడ సీన్ రివర్స్ అయింది! సింగరేణి బొగ్గు గనుల సాక్షిగా కొందరు జర్నలిస్టులు కొత్త 'రాచరికానికి' తెరలేపారు. "మేం చెప్పిందే శాసనం... మేం గీసిన గీత దాటొద్దు" అంటూ ఏకంగా సింగరేణి అధికారులకే హుకుం జారీ చేస్తుండడం ఇప్పుడు గోదావరిఖనిలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

**మా రూటే సెపరేటు... మా గ్రూపే గ్రేటు!!**

ప్రెస్ మీట్ పెట్టాలా? అయితే మాకు మాత్రమే పిలుపు అందాలి. పొరపాటున మిగతా జర్నలిస్టులను పిలిచారో... మేం రాం, మీ మీటింగ్‌ను బాయ్‌కాట్ చేస్తాం. ఇదీ సదరు 'పెద్ద మనుషుల' అల్టిమేటం. చిత్రమేమిటంటే, నిజాన్ని నిర్భయంగా చెప్పాల్సిన కలం, తోటి జర్నలిస్టులపైనే కక్ష సాధింపుకు దిగడం. ఒకే వృత్తిలో ఉంటూ, ఒకరికొకరు తోడుగా ఉండాల్సింది పోయి, 'మమ్మల్ని కాదని వేరే వాళ్లను ఎలా పిలుస్తారు?' అనే ఈ ఓర్వలేని తనం చూస్తుంటే ముక్కున వేలేసుకోవడం ఖని ప్రజల వంతవుతోంది. ఇలాంటి సంకుచిత మనస్తత్వం మరే ఇతర ప్రాంతంలోనూ కనిపించదేమో.

**'ఊ' కొడుతున్న అధికారులు...!**

అందరికంటే విడ్డూరం ఏంటంటే... వేల కోట్ల టర్నోవర్‌తో, దేశానికే వెలుగులు పంచే సింగరేణి సంస్థకు చెందిన కొందరు అధికారులు, ఈ కొద్దిమంది జర్నలిస్టుల బ్లాక్‌మెయిలింగ్ పాలిటిక్స్‌కు లొంగిపోతుండడం. వారు చెప్పిన ప్రతిదానికీ తలలూపుతూ, మిగతా జర్నలిస్టులకు అన్యాయం చేస్తున్నారు.

**ఇదేనా మీ పారదర్శకత?**

ముగ్గురు నలుగురు అహంకారాన్ని తృప్తి పరచడం కోసం, వ్యవస్థను వారి కాళ్ల దగ్గర పెట్టడం ఎంతవరకు సమంజసం అని మిగతా జర్నలిస్టు లోకం ప్రశ్నిస్తోంది.

**కలం కన్నీరు పెడుతోంది...!!**

జర్నలిజం అంటే సమాజంలో అణగారిన వర్గాల తరఫున పోరాడటం. కానీ గోదావరిఖనిలో జరుగుతున్న ఈ వరుస ఘటనలు సాటి జర్నలిస్టుల పైనే అక్కసును, అసూయను వెళ్లగక్కుతున్నాయి. ఇప్పటికైనా సింగరేణి అధికారులు ఒకరిద్దరి మాటలకు ఊ కొట్టడం మానేసి, మీడియా మొత్తాన్ని సమానంగా గౌరవించాలి. అలాగే, ఈ 'హుకుం' జారీ చేసే జర్నలిస్టులు కూడా తమ మోడర్న్ ముసుగును తీసి, తోటి జర్నలిస్టుల పట్ల కనీస గౌరవాన్ని ప్రదర్శించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేదంటే, కాలం ఎవరికైనా ఒకేలాంటి తీర్పు ఇస్తుంది. బీ కేర్ ఫుల్......

# పాలేరు తీరాన ఇసుక 'దందా'.. నాయకుల అండతో రవాణా

**- అనంతగిరి మండలంలో యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా.**

**- "మన ఊరు - మన ఇసుక" పథకానికి తూట్లు.**

**- అడ్డువచ్చినందుకు అధికారులపై బదిలీ వేటు?**

**- ట్రాక్టర్ల అతివేగంతో ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకున్న సామాన్యులు.**

**- లక్షల్లో అక్రమార్జన,ప్రభుత్వ చలనాలకు గండి.**



అనంతగిరి, 27 (విజన్ ఆంధ్ర): అనంతగిరి మండలంలో ఇసుక మాఫియా మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది.సూర్యాపేట జిల్లా సరిహద్దు ప్రాంతమైన పాలేరు పరివాహక ప్రాంతాన్ని ఆసరాగా చేసుకుని రాత్రి పగలు తేడా లేకుండా ఇసుకను తరలిస్తూ లక్షల రూపాయల ప్రజాధనాన్ని కొల్లగొడుతున్నారు. అధికార పార్టీ నేతల కనుసన్నల్లోనే ఈ అక్రమ దందా సాగుతుండటంతో నిలదీసే నాథుడే కరువయ్యాడు. పాలేరు పరివాహక ప్రాంతాలైన చనుపల్లి, పాలవరం, కిస్టాపురం, శాంతినగర్, లకారం, గొండ్రియాల, కొత్తగూడెం వంటి గ్రామాల నుంచి ప్రతిరోజూ వందలాది ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. స్థానిక అవసరాల కోసం, గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన "మన ఊరు - మన ఇసుక" పథకం ఇక్కడ పూర్తిగా పక్కదారి పట్టింది. సామాన్యుడికి ఇల్లు కట్టుకోవడానికి ఇసుక దొరకడం గగనమైతే, మాఫియాకు మాత్రం ఇష్టమొచ్చినట్లు ఇతర జిల్లాలకు, పట్టణాలకు తరలించుకుపోవడానికి లైసెన్స్ దొరికినట్లయింది.ఈ అక్రమ ఇసుక దందా వెనుక అధికార పార్టీకి చెందిన కీలక నాయకులు కొందరు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. వారి భాగస్వామ్యంతోనే ఈ నెట్‌వర్క్ నడుస్తోందని స్థానికులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. అంతటితో ఆగకుండా,ఉన్నత అధికారులకు ఈ దందా గురించి పూర్తిగా తెలిసినప్పటికీ, నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే గుసగుసలు నియోజకవర్గంలో బలంగా వినిపిస్తున్నాయి. రాజకీయ బలం చూసుకుని సాండ్ రీచ్ పాయింట్ లను ఈ మాఫియా తమ అడ్డాగా మార్చుకుంది.అక్రమ ఇసుక రవాణాకు అడ్డువచ్చినందుకు ఇటీవల ఓ అధికారి బదిలీ? అయిన సంఘటనా కూడా ఉంది ఈ అక్రమ రవాణాను అడ్డుకోవడానికి ప్రయత్నించిన కొందరు అధికారులపై రాజకీయ ఒత్తిళ్లు తీవ్రస్థాయిలో వస్తున్నాయి. ఇటీవలే ఇసుక మాఫియాకు, అధికార పార్టీ నేతల అక్రమాలకు అడ్డుగా నిలిచారనే కారణంతో స్థానిక ఎమ్మార్వో (తహశీల్దార్) ను రాత్రికి రాత్రే బదిలీ చేయించడం ఈ రాజకీయ జోక్యానికి ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తోందని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లు రోడ్లపై అతివేగంతో, బేఫికర్‌గా దూసుకుపోతున్నాయి. దీనివల్ల స్థానిక రహదారులపై ప్రయాణించే సామాన్య ప్రజలు, ముఖ్యంగా పాఠశాలలకు వెళ్లే పిల్లలు ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని బతకాల్సిన పరిస్థితి ఏర్పడింది. విచ్చలవిడి వేగం కారణంగా ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికే పలుచోట్ల చిన్నపాటి ప్రమాదాలు జరిగినా మాఫియా వెనుక ఉన్న రాజకీయ బలంతో బాధితులను బెదిరించి నోళ్లు మూయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇంత బహిరంగంగా పగలు, రాత్రి ఇసుక దోపిడీ జరుగుతున్నా స్థానిక పోలీసులు కన్నెత్తి కూడా చూడకపోవడం గమనార్హం. మాఫియా ఇచ్చే నెలవారీ మామూళ్లకు లొంగిపోయి, పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని, వారిపై భారీగా అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఫిర్యాదులు చేసినా నామమాత్రపు జరిమానాలతో సరిపెడుతున్నారే తప్ప, శాశ్వత చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. పాలేరు పరివాహక ప్రాంతంలో సాగుతున్న ఈ దోపిడీని ఇలాగే వదిలేస్తే పర్యావరణానికి ముప్పు వాటిల్లడమే కాకుండా, భూగర్భ జలాలు అడుగంటిపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు ప్రత్యేక నిఘా ఉంచి, రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా ఈ అక్రమ ఇసుక దందాను అరికట్టాలని, బాధ్యులైన నాయకులపై, అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# పర్వతగిరిలో పట్టపగలు అక్రమ మొరం తవ్వకాలు?

**- నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నా అధికారులు**

**- అధికారుల మౌనంపై ప్రజల్లో ఆగ్రహం**



వరంగల్ జిల్లా ప్రతినిధి జూన్27(విజన్ ఆంధ్ర); వరంగల్ జిల్లా కేంద్రంలోని పర్వతగిరి మండలంలో అక్రమ మొరం తవ్వకాలు జరుగుతున్నాయనే ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. మండల కేంద్రంలోని రిజర్వాయర్ సమీపంలో, పర్వతాల శివాలయం గుట్ట వెనుక భాగంలో పట్టపగలు మిట్ట మధ్యాహ్నం యంత్రాలతో మొరం తవ్వకాలు కొనసాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. తవ్విన మొరాన్ని పర్వతగిరి పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే, ప్రధాన రహదారికి అనుకుని బహిరంగంగా డంపింగ్ చేస్తున్నప్పటికీ సంబంధిత శాఖల అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వాహనాల ద్వారా మొరం తరలింపు, నిల్వ ప్రక్రియ అందరికీ కనిపించేలా సాగుతున్నా చర్యలు లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని ప్రజలు చర్చించుకుంటున్నారు. అక్రమ తవ్వకాల కారణంగా ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి పడటమే కాకుండా, ప్రకృతి సంపద దోపిడీకి గురవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పర్యావరణ సమతుల్యత దెబ్బతినే ప్రమాదం ఉన్నప్పటికీ అధికారులు స్పందించకపోవడం ప్రజలను విస్మయానికి గురిచేస్తోంది. పోలీస్ స్టేషన్ పక్కనే, మెయిన్ రోడ్డుకు ఆనుకుని అక్రమంగా తవ్విన మొరం గుట్టలుగా పేరుకుపోతుంటే అధికారులకు కనిపించకపోవడం నమ్మశక్యంగా లేదని, సాధారణ



ప్రజలపై చట్టం వేగంగా పనిచేసే యంత్రాంగం ఇలాంటి బహిరంగ అక్రమాల విషయంలో ఎందుకు నిద్రపోతుందో అర్థం కావడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. అక్రమ తవ్వకాలు ఇంత నిర్భయంగా కొనసాగుతున్నాయంటే ఎవరి అండదండలు ఉన్నాయి? అధికార యంత్రాంగం మౌనం వెనుక కారణాలేమిటి? ప్రజా సంపదను దోచుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవడంలో ఈ నిర్లక్ష్యం ఎందుకు? అనే ప్రశ్నలు ప్రజల నుంచి వెల్లువెత్తుతున్నాయి. వెంటనే రెవెన్యూ, మైనింగ్, పోలీసు శాఖల ఉన్నతాధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వాస్తవాలను వెలికితీసి, అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# కూకట్పల్లిలో విస్తృతంగా కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ

## కూకట్పల్లిలో విస్తృతంగా కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ: ఓటరు నమోదు దు కార్యక్రమాన్ని పరిశీలించిన బండి రమేష్,



మేడ్చల్ మల్లికాజిగిరి జిల్లా జూన్ 27 (విజన్ ఆంధ్ర ప్రతినిధి): కూకట్పల్లి నియోజకవర్గం లో సర్ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ ఐ ఆర్ ప్రక్రియ విస్తృతంగా కొనసాగుతోంది. శనివారం నియోజకవర్గం లో జరుగుతున్న ఓటర్ నమోదు కార్యక్రమాన్ని టిపిసిసి ఉపాధ్యక్షుడు తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్, సర్కిల్ ఉప కమిషనర్ ఆంజనేయులు స్వయంగా పర్యవేక్షించారు. బాలాజీ నగర్ లో బిఎల్వోలు బిఎల్ఏలు ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ పత్రాలను ఓటర్ కు అందజేశారు. ఒక్కో ఓటర్ పేరుతో ప్రింట్ అయిన రెండు పత్రాలలో ఓటర్ వివరాలను నమోదు చేసిన అధికారులు ఓ పత్రాన్ని ఓటర్ కు ఇవ్వగా మరో పత్రాన్ని తీసుకువచ్చి ఆ వివరాలను కంప్యూటర్లో అప్లోడ్ చేయనున్నారు. ఇక్కడ జరుగుతున్న ఎన్యుమరేషన్ పత్రాల పంపిణీ, ఓటరు వివరాల నమోదును డిసి స్వయంగా పరిశీలించారు. పార్టీపరంగా సర్ కార్యక్రమంలో పాల్గొన్న బండి రమేష్, పార్టీ నేతలకు సలహాలు సూచనలు చేశారు. నియోజవర్గంలో నివసిస్తున్న ప్రతి ఒక్క వ్యక్తి ఓటు నమోదు కావాలని అదే సమయంలో స్థానికంగా కొంతకాలంగా లేని వారిని గుర్తించి వారి ఓట్లను తొలగించాలని ఎట్టి పరిస్థితుల్లో దొంగ ఓట్లు నమోదు చేయరాదని అధికారులకు సూచించారు. ఓటర్ నమోదు ప్రక్రియలు పార్టీ కార్యకర్తలు చురుగ్గా పాల్గొనాలని నిర్లక్ష్యంగా వ్య వరించే నాయకులపై పార్టీపరంగా తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు .ఈ సందర్భంగా డిసి ఆంజనేయులు మాట్లాడుతూ, ఓటర్ నమోదు వివరాలు అత్యంత ఖచ్చితత్వంతో కూడి ఉంటాయని ఎవరి ఓటయినా లేకపోయినా కొత్తగా ఓటరు గా నమోదు కావాలన్నా అధికారులను సంప్రదించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో బూత్ 219 పి ఎల్ ఓ, మౌనిక దీూాబి ల్ ఏ, శ్రీకాంత్ ముదిరాజ్ బూత్ -220 బి ఎల్ ఓ- లక్ష్మీ బి ఎల్ ఏ- ఎండీ. జంగీర్ బాలాజీనగర్ డివిజన్ వివేకనగర్ కాలనీ పార్టీ సీనియర్ నాయకులు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మయ్య,,బీ బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు,డివిజన్ ప్రెసిడెంట్ కృష్ణ రాజపుత్, మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి , సునీల్ కుమార్, పిడికిటి గోపాల్ చౌదరి ,రంగమోహన్,సుధా, తదితరులు పాల్గొన్నారు.

# రామవరం పర్యటనలో మున్సిపల్ కమిషనర్

- సోమవారం నుంచి కొత్త కాలువల నిర్మాణం ప్రారంభం
- 16వ డివిజన్ కార్పొరేటర్ మునిగడప పద్మ విజ్ఞప్తితో కాలువ సమస్యపై ప్రత్యేక దృష్టి
- గోధుమ వాగు బ్రిడ్జిపై దెబ్బతిన్న రోడ్డుకు కొత్త నిర్మాణ పనుల ఆదేశాలు





కొత్తగూడెం బ్యూరో జూన్ 28(విజన్ ఆంధ్ర) : రామవరం ప్రాంతంలో చాలా కాలంగా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న పారిశుధ్య, డ్రైనేజీ, రహదారి సమస్యల పరిష్కారంపై మున్సిపల్ కమిషనర్ క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితులను సమీక్షించారు. స్థానిక ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులు, వర్షాకాలంలో ఎదురవుతున్న ఇబ్బందులు, నీటి నిల్వలు, రాకపోకలకు సంబంధించిన సమస్యలను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులతో కలిసి పలు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రామవరం సెంటర్లో చాలా కాలంగా కొనసాగుతున్న కాలువల సమస్యపై 16వ డివిజన్ కార్పొరేటర్ మునిగడప పద్మ ప్రత్యేకంగా కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. వర్షాలు కురిసిన ప్రతిసారి రోడ్లపై నీరు నిల్వ ఉండడం, మురుగు నీరు సక్రమంగా వెళ్లకపోవడం, దోమల వ్యాప్తి, దుర్వాసన, ప్రజల రాకపోకలకు అంతరాయం కలగడం వంటి సమస్యలను వివరించారు. కాలువలు సరిగా లేకపోవడం వల్ల స్థానికులు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా వర్షాకాలంలో పరిస్థితి మరింత దిగజారుతోందని కార్పొరేటర్ తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా వెంటనే శాశ్వత పరిష్కారం చేపట్టాలని కోరారు. సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించిన మున్సిపల్ కమిషనర్ వెంటనే స్పందిస్తూ సోమవారం నుంచి కొత్త కాలువల నిర్మాణ పనులు ప్రారంభించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కాలువల నిర్మాణాన్ని ప్రణాళికాబద్ధంగా చేపట్టి వర్షపు నీరు వేగంగా వెళ్లేలా చూడాలని సూచించారు. పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. కాలువల నిర్మాణ పనులు పూర్తయితే రామవరం సెంటర్లో చాలా కాలంగా కొనసాగుతున్న నీటి నిల్వ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. మురుగు నీటి ప్రవాహం మెరుగుపడి పారిశుధ్య పరిస్థితులు కూడా మెరుగవుతాయని పేర్కొన్నారు. పర్యటనలో భాగంగా కమిషనర్ గోధుమ వాగు బ్రిడ్జిపై దెబ్బతిన్న రహదారిని కూడా పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా రోడ్డు కొంత మేర దెబ్బతినడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు వివరించారు. ముఖ్యంగా వర్షాల సమయంలో బ్రిడ్జిపై ప్రయాణం ప్రమాదకరంగా మారుతోందని తెలిపారు. దీనిపై స్పందించిన కమిషనర్ సంబంధిత అధికారులకు వెంటనే చర్యలు చేపట్టాలని సూచిస్తూ దెబ్బతిన్న రహదారి స్థానంలో కొత్త రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని ఆదేశించారు. పనులు పూర్తయ్యే వరకు తాత్కాలిక భద్రతా ఏర్పాట్లు చేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. రోడ్డు పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, భవిష్యత్తులో మళ్లీ ఇలాంటి సమస్యలు తలెత్తకుండా సాంకేతిక ప్రమాణాలతో పనులు చేపట్టాలని అధికారులకు స్పష్టం చేశారు. పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. పర్యటన సందర్భంగా స్థానిక ప్రజలతో మాట్లాడిన కమిషనర్, ప్రాంతంలో ఉన్న మౌలిక సదుపాయాల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని తెలిపారు. ప్రజలకు అవసరమైన సౌకర్యాల కల్పనకు మున్సిపల్ శాఖ ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో పారిశుధ్యం, డ్రైనేజీ, రహదారుల నిర్వహణపై ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని పనులను నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించిన కమిషనర్, పనుల అమలుపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు. స్థానికులు సమస్యల పరిష్కారానికి చర్యలు ప్రారంభించడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ, ప్రకటించిన పనులు వేగంగా పూర్తి చేసి రామవరం ప్రాంత ప్రజలకు శాశ్వత ఉపశమనం కల్పించాలని కోరారు.కమిషనర్ వెంట ఏ ఈ బి శ్రీకాంత్, వర్క్ ఇన్ స్పెక్టర్ గుంటి శ్రవణ్, మాజీ కౌన్సిలర్ మునిగడప వెంకటేశ్వర్లు,జవాన్లు ప్రభుదాసు,లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# రజిత కవచంలో నిమిషాంబ దేవి దివ్య దర్శనం...

- 20వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఆధ్యాత్మిక శోభ...
- భారీగా తరలివచ్చిన భక్తులు

బోడుప్పల్, జూన్ 27 (విజన్ ఆంధ్ర): బోడుప్పల్లోని శ్రీ మాతా నిమిషాంబ దేవి ఆలయంలో జరుగుతున్న 20వ వార్షిక బ్రహ్మోత్సవాలు, ద్విదశాబ్ది ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు అమ్మవారు రజిత కవచ విశేష అలంకరణలో భక్తులకు దివ్య దర్శనం ఇచ్చారు. సర్వదేవతా స్వరూపిణిగా, లోకకళ్యాణాన్ని ప్రసాదించే ఆదిపరాశక్తిగా అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, మూలమంత్ర హోమం, శ్రీచక్రార్చన, నవగ్రహ పాశుపత హోమం, భక్తుల విశేష భాగస్వామ్యంతో సామూహిక చండీ హోమం ఘనంగా నిర్వహించారు. అనంతరం నీరాజనం, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు వేదఘోషల మధ్య భక్తిశ్రద్ధలతో జరిగాయి. హోమాగ్నుల దివ్య తేజస్సు, వేదమంత్రాల నినాదం, భక్తుల భక్తిపారవశ్యం, అమ్మవారి కరుణాకటాక్షాలతో ఆలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. శనివారం సందర్భంగా అమ్మవారిని దర్శించి పూజలు, హోమాల్లో పాల్గొన్న భక్తులకు శనిదోష నివారణ, నవగ్రహ అనుగ్రహం, ఆరోగ్యం, ఐశ్వర్యం, కుటుంబ సౌఖ్యం, సకల కార్యసిద్ధి కలగాలని ఆలయ వేదపండితులు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కామరౌతు వినోద్ కుమార్, సెట్లర్ కళావతి, ప్రధాన కార్యదర్శులు కె. అశోక్ కుమార్, సంగు శ్రీనివాస్, కోశాధికారి ఎన్. రమేష్, రాష్ట్ర నకాష్ సంఘం ప్రధాన కార్యదర్శి కొరిచెర్ల శ్రీనివాస్ రావు, ట్రస్ట్ ధర్మకర్తలు, ఆలయ ప్రధాన అర్చకులు చంద్రశేఖర్ శర్మ, అర్చకుడు ఉమాకాంత్ శర్మతో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ లో కామారెడ్డి జిల్లా పనితీరు అభినందనీయం

- ప్రత్యేక అధికారి బి. విజయేంద్ర,



కామారెడ్డి బ్యూరో జూన్ 27(విజన్ఆంధ్ర) : ప్రజాపాలనప్రగతి ప్రణాళిక అమలులో కామారెడ్డి జిల్లా ఆదర్శంగా నిలవాలి: ప్రత్యేక అధికారి బి. విజయేంద్ర, ఐఏఎస్. ప్రజాపాలనప్రగతి ప్రణాళిక అమలుపై నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్ష సమావేశానికి విచ్చేసిన లిలిప్రత్యేక అధికారి శ్రీమతి బి. విజయేంద్ర, ఐఏఎస్., కార్యదర్శి, ఎస్సీడీ, కార్యదర్శి, టీజీఎస్డబ్ల్యూ ఆర్ఈఐఎస్ & కమిషనర్, ఎస్సీడీ (ఎఫ్ఏసీ)లిలికు శనివారం కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర పూలమొక్కను అందించి ఘనంగా స్వాగతం పలికారు.అనంతరం జిల్లాలో 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా వివిధ శాఖలు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై 10 శాఖలకు సంబంధించిన పవర్పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రత్యేక అధికారికి జిల్లా అధికారులు వివరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి బి. విజయేంద్ర మాట్లాడుతూ, కామారెడ్డి జిల్లాను అభివృద్ధిలో రాష్ట్రంలో ముందంజలో నిలిపి మోడల్ జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులు సమష్టిగా కృషి చేయాలని సూచించారు.ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ఫలితాలు ప్రతి లబ్ధిదారుని వద్దకు చేరేలా అధికారులు కృషి చేయాలని అన్నారు. జిల్లాలో జరుగుతున్న మంచి కార్యక్రమాలు, విజయగాథలను ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలని కోరారు. 99 రోజుల కార్యాచరణలో చేపట్టిన పనులను శాఖల వారీగా స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికతో అమలు చేసి, నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేయాలని సూచించారు. ఇప్పటివరకు సమర్థవంతంగా పనిచేస్తున్న జిల్లా అధికారులను అభినందిస్తూ, ఇదే స్ఫూర్తితో మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు జిల్లా పోలీసు శాఖ చేపట్టిన చర్యలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో రోడ్డు భద్రత కమిటీల ఏర్పాటు, అవగాహన కార్యక్రమాల ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించగలిగారని తెలిపారు. విద్యా రంగంలో అధికారులు సమర్థవంతంగా పనిచేస్తున్నారని అభినందించి బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు పెంచాలని, విద్యాశాఖ చేపడుతున్న బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులు కృషి చేయాలని సూచించారు. ప్రతి అర్హ విద్యార్థిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా విస్తృత అవగాహన కల్పించి, తల్లిదండ్రులను ప్రోత్సహించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో విద్యార్థుల అభ్యాస సామర్థ్యాలను మెరుగుపరచి, వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వం విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేసి నాణ్యమైన విద్య, వసతి, భోజనం, ఇతర సౌకర్యాలను కల్పిస్తోందని తెలిపారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని సంక్షేమ హాస్టళ్లలో పరిసరాల పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు దోమతెరలను వినియోగించడంతో పాటు అవసరమైన పారిశుధ్య చర్యలు చేపట్టాలని అన్నారు. హాస్టళ్లలో ఏవైనా మరమ్మత్తుల అవసరం ఉంటే వెంటనే పూర్తి చేయించాలని, విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, విద్యపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ఉత్తమ ఫలితాలు సాధించేలా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడకుండా పాఠశాలలు, కళాశాలల స్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.అలాగే, ప్రజల ఆరోగ్య రక్షణ దృష్ట్యా ఆహార భద్రత (ఫుడ్ సేఫ్టీ) ప్రమాణాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించి, నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు విక్టర్, ఎన్ వై గిరి, డి ఎఫ్ ఓ నిరాజ్, డి ఆర్ ఓ పాండు, ఆర్డీఓలు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# అడ్డా కార్మికులు, అసంఘటిత కార్మికుల సమస్యలు పరిష్కారించాలి

- అసిస్టెంట్ లేబర్ కమిషనర్ కు హెచ్ ఎం ఎస్ వినతి

మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 27,(విజన్ ఆంధ్ర ) : జిల్లాలోని అడ్డా కార్మికులు, వివిధ రంగాల అసంఘటిత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని హింద్ మహా సభ (హెచ్ ఎం ఎస్ )జిల్లా అధ్యక్షులు నరెడ్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సాయికృష్ణ శనివారం అసిస్టెంట్ లేబర్ కమిషనర్ క్రాంతి కుమార్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, జిల్లాలో వేలాది మంది భవన నిర్మాణ కార్మికులు, దినసరి కూలీలు లేబర్ కార్డులు లేకుండానే పనులు చేస్తున్నారని, ప్రమాదాలు జరిగినప్పుడు బీమా, ఆర్థిక సహాయం, సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందక వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. జిల్లాలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి అడ్డా కార్మికులందరికీ లేబర్ కార్డుల నమోదు చేపట్టాలని, లేబర్ కార్డు లేని కార్మికులను పనిలోకి తీసుకోకుండా మేస్త్రీలు, కాంట్రాక్టర్లకు ఆదేశాలు జారీ చేయాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే లేబర్ కార్డుల వల్ల కలిగే ప్రయోజనాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా జీహెచ్ఎంసీ పరిధిలో అమలవుతున్నట్లుగా అడ్డా కార్మికులకు రూ.5 కే మధ్యాహ్న భోజనం అందించే పథకాన్ని మంచిర్యాల జిల్లాలో కూడా అమలు చేయాలని, కార్మికులకు ఇ ఎస్ ఐ, పీ ఎఫ్ సౌకర్యం వర్తించేటట్లు చూడాలని, రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని విజ్ఞప్తి చేశారు, కార్మికుల సమస్యలను సానుకూలంగా పరిశీలించి చట్టప్రకారం అవసరమైన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తానని అధికారి హామీ ఇచ్చారన్నారు.

# రేక్ పాయింట్ను సందర్శించి, క్రిబ్ట్ కో యూరియా రేక్ చేరికను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



కామారెడ్డి బ్యూరో జూన్ 27(విజన్ఆంధ్ర) : జిల్లా కేంద్రం లోని రైల్వే స్టేషన్ లో శనివారం రేక్ పాయింట్ను సందర్శించి, క్రిప్కో యూరియా రేక్ చేరికను పరిశీలించారు. రైతులు యూరియా కొరతపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. రాష్ట్రంలోని రైతులకు ఎరువుల సరఫరాను సక్రమంగా నిర్వహించేందుకు ప్రభుత్వం యూరియా పంపిణీ కోసం ప్రత్యేక మొబైల్ యాప్ను రూపొందించి అమలు చేస్తోంది. ఈ విధానం ద్వారా రైతులు సాగు చేస్తున్న పంటల విస్తీర్ణానికి అవసరమైన మేరకే యూరియా అందజేయబడుతోంది. దీంతో ఎరువుల సమాన పంపిణీతో పాటు అక్రమ నిల్వలు, మళ్లింపులను కూడా సమర్థవంతంగా అరికట్టడం సాధ్యమవుతోంది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కామారెడ్డి రేక్ పాయింట్ను సందర్శించి, క్రిప్కో యూరియా రేక్ చేరికను పరిశీలించారు. రిటైలర్లు అందరూ యాప్లో నిల్వలను తప్పనిసరిగా నిర్ధారించాలని, అలాగే యూరియా విక్రయాలు పూర్తిగా ఈ-పాస్ యంత్రాల ద్వారానే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో గత వానాకాలంలో ఇదే సమయానికి 58,753 ఎకరాల్లో పంటలు నమోదుకాగా, ఈ ఏడాది ఇప్పటివరకు కేవలం 8,346 ఎకరాల్లో మాత్రమే పంటలు నమోదయ్యాయి. అంటే గత ఏడాదితో పోలిస్తే ప్రస్తుతం సాగు విస్తీర్ణం గణనీయంగా తక్కువగా ఉంది. అయినప్పటికీ, జిల్లాలోని రైతులు ఇప్పటివరకు 4.08 లక్షల యూరియా బస్తాలను కొనుగోలు చేయగా, గత ఏడాది ఇదే సమయానికి 3.30 లక్షల బస్తాలను మాత్రమే కొనుగోలు చేశారు. సాగు విస్తీర్ణం తగ్గినప్పటికీ యూరియా కొనుగోళ్లు పెరగడం గమనార్హం. ప్రభుత్వం ముందస్తుగా యూరియా లభ్యతను కల్పించడంతో రైతులు తమ సాగు అవసరాలకు అనుగుణంగా ఎరువులను ముందుగానే కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో సుమారు 1.58 లక్షల యూరియా బస్తాల నిల్వలు అందుబాటులో ఉన్నాయి. రైతులు మొబైల్ యాప్ ద్వారా బుకింగ్ చేసుకుని ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూరియాను పొందుతున్నారు. ప్రభుత్వం రైతుల అవసరాలను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ, కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ తగిన నిల్వలను అందుబాటులో ఉంచుతోంది. అందువల్ల రైతులు యూరియా కొరతపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ), డీఎం మార్క్ఫెడ్, వ్యవసాయ శాఖ ఏడీఏ కామారెడ్డి, జిల్లా నోడల్ అధికారి (ఎరువులు) తదితరులు పాల్గొన్నారు.

# సింగూర్ సెగ్మెంట్లో తాగునీటి వనరులపై సమగ్ర సర్వే రీఛార్జ్ పిట్ల ఏర్పాటుకు ప్రత్యేక కమిటీ



కామారెడ్డి బ్యూరో జూన్ 27 (విజన్ఆంధ్ర) : సింగూర్ రిజర్వాయర్ నీటి లభ్యతను సమర్థవంతంగా వినియోగించడంతో పాటు భూగర్భ జలాలను పరిరక్షించే దిశగా సింగూర్ సెగ్మెంట్ పరిధిలోని జుక్కల్, బాన్సువాడ, ఎల్లారెడ్డి నియోజకవర్గాల పరిధిలో ఉన్న 14 మండలాల గ్రామాల్లో తాగునీటి వనరులపై సమగ్ర సర్వే నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా శనివారం జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయం లో సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి (సీఈఓ), జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ), జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి (డీఆర్డీఓ), జిల్లా భూగర్భ జలాల శాఖ ఉప సంచాలకులు, మిషన్ భగీరథ కార్యనిర్వాహక అభియంతతో కూడిన ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ గ్రామాల వారీగా చేతి పంపులు, బోర్వెల్లు, సింగిల్ ఫేజ్ మోటార్లు, గ్రామీణ తాగునీటి పథకాల సోర్స్లను క్లుప్తంగా సర్వే చేసి, నీటి వనరుల పరిస్థితిని అంచనా వేస్తుంది. సర్వే నివేదిక ఆధారంగా అవసరమైన ప్రాంతాల్లో రీఛార్జ్ పిట్ల ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించి, భూగర్భ జలాల పునరుద్ధరణతో పాటు తాగునీటి వనరుల స్థిరీకరణకు చర్యలు చేపట్టనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా భవిష్యత్తులో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంతో పాటు, వర్షపు నీటిని భూగర్భ జలాల్లోకి ఇంకేలా శాశ్వత పరిష్కారాలను అమలు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

# కొత్తగూడెం సివిల్ సప్లై హెచ్.పీ గ్యాస్ డిస్ట్రిబూటర్లపై పై చర్యలు తీసుకోవాలి

- సంవస్తా వినియోదరుల క్షేమం కోరుకోవాలి.
- సిపిఎం మండల కార్యదర్శి యాస నరేష్.





జూలూరుపాడు జూన్ 28 (విజన్ ఆంధ్ర ) కొత్తగూడెం నుండి జూలూరుపాడుకు కస్టమర్లకు అందజేసే నిమిత్తం వినియోగదారులకు హెచ్ పి గ్యాస్ సిలిండర్లు అందజేసే నిమిత్తం ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే సివిల్ సప్లై వారు అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారని వినియోగదారుడి అవసరాన్ని ఆసరాగా చేసుకుని వినియోగదారుడుకి ఒక్కో సిలిండర్ కు 120 రూపాయలు అదనంగా వసూలు చేస్తున్నారని అదేంటీ అని అడిగితే ఇంత దూరం మేము ఫ్రీగా తీసుకొచ్చి ఇవ్వలేమని చెప్పి చెప్తా ఉన్నారని తక్షణమే ప్రభుత్వం సివిల్ సప్లై చర్య తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించిన ధర 981 అయితే కచ్చితంగా 1100 రూపాయలు ఇవ్వాల్సిందే అని చెప్పి వినియోగదారుడు దగ్గర సివిల్ సప్లై వారు వసూలు చేస్తున్నారని సిపిఎం పార్టీ జూలూరుపాడు మండల కమిటీ తెలియజేస్తుంది. సిపిఎం పార్టీ మండల కార్యదర్శి యాస నరేష్ మాట్లాడుతూ ఒకపక్క ప్రభుత్వం పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలను పెంచి సామాన్య ప్రజానీకం పై ఆర్థిక భారాలు మోపుతా ఉంటే ఇదే అదునుగా డీలర్లు అమాయక ప్రజానీకాన్ని ఏదో ఒక కారణాలు చెప్పి దోపిడీ చేస్తా ఉన్నారని ప్రతి ఇంటికి వంటగ్యాస్ ప్రభుత్వం సంవత్సరానికి 12 సిలిండర్లు ఇస్తామని చెప్తా ఉంది కానీ డీలర్లు మాత్రం 45 రోజులు కాలపరిమితి పెట్టి 9 సిలిండర్లే వచ్చే విధంగా ప్రజలను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారు ప్రభుత్వం తక్షణమే స్పందించి నెలకొక సిలిండర్ వచ్చేలా చూడాలని డిమాండ్ చేశారు. అనేక సంవత్సరాలుగా సివిల్ సప్లై వారు వినియోగదారులను మోసం చేస్తూ వందలాది రూపాయలు అమాయక పేదల దగ్గర వసూలు చేస్తున్నారని తక్షణమే ప్రభుత్వం వారు స్పందించి వినియోగదారులకు న్యాయం చేయాలని లేని పక్షంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో సివిల్ సప్లై గోడౌన్ ముందు ధర్నా నిర్వహిస్తామని ఆయన అన్నారు.

# ఆహార భద్రతా నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

- -జిల్లా కలెక్టర్ కె. హరిత

అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 27: విజన్ ఆంధ్ర జిల్లాలోని ఆహార పదార్థాలు దుకాణ దారులంత ఖచ్చితంగా నియమ నిబంధనలు పాటించాలని కలెక్టర్ కె హరిత ఆదేశించారు శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆహార భద్రతపై నిర్వహించిన అవగాహన సమావేశంలో అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ) యువరాజ్ మార్మాట్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం డెవిడ్ ఫుడ్ సేఫ్టీ అధికారులు, ఆహార పదార్థాల దుకాణాల నిర్వాహకులతో కలిసి ఆమె సమీక్ష నిర్వహించారు రెస్టారెంట్లు, హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, మిఠాయి దుకాణాలు, ఆహార పదార్థాల విక్రయ కేంద్రాల నిర్వాహకులు ఆహార భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన ఆహారాన్ని అందించడం ప్రతి వ్యాపారి బాధ్యత అని అన్నారు. వంటల తయారీలో ఉపయోగించే నూనెలు, మసాలా దినుసులు, పాలు, పెరుగు తదితర ముడి పదార్థాలు నాణ్యమైనవే వినియోగించాలని అన్నారు. గడువు తేదీలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, గడువు ముగిసిన ఆహార పదార్థాలను ఎట్టి పరిస్థితుల్లోనూ వినియోగించరాదని స్పష్టం చేశారు. కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, కోడిగుడ్లు, మాంసం వంటి ఆహార పదార్థాలను తాజాగా నిల్వ ఉంచి విక్రయించాలని తెలిపారు. అపరిశుభ్రమైన, గడువు ముగిసిన లేదా నాణ్యత లేని ఆహార పదార్థాలను విక్రయించినా, దుకాణాల్లో నిల్వ ఉంచినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు జిల్లాలోని ఆహార విక్రయ కేంద్రాలను నిరంతరం తనిఖీ చేస్తూ నాణ్యతా ప్రమాణాలు అమలవుతున్నాయో లేదో నిత్యం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి గౌడ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, ఫుడ్ ఇన్స్పెక్టర్ మహేష్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఆర్జీయూకేటీ బాసర్ విద్యార్థినికి రూ.10,000 ఆర్థిక సహాయం అందజేసిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, ఎస్పీ రాజేష్ చంద్ర



కామారెడ్డి బ్యూరో జూన్ 27(విజన్ఆంధ్ర) : ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఆర్థిక ఇబ్బందులు వారి లక్ష్యాలకు అడ్డంకిగా మారకూడదనే ఉద్దేశంతో జిల్లా పరిపాలన ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. ఈ సందర్భంగా శనివారం ఆర్జీయూకేటీ (బాసర)లో విద్యను అభ్యసిస్తున్న కామారెడ్డి జిల్లాకు చెందిన విద్యార్థిని నిఖిత కుటుంబ ఆర్థిక పరిస్థితులను వివరించి విద్యా ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం కోరుతూ సమర్పించిన వినతిని పరిశీలించిన జిల్లా కలెక్టర్ స్పందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తన కార్యాలయంలో విద్యార్థినికి రూ.10,000 విలువైన చెక్కును రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా అందజేశారు. ఈ సహాయం పుస్తకాలు, అధ్యయన సామగ్రి, ప్రయాణం తదితర విద్యా అవసరాలకు ఉపయోగపడుతుందని తెలిపారు. విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువును మధ్యలో నిలిపివేయకుండా, పట్టుదలతో ఉన్నత విద్యను కొనసాగించి జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు. విద్యార్థిని నిఖిత జిల్లా కలెక్టర్కు కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఈ ఆర్థిక సహాయం తన చదువును కొనసాగించేందుకు ఎంతో తోడ్పడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు రాజన్న, నరసింహులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పల్స్ పోలియోకు ఏర్పాట్లు పూర్తి

**- నిండు ప్రాణానికి రెండు చుక్కలు..**

**- రేపే పల్స్ పోలియో కార్యక్రమం.**

**- డిఎం అండ్ హెచ్వో మధుసూదన్**

భూపాలపల్లి జిల్లా 27 జూన్ (విజన్ ఆంధ్ర) : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 34,728 మంది పిల్లలకు వ్యాక్సిన్ వేసేందుకు 296 బూతులు 14 మొబైల్ టీం లతో వ్యాక్సిన్ పర్యవేక్షణ వ్యాక్సిన్ పంపిణీకి ఏర్పాట్లు పూర్తి. 28న దేశవ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమం, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్నాయి. చిన్నారులు నిండు ప్రాణానికి రెండు పోలియో చుక్కలు అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నాయి, పోలియో రహిత సమాజం కోసం ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాయి. 0 నుండి 5 ఏళ్ల వయసు గల చిన్నారులు ఇలాంటి అనారోగ్య సమస్యలతో శతమతమవుతున్న విధిగా రెండు పోలియో చుక్కలు వేయించాల్సిన బాధ్యత అందరి పైన ఉంది, ప్రతి ఒక్కరూ పల్స్ పోలియో చుక్కల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్ కోరారు. ఈ నెల 28, 29, 30 తేదీలలో 0 నుండి 5 సంవత్సరాల పిల్లలకు పోలియో వ్యాక్సిన్ ఇస్తామని జిల్లా నందుగల 241 గ్రామ పంచాయతీలలో అంగన్వాడీ కేంద్రాలలో, పాఠశాలలలో ఆదివారం రోజు పోలియో చుక్కలు వేస్తామన్నారు సోమవారం మంగళవారం లలో ఇంటింటికి తిరిగి మిగతా పిల్లలకు పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం పరుచుకొని మీ పిల్లల ఆరోగ్యాన్ని కాపాడాలని అన్నారు.

## ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

**- బీ.ఎల్.వో.ల ఇంటింటి ఫారాల పంపిణీని పరిశీలించిన జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్ లత**



జగిత్యాల, జూన్ 27 (విజన్ ఆంధ్ర జిల్లా బ్యూరో): ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్.ఐ.ఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించి అర్హులైన ప్రతి ఓటరికి అవకాశం కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్ లత అధికారులను ఆదేశించారు. శనివారం మేడిపెల్లి మండలంలో బీఎల్వోలు ఇంటింటికి వెళ్లి ఎస్ఐఆర్ ఫారాలను పంపిణీ చేస్తున్న విధానాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్వోలు ఓటర్లకు ఫారాల పంపిణీ, వివరాల నమోదు, అవగాహన కల్పన తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి అర్హులైన ఓటర్లకు ఫారాలను అందజేయాలని, ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తూ ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిబంధనల ప్రకారం పని చేయాలని అన్నారు. ఓటర్ల నుంచి అందిన ఫారాలను నిర్ణీత గడువులోగా స్వీకరించి, వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు కూడా ఈ ప్రక్రియలో చురుకుగా పాల్గొని సరైన సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, సంబంధిత సిబ్బంది, బీఎల్వోలు మరియు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

- యం.రాజేందర్ .




భూపాలపల్లి జిల్లా 27 జూన్ (విజన్ ఆంధ్ర) : జిల్లా లోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల నుండి 2026-27 విద్యా సంవత్సరానికి గాను జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కోసం ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వశాఖ ఢిల్లీ వారు ఆహ్వానిస్తున్నారని జిల్లా విద్యాశాఖ అధికారి యం.రాజేందర్ తెలిపారు. nationalawardsto teachers.education.gov.in వెబ్సైట్ ద్వారా దరఖాస్తులను జులై- 10వ తేది లోగా రిజిస్ట్రేషన్ చేసుకోగలరని తెలిపారు. ఈ అవకాశాన్ని జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోగలరని యం. రాజేందర్ తెలిపారు.

## అలీ లాడ్జ్‌లో బీబీ కా ఆలంకు ధట్టి సమర్పణ



హైదరాబాద్, జూన్ 27 (విజన్ ఆంధ్ర) : ఆసఫ్ జాహీ రాజవంశానికి చెందిన 9వ నిజాంగా గుర్తింపు పొందిన నవాబ్ రౌనక్ యార్ ఖాన్ మొహర్రం సందర్భంగా చారిత్రాత్మక అలీ లాడ్జ్‌లో బీబీ కా ఆలంకు సంప్రదాయ ధట్టి సమర్పించారు. అలీ లాడ్జ్ యజమాని నవాబ్ సయ్యద్ ఆబిద్ హుస్సేన్ ఆహ్వానంతో ఆశూరా ఊరేగింపులో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రౌనక్ యార్ ఖాన్ అజాఖానా జహ్రాలో కూడా నజరానా సమర్పించారు. ఈ సందర్భంగా సిరాజ్-ఉన్-నిస్సా బేగం మాట్లాడుతూ ఆసఫ్ జాహీ రాజవంశ ప్రతినిధిగా రౌనక్ యార్ ఖాన్‌ను స్వాగతించడం ఆనందంగా ఉందన్నారు. రౌనక్ యార్ ఖాన్ హజ్రత్ ఇమామ్ హుస్సేన్(అ.స.), కర్బలా అమరవీరుల త్యాగాలకు నివాళులర్పించారు. మొహర్రం ఏర్పాట్లకు తెలంగాణ ప్రభుత్వం, మైనారిటీల శాఖ మంత్రి మహ్మద్ అజారుద్దీన్, ఎమ్మెల్యే జనాబ్ జుల్ఫేకర్ అలీలకు ఆయన అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అల్కా మనోజ్, మీర్ ఫిరాసత్ అలీ, శ్రీ రామనమూర్తితో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## ఫైర్ స్టేషన్ కి 2 కోట్లు మంజూరు

**- ఫైర్ ఆఫీసులో సిబ్బంది కొరత**

**- 16 మంది గాను 8 మంది విధుఎ నిర్వహిస్తున్నారు. కె వి సతీష్ కుమార్**



భూపాలపల్లి జిల్లా 27 జూన్ (విజన్ ఆంధ్ర) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో అధికారులు ఉండాలని మంచి ఉద్దేశంతో 10 జిల్లాలను 31 జిల్లాలుగా చేయడం జరిగింది. ఈ సందర్భంగా వివిధ శాఖలకు స్థలాలు కేటాయించి భవన నిర్మాణాలు కూడా చేపట్టడం జరిగింది. మరి కొన్ని శాఖలు స్థలం కేటాయించిన భవన నిర్మాణాలు జరగడం లేదు. ముఖ్యంగా ప్రమాదాలకు గురైనప్పుడు అత్యవసర సేవలు వినియోగించే ఫైర్ స్టేషన్ కు భూపాలపల్లి భాస్కర్ గడ్డ వద్ద 58 గుంటల స్థలాన్ని కేటాయించినప్పటికిని ఇంతవరకు భవన నిర్మాణం జరగకపోవడం ఒకంత బాధాకరం ఈ విషయమై ఫైర్ స్టేషన్ డిస్టిక్ ఫైర్ ఆఫీసర్ కె.వి. సతీష్ కుమార్ ని వివరణ కోరగా భాస్కర్ గడ్డ వద్ద 58 గుంటల స్థలం కేటాయించడం జరిగిందనిజ రాష్ట్రంలో మొత్తం 19 ఫైర్ స్టేషన్లకు నిధులు మంజూరు కాగా అందులో ఒకటి భూపాలపల్లి కూడా ఈ నెల 19వ తారీఖున భవన నిర్మాణం కోసం రెండు కోట్ల రూపాయలు శాంక్షన్ అయినాయని తెలిపారు. ముఖ్యంగా ఫైర్ సిబ్బంది మొత్తం 16 మందికి గాను ప్రస్తుతం ఏడుగురు ఫైటర్స్ మరియు ఒక డ్రైవర్ మాత్రమే ఉన్నారని తెలిపారు మిగతా ఎనిమిది మంది ఉద్యోగులు కొత్త ఉద్యోగాలు రావడంతో వెళ్లిపోయారని అన్నారు. ముఖ్యంగా మాకు కంప్యూటర్ ఆపరేటర్ మరియు మిగతా ఏడుగురు సిబ్బంది అవసరం ఉన్నారని త్వరలోనే వాటిని కూడా భర్తీ చేస్తామని కె.వి. సతీష్ కుమార్ అన్నారు.

# గోదావరి వరదలకు ముందస్తు సన్నద్ధత అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

**- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**- పుష్కరాల దృష్ట్యా జిల్లాను పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దాలి**

**- వరదల సమయంలో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా పూర్తి స్థాయి ఏర్పాట్లు: జిల్లా కలెక్టర్ అంకిత్**




కొత్తగూడెం బ్యూరో జూన్ 28(విజన్ ఆంధ్ర) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గోదావరి వరదల సన్నద్ధతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. గోదావరి నదిలో వరదల పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేలా అన్ని శాఖలు ముందస్తు చర్యలు చేపట్టి సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. శనివారం ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, వైరా ఎమ్మెల్యే రామదాసు నాయక్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ వరదల సన్నద్ధతలో భాగంగా జిల్లా స్థాయిలో ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ ఏర్పాటు చేయడంతో పాటు మండల స్థాయిలో కూడా అత్యవసర కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలు, తాగునీరు, వైద్యం, పారిశుధ్యం, విద్యుత్ తదితర సేవలకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు. క్విక్ రెస్పాన్స్ బృందాలను సిద్ధంగా ఉంచినట్లు చెప్పారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ వరదల సమయంలో ప్రజల భద్రతకు పోలీసు శాఖ పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని తెలిపారు. అవసరమైన బందోబస్తు, సహాయక చర్యలను ఇతర శాఖలతో కలిసి నిర్వహిస్తామని చెప్పారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రతి శాఖ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆధునిక సాంకేతికతను వినియోగించి ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో వరదల అనంతరం అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య చర్యలు చేపట్టాలని, వైద్యశాఖ ముందస్తుగా మందులు సిద్ధం చేయాలని సూచించారు. భద్రాచలం పట్టణంలో గోదావరి నీటి ప్రభావం తగ్గించేందుకు పంపింగ్ మోటార్లు సిద్ధంగా ఉంచాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. తాగునీరు, వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని సూచించారు. గిరిజన రైతులకు ఉద్యానవన పంటలపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. వచ్చే ఏడాది గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని జిల్లాను పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దాలని మంత్రి పిలుపునిచ్చారు. అలాగే భద్రాచలంకూనవరం కరకట్ట పనులు వేగవంతం చేయాలని, సారపాక జాతీయ రహదారిపై వరదల సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా ఎత్తు పెంపు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ వరదల ముందు, సమయంలో, అనంతరం సమగ్ర కార్యాచరణతో వ్యవహరించాలని ప్రజాప్రతినిధులు సూచించారు.

## ఈనెల 28న జిల్లావ్యాప్తంగా నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి - జిల్లా కలెక్టర్



ఆసిఫాబాద్ జిల్లా ప్రతిని జూన్ 27: విజన్ ఆంధ్ర జిల్లాలోని పిల్లల భవిష్యత్తును పోలియో మహమ్మారి బారి నుండి రక్షించేందుకు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జూన్ 28 (ఆదివారం) నాడు జిల్లావ్యాప్తంగా 'పల్స్ పోలియో' చుక్కల కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కె హరిత అన్నారు శనివారం జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో వైద్య ఆరోగ్యశాఖ ఏర్పాటు చేసిన గోడ ప్రతులను పోస్టర్లను ఆవిష్కరించారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని నేనే స్వయంగా జిల్లా వైద్య & ఆరోగ్య శాఖ అధికారి డా. కె. సీతారాం వైద్య సిబ్బందితో కలిసి ప్రారంభిస్తున్నామని అన్నారు జిల్లా ప్రజలకు, పిల్లల తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేయునది

0 నుండి 5 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న ప్రతి చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలి. మన జిల్లాలో ఈ వయస్సు కలిగిన 46,516 మంది పిల్లలను గుర్తించి, అందరికీ చుకతెలిపారు అందేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు, దీనికోసం జిల్లావ్యాప్తంగా 3,101 వ్యాక్సిన్ వైల్స్, 667 పోలియో బూత్‌లు, 14 ట్రాన్సిట్ పాయింట్లు, 22 మొబైల్ బృందాలు, మరియు 86 రూట్ సూపర్‌వైజర్లను అందుబాటులో ఉంచాము. అన్నిగ్రాంజలు, గ్రా యూనిట్లు, గ్రామాలు మరియు బూత్‌లలో సిబ్బంది సిద్ధంగా ఉన్నారు. ఈ బృహత్తర కార్యం కోసం మొత్తం 2,668 మంది వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది పనిచేస్తున్నారు. పోలియో చుక్కల కార్యక్రమం ఉదయం 7:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు నిరంతరాయంగా కొనసాగుతుంది. ఇటుక బట్టీల్లో పనిచేసే కుటుంబాలు, వలస కార్మికులు, సంచార జాతులు, నిర్మాణ కార్మికులు, మత్స్యకారులు, పట్టణ శివారు ప్రాంతాలు, కొత్త కాలనీలు మరియు వ్యవసాయ క్షేత్రాల్లో నివసించే హైరిస్క్ వర్గాల పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాం. ఒక్క చిన్నారి కూడా మిస్ కాకుండా చుక్కల మందు వేయాలని ఇప్పటికే ఆరోగ్య సిబ్బందిని ఆదేశించడమైనది. ఈ రోజు సాధారణ ఇమ్యునైజేషన్‌లో భాగంగా పోలియో వ్యాక్సిన్ తీసుకున్నప్పటికీ, రేపు జరిగే పల్స్ పోలియో కార్యక్రమంలో మళ్లీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించుకోవాలి. పోలియో రహిత సమాజ స్థాపన కోసం తల్లిదండ్రులందరూ బాధ్యతగా తమ 5 సంవత్సరాల లోపు పిల్లలను సమీపంలోని పోలియో బూత్‌కు తీసుకువచ్చి, తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు సోమ మంగళవారాలలో సంబంధిత వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఇంటింటికి తిరిగి పోలియో చుక్కలు పంపిణీ చేస్తారని అన్నారు

## ఎస్సై జీనత్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలసిన పలు పార్టీ ల నేతలు.



జూలూరుపాడు జూన్ 28 (విజన్ ఆంధ్ర) జులూరుపాడు మండలం బేతాళ పాడు గ్రామ పంచాయతీ కీ చెందిన పలుపార్టీల నాయకులు శనివారం ఉదయం జూలూరుపాడు పోలీస్ స్టేషన్ ఎస్ ఐ జీనత్ కుమార్ ను తన చంబర్లో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలవతో సత్కరించారు. జూలూరుపాడు మండల పరిధిలో వున్నా యువత బహుశత్తును తీర్చి దిద్దే దిశగా యువత గంజాయి మత్తు అలవాటుకు దొంగతనాలు మద్యపానం డ్రగ్స్ కు బానిసలుగా మారి శాంతి భద్రత కు భంగం కలిగిస్తున్నారు మాదక ద్రవ్యాలా పై అవగాహనా కల్పించే విధంగా మండల యువత కు మంచి దారిలో పెట్టె విదంగా చెర్యలు తీసుకోవాలి అని ఉద్యోగ రీత్యా ఇంకా మున్ముందు ఎన్నో అత్యోన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం లో దారావత్ నాగేశ్వరావు, మాలోతు భీమా, గుగులోతు భాస్కర్, గుగులోతు సిద్దు. పాల్గొన్నారు.

## వరుస దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్టు చేసిన మొగుళ్ళపల్లి పోలీసులు,చోరీకి గురైన మోటార్ సైకిల్ స్వాధీనం



భూపాలపల్లి జిల్లా: 27 జూన్ ( విజన్ ఆంధ్ర ) మొగుళ్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని పర్లపల్లి గ్రామంలో 29-03-2026న జరిగిన ఇంటి తాళాలు పగులగొట్టి చోరీలు, మోటార్ సైకిల్ దొంగతనం కేసును మొగుళ్లపల్లి పోలీసులు విజయవంతంగా ఛేదించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు దాసరి మురళీకృష్ణ (30), మునగలవీడు గ్రామం, నెల్లికుదురు మండలం, మహబూబాబాద్ జిల్లాకు చెందిన వ్యక్తిగా గుర్తించడం జరిగింది. 27-06-2026 రోజున ఉదయం 9:30 కు మొగుళ్లపల్లి మండలంలోని పాత ఎస్సీపేట బస్ స్టాండ్ వద్ద వాహనాల తనిఖీల సందర్భంగా అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు చోరీ చేసిన బజాజ్ పల్సర్ 150 సీసీ మోటార్ సైకిల్ (TG259933)పై ప్రయాణిస్తూ పోలీసులను గమనించి పారిపోవడానికి ప్రయత్నించగా, పోలీసులు వెంటాడి పట్టుకున్నారు. విచారణలో నిందితుడు తన తండ్రి దాసరి నర్సయ్య (A2), తమ్ముడు దాసరి గణేష్ (A3)తో కలిసి పర్లపల్లి గ్రామంలో మూడు చోట్ల చోరీలకు పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. ఈ ఘటనలో ఒక బజాజ్ పల్సర్ మోటార్ సైకిల్, రూ.5,000 నగదు, బంగారు, వెండి ఆభరణాలను అపహరించినట్లు వెల్లడించాడు. చోరీ చేసిన ఆభరణాలను విక్రయించి వచ్చిన డబ్బును వ్యక్తిగత అవసరాలకు ఖర్చు చేసినట్లు తెలిపాడు. నిందితుడి వద్ద నుండి చోరీకి గురైన బజాజ్ పల్సర్ 150 సీసీ మోటార్ సైకిల్ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో నిందితుడు రాష్ట్రంలోని పలు పోలీస్ స్టేషన్లలో నమోదైన 42కు పైగా ఇంటి చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్న హ్యాబిచ్యువల్ అఫెండర్ అని తేలింది. ఈ కేసులో మిగిలిన నిందితులు దాసరి నర్సయ్య (A2), దాసరి గణేష్ (A3) పరారీలో ఉండగా, వారి అరెస్టు కోసం ప్రత్యేక గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఈ కేసును చిట్యాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీ డి. మల్లేష్ పర్యవేక్షణలో, మొగుళ్లపల్లి ఎస్ఐ. ఎం.సురేష్ తమ సిబ్బందితో కలిసి ఛేదించి నిందితుడిని అరెస్టు చేసి, చోరీకి గురైన మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ప్రజలకు విజ్ఞప్తి జిల్లాలో చోరీలు,ఆస్తి నేరాలకు పాల్పడే నేరస్థులపై కఠిన చర్యలు కొనసాగుతాయి. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణకు భూపాలపల్లి జిల్లా పోలీసులు నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తున్నారు. రాత్రి వేళల్లో ఇళ్లకు బలమైన తాళాలు వేయడం, విలువైన వస్తువులను భద్రంగా ఉంచుకోవడం, అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్-112కు సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని జిల్లా పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**- జిల్లా వైద్య & ఆరోగ్య అధికారి డా. తుకారాం రాథోడ్**



కొత్తగూడెం బ్యూరో జూన్ 28(విజన్ ఆంధ్ర) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్య & ఆరోగ్య అధికారి డా. తుకారాం రాథోడ్ జిల్లా వైద్యాధికారులు, సిబ్బందితో నిర్వహించిన జూమ్ సమీక్ష సమావేశంలో పల్స్ పోలియో, కార్యక్రమం పై కీలక సూచనలు చేశారు. జూన్ 28 నుండి ప్రారంభమయ్యే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, జిల్లాలో 05 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని ఆదేశించారు. జిల్లాలో మొత్తం 98 818 మంది 0-5 సంవత్సరంలోపు పిల్లలకు పోలియో చుక్కలు ఇవ్వడం జరుగుతుంది. మొత్తం925 బూత్ లు ,38 ట్రాన్సిట్ పాయింట్లు , 1001టీములు ఏర్పాటు చేయడం జరిగింది పల్స్ పోలియో కార్యక్రమాన్ని వంద శాతం విజయవంతం చేయడం, అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంలో ప్రతి వైద్యాధికారి, ఆరోగ్య సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని డా. తుకారాం రాథోడ్ పిలుపునిచ్చారు. అదేవిధంగా పల్స్ పోలియో బ్యానర్ను కూడా ఆవిష్కరించడం జరిగినది ఈ కార్యక్రమంలో డాక్టర్ రాకేష్ ప్రోగ్రాం అధికారి, డాక్టర్ ప్రతాప్ ప్రోగ్రాం ఆఫీసర్, డిప్యూటీ డెమో నాగలక్ష్మి, సిహెచ్ఓ నాగభూషణం హెచ్ ఇ వో రాంప్రసాద్, రామారావు, హరికృష్ణ , ప్రియా నర్సింగ్ ఆఫీసర్, పాల్గొన్నారు.

# జులై 2నఉప్పల్ బగాయత్ యాత్రలో జరిగే భూపోరాటాన్ని జయప్రదంచేయండి

**- గావినోళ్ల శ్రీనివాస్, ఎదురుగట్ల సంపత్ గౌడ్.**



నారాయణపేట, జూన్ 27 (విజన్ ఆంధ్ర) : టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అక్క ఆధ్వర్యంలో జూలై 2న హైదరాబాద్ ఉప్పల్ బగాయత్‌లో నిర్వహించనున్న భూ పోరాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భూ పోరాట ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఇంచార్జ్ ఎదురుగట్ల సంపత్ గౌడ్, గవినోళ్ల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి నారాయణపేట నియోజకవర్గం నుంచి తెలంగాణ ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబ సభ్యులు, కళాకారులు, జర్నలిస్టులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ సందర్భంగా నారాయణపేట నియోజకవర్గ ఇంచార్జ్ గావినోళ్ల శ్రీనివాస్, భూ పోరాట ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఇంచార్జ్ ఎదురుగట్ల సంపత్ గౌడ్, తెలంగాణ అమరవీరుల ఆశయాల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు కోరే సాయిరాం సంయుక్తంగా శనివారంవిలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గావినోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమకారుల ఆశయాలు నెరవేరే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులకు హైదరాబాద్ ఉప్పల్ బగాయత్‌లో 250 చదరపు గజాల స్థలాన్ని ప్రభుత్వం తక్షణమే కేటాయించాలని కోరారు. జూలై 2న ఉప్పల్ బగాయత్‌లో జరిగే భూ పోరాట కార్యక్రమానికి నారాయణపేట జిల్లా ప్రజలు, తెలంగాణ ఉద్యమకారులు, యువత, మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులు, తెలంగాణలో నిర్లక్ష్యానికి గురైన కళాకారులు, ఉద్యమాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన జర్నలిస్టులు, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల కుటుంబాలకు హైదరాబాద్ నడిబొడ్డున ఉప్పల్ బగాయత్‌లో 250 చదరపు గజాల స్థలాన్ని తక్షణమే ప్రభుత్వం కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తూ కమిటీ పేరుతో నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని విమర్శించారు. తెలంగాణ ఉద్యమంతో ఎలాంటి సంబంధం లేని వ్యక్తులను కమిటీలో చేర్చడం సరైంది కాదని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో జేపీ శ్యామ్ ప్రసాద్, శ్యామ్, తెలంగాణ అమరవీరుల ఆశయాల సాధన సమితి కోశాధికారి వేముగంటి సురేష్, దామర్‌గిద్ద మండల టిఆర్ఎస్ అధ్యక్షులు నర్సింహారెడ్డి, పల్లెబండ నర్సిములు, భీంశప్ప, మహేష్, నర్సప్ప (విట్లపూర్) తదితరులు పాల్గొన్నారు.

## మతసామరస్యానికి ప్రతీక మొహరం పండుగ

ఎల్బీనగర్ జూన్ 27 (విజన్ ఆంధ్ర): తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాల్లో భాగమైనటువంటి మొహరం పండుగకు ఎంతో విశిష్టత ఉందని, మతసామ్రాస్యానికి ప్రత్యేకగా మొహరం పండుగ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని మీర్పేట సిఐ శోభన్ పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి ఎల్బీనగర్ నియోజకవర్గం హస్తినాపురం డివిజన్ భూపేష్ గుప్తా నగర్ కాలనీలో మొహరం పీర్ల పండగ ముగింపు కార్యక్రమఉత్సవాలలో మీర్పేట్ సిఐ శోభన్ హాజరై పేర్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మతసామరస్యాన్ని చాటే మొహరం పండుగ సహనం, త్యాగం, కర్తవ్యాన్ని బోధిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఐ మట్టం రాజు, మాజీ వార్డ్ కమిటీ సభ్యులు మొహమ్మద్ సయ్యద్ పాషా, ఇబ్రహీం, షాకీర్, పీర్ల పండుగ నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు ఖాజా తదితరులు పాల్గొన్నారు.

# నిద్రమత్తులో ఎక్సైజ్ శాఖ, జిల్లాలో ఏరులై పారుతున్న గుడుంబా

- జిల్లా కేంద్రంలో గుప్పుమంటున్న గుడుంబా..
- ఎక్సైజ్ మరియు పోలీస్ శాఖ గుడుంబా తయారీని అరికట్టాలి.





భూపాలపల్లి జిల్లా 27 జూన్ (విజన్ ఆంధ్ర) న్యూస్ : భూపాలపల్లి శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో గుడుంబా, దందా విచ్చలవిడిగా సాగుతోంది. ఎక్సయిస్ శాఖ అధికారుల నిఘా లేకపోవడం తో యువత మత్తులో రోడ్డుపై పడుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. జిల్లా కేంద్రానికి కూత వేటు దూరం లో గూడంబా తయారీ పట్టణ శివారులోని ఖాళీ స్థలాలు, చెట్ల పొదల్లో గుడుంబా తయారీ అడ్డాలు ఉన్న చూసి చూడనట్లుగా వ్యవహారిస్తున్నారు. బెల్లం, బియ్యం కలిపి పులియబెట్టి తయారు చేస్తున్న ఈ గుడుంబా తక్కువ ధరకె దొరుకుతోంది. దీన్ని తాగిన చాలా మంది యువకులు తరచుగా యాక్సిడెంట్లకు గురవుతున్నారు. జిల్లా కేంద్రానికి కూత వేటు దూరంలో ఉన్నటువంటి ఈ గ్రామాన్ని కట్టడి చేయలేక పోతున్నారు అంటే జిల్లా ను ఎలా కంట్రోల్ చేస్తారు అని ప్రజలు అనుకుంటున్నారు. ఎక్సయిస్ శాఖ నిబంధనల ప్రకారం పట్టణంలో తరచుగా తనిఖీలు, రైడ్‌లు జరగాలి. కానీ జిల్లాలో సిబ్బంది కొరత ఉందనే సాకుతో అధికారులు నెలకు 1-2 సార్లు మాత్రమే దాడులు చేస్తున్నారు. ఆ దాడుల్లోనూ చిన్న సరుకు సీజ్ చేసి ఫోటోలు తీసుకుని వెళ్తున్నారనే విమర్శలు ఉన్నాయి. గుడుంబా, చౌక మద్యానికి బానిసైన చాలా మంది యువకులు చదువు, ఉద్యోగ, ఉపాధి వదిలేసి రోడ్డుపై తిరుగుతున్నారు. గొడవలు, చోరీలు పెరుగుతున్నాయి. ప్రజల్లో భయం పెరిగిపోతోంది. జిల్లా ఎస్పీ, జాయింట్ కమీషనర్ ఆఫ్ ఎక్సయిస్ వెంటనే స్పందించి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలతో ఆకస్మిక దాడులు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. టీఆర్పి జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ మాట్లాడుతూ నిద్రమత్తులో ఎక్సైజ్ శాఖ ఉందని జిల్లాలో ఏరులై పారుతున్న గుడుంబా తయారీ అడ్డాలను పూర్తిగా ధ్వంసం చేయాలని కోరుతున్నారు. యువత భవిష్యత్తు కోసం ఎక్సయిస్ శాఖ మత్తు వదిలి గూడంబా తయారీ కేంద్రాల వద్ద దాడులు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నాను. భూపాలపల్లి పట్టణ పరిసర ప్రాంతంలో ఉన్నటువంటి యువత చౌక ధరకు దొరుకుతుందని గూడంబా కు అలవాటు పడి వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. గూడంబాకు అలవాటు పడి కొందరు ప్రాణాలు పోగొట్టుకొని భార్య పిల్లల జీవితాలు రోడ్డుమీద పడుతున్నాయి. కాబట్టి జిల్లా ఎక్సయిజ్ మరియు పోలీస్ శాఖ జాయింట్ గా గూడంబా తయారీ కేంద్రాలవద్ద దాడులు నిర్వగించాలని ప్రజలు కోరుచున్నారు.

## అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా

# పోలీస్ ఆధ్వర్యంలో డ్రగ్స్ అవగాహన ర్యాలీ

భూపాలపల్లి జిల్లా: 27 జూన్ (విజన్ ఆంధ్ర ) భూపాలపల్లి జిల్లా ను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, డ్రగ్స్, గంజాయికి దూరంగా ఉండాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రగ్స్ అవగాహన ర్యాలీలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా పాల్గొని, జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్‌తో కలిసి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని గణేష్ చౌక్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు నిర్వహించిన ర్యాలీలో ప్రజలు, విద్యార్థులు, ప్రభుత్వ అధికారులు, పోలీసు అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అంబేద్కర్ సెంటర్‌లో మానవహారం నిర్వహించి, "డ్రగ్స్, గంజాయి రహిత సమాజ నిర్మాణానికి కృషి చేద్దాం" అంటూ ప్రతిజ్ఞ చేశారు. అలాగే డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కల్పించే సంతకాల సేకరణ కార్యక్రమాన్ని కూడా చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు




మాట్లాడుతూ, మాదక ద్రవ్యాలు యువత భవిష్యత్తును, కుటుంబాలను నాశనం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్ నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని, ప్రతి ఒక్కరూ బాధ్యతతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ మాట్లాడుతూ, డ్రగ్స్ రవాణా, విక్రయాలపై పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకుంటూ నిరంతరం నిఘా కొనసాగిస్తోందన్నారు. అయితే కేవలం పోలీసుల చర్యలతోనే కాకుండా ప్రజలు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సహా సమాజంలోని ప్రతి ఒక్కరూ సహకరిస్తేనే డ్రగ్స్ రహిత సమాజం సాధ్యమవుతుందన్నారు. అనుమానాస్పద డ్రగ్స్ కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. దఅలాగే తెలంగాణ ప్రభుత్వం డ్రగ్స్‌కు బానిసైన వారి పునరావాసం కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేస్తోందని తెలిపారు. డ్రగ్స్ అలవాటు ఉన్నవారు భయపడకుండా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రీహాబిలిటేషన్ సెంటర్లలో చికిత్స పొందాలని సూచించారు. స్వయంగా పోలీసులను సంప్రదించి చికిత్సకు సిద్ధమయ్యే వారికి పునరావాసం కల్పించడంతో పాటు, చట్టపరమైన నిబంధనల మేరకు వారికి సంబంధించిన కేసుల ఉపసంహరణకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని తెలిపారు. డ్రగ్స్ బారిన పడిన వారిని నేరస్థులుగా కాకుండా సమాజంలో తిరిగి మంచి పౌరులుగా తీర్చిదిద్దడమే పోలీస్ శాఖ లక్ష్యమని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు కూడా అలాంటి వారిని రీహాబిలిటేషన్ సెంటర్లకు తీసుకువెళ్లి చికిత్స అందేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# 18 సంవత్సరాలు నిండిన వారు ఓటర్ జాబితాలో పేరు నమోదు చేసుకోవాలి

- ఓటరు జాబితా రూపకల్పనకు ప్రజలు సహకరించాలి
- జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ.



భూపాలపల్లి జిల్లా 27 జూన్ (విజన్ ఆంధ్ర) : శనివారం రేగొండ మండలంలో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బిఎల్ఓ సుజాత ఇంటింటికి అందిస్తున్న ఎన్యూమ రేషన్ ఫారాలు, రిజిస్టర్ లో నమోదులు, యాప్ ఎంట్రీలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2002 ఓటరు జాభితా ప్రకారం మ్యాపింగ్ చేయాల్సి ఉన్నదని తెలిపారు. బూత్ స్థాయి సిబ్బంది ప్రతి ఇంటిని సందర్శించి ఎన్యూమరేషన్ ఫారాలు ఇస్తారని అందులో ఉన్న వివరాలు నమోదు చేయాలని ఓటర్లకు అవగహన కల్పించారు. బూత్ స్థాయి అధికారి వద్ద ఓటరు జాభితా ఉంటుందని ప్రతి ఒక్కరు తమ పేర్లు పరిశీలించాలని తెలిపారు. జాబితాలో పరిశీలన అలాగే అనర్హులైన వారి పేర్లను తొలగించేందుకు జరుగుతున్న ప్రత్యేక కార్యక్రమానికి సహకరించాలని ఆయన కోరారు. ఇందుకోసం ఎన్నికల శాఖ ప్రత్యేకంగా చేపట్టిన సర్వే కార్యక్రమంలో బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరిస్తున్నారని తెలిపారు. యువత 18 సంవత్సరాలు నిండిన వారు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఆన్‌లైన్ మరియు ఆఫ్‌లైన్ విధానాల ద్వారా నమోదు చేసుకునే సౌకర్యం కల్పించబడిందని తెలిపారు. జిల్లాలో స్వచ్ఛమైన, ఖచ్చితమైన ఓటరు జాబితా తయారీకి ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని జిల్లా ఎన్నికల అధికారి విజ్ఞప్తి చేశారు. పోలింగ్ కేంద్రం 223 పరిధిలో 1171 మంది ఓటర్లున్నారని వారందరికి ఎన్యూమరేషన్ ఫారాలు అందించాలని సూచించారు. ఎన్యూమ రేషన్ ఫారాలు ఇచ్చిన వ్యక్తులకు అక్నాలెడ్జి ఇవ్వాలని తెలిపారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ పర్యవేక్షణ చేస్తారని ప్రక్రియను వేగవంతం చేయాలని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్వేత, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# రైతే రాజు సంకల్పంతో భూవరాహ యాగం...

- కల్పవృక్ష నారసింహుని దయతో ప్రతి రైతు కుటుంబం సుభిక్షంగా ఉండాలి...మంత్రి తుమ్మల
- రైతు సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న డా.కృష్ణ చైతన్య స్వామి సేవలు అభినందనీయం..మంత్రి తుమ్మల
- భూవరాహ యజ్ఞం భద్రగిరి లో నిర్వహించడం అభినందనీయం. ఎమ్మెల్యే తెల్లం



భద్రాచలం జూన్ 28(విజన్ ఆంధ్ర) : నేలతల్లిని నమ్మిన ఏ ఒక్కరైతు కంటనీరు పెట్టకూడదని దేశానికి అన్నం పెట్టే రైతే రాజు కావాలని భద్రాద్రి పుణ్యక్షేత్రంలోని కల్పవృక్ష నారసింహ స్వామి వారి దివ్య సన్నిధిలో నృసింహ ఉపాసకులు డా. కృష్ణ చైతన్య స్వామి వారి ఆధ్వర్యంలో నిర్వహించిన భూవరాహ మహాయజ్ఞం ఆధ్యాత్మికత, వ్యవసాయ సంస్కృతి, రైతు సంక్షేమానికి ప్రతీకగా నిలిచింది. భూమిని భరించి రక్షించిన భూవరాహ స్వామి అనుగ్రహంతో ప్రతి రైతు కుటుంబం సిరిసంపదలతో వర్ధిల్లాలని, పంటలు పుష్కలంగా పండాలని వేలాది మంది రైతులు భక్తిశ్రద్ధలతో ప్రార్థించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, "కల్పవృక్ష నారసింహుని దయతో ప్రతి రైతు కుటుంబం సుభిక్షంగా ఉండాలని నేలతల్లిని నమ్ముకున్న ఏ ఒక్క రైతు కన్నీరు పెట్టకూడదని . దేశానికి అన్నం పెట్టే రైతే నిజమైన రాజు అని రైతు బాగుంటేనే రాష్ట్రం, దేశం బాగుంటాయని అన్నారు రామయ్య నడయాడిన పుణ్యక్షేత్రంలో భూవరాహ యజ్ఞం నిర్వహించడం ఎంతో అభినందనీయమని, ఈ యజ్ఞం రైతుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపి ప్రకృతి అనుగ్రహంతో పంటల సమృద్ధిగా పండాలని ప్రతి రైతు కుటుంబం సుభిక్షంగా ఉండాలని కోరారు యజ్ఞానంతరం పంపిణీ చేసిన మృత్తికా ప్రసాదం కోసం ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి వేలాది మంది రైతులు, భక్తులు తరలివచ్చారు. ఈ పవిత్ర మట్టిని తమ తమ పంట పొలాలలో జల్లుకొని సిరుల పంటలు పండించుకోవాలని రైతు ప్రగతే దేశ ప్రగతి అని అన్నారు. భూమిని దైవంగా భావించే భారతీయ సంస్కృతిలో రైతు కేవలం అన్నదాత మాత్రమే కాదు... దేశ భవిష్యత్తును నిర్మించే యజ్ఞకర్త అని . భూవరాహ స్వామి కృపతో ప్రతి పొలం పచ్చగా కళకళలాడాలని, ప్రతి రైతు ఇంట ఆనందం నిండాలని, రైతే రాజుగా వెలిగే స్వర్ణయుగం రావాలని భద్రగిరి నుంచి చేసిన ఈ మహా ప్రార్థన దేశమంతటా సస్యశ్యామలాన్ని విరజిమ్మాలని అన్నారు..యజ్ఞవేదిక వద్ద నెలకొన్న ఆధ్యాత్మిక వాతావరణం ప్రతి ఒక్కరినీ భక్తి పారవశ్యంలో ముంచెత్తింది. భూమిని దైవంగా భావించే భారతీయ సంస్కృతిలో రైతు కేవలం అన్నదాత మాత్రమే కాదు... ప్రతి గింజలో జీవాన్ని నింపే యజ్ఞకర్త అని . రైతు చెమటతోనే దేశ ఆర్థిక వ్యవస్థ నిలబడుతుందని కల్ప వృక్షం నరసింహ స్వామి వారి దయతో ప్రతి రైతు కుటుంబం సుఖశాంతులతో వర్ధిల్లాలని ప్రత్యేక పూజలు చేశారు .రైతు సంక్షేమం అనేది కేవలం ఒక వర్గానికి సంబంధించిన అంశం కాదు... దేశ భవిష్యత్తుకు సంబంధించిన మహాసంకల్పం. భూవరాహ మహాయజ్ఞం ద్వారా వెలువడిన సందేశం ఒక్కటే... భూమిని కాపాడాలి... రైతును గౌరవించాలి... వ్యవసాయాన్ని పరిరక్షించాలి. భూవరాహ స్వామి అనుగ్రహంతో ప్రతి రైతు ఇంట ఐశ్వర్యం వెల్లివిరియాలని, ప్రతి పొలం బంగారు పంటలతో కళకళలాడాలని, ఏ రైతు అప్పుల బాధతో కన్నీరు పెట్టుకోని సమాజం నిర్మితమవాలని, రైతే రాజుగా వెలిగే స్వర్ణయుగం ఆవిష్కృతం కావాలని భద్రగిరి గడ్డపై జరిగిన ఈ మహా యజ్ఞం దేశమంతటికీ స్ఫూర్తిగా నిలిచింది. నేటి ఆధునిక కాలంలో రైతు శ్రేయస్సు కోసం అహర్నిశలు శ్రమించి 32 దివ్య క్షేత్రాలు నుండి మట్టిని సేకరించి ప్రత్యేక పూజలు చేసి భూ వరాహ యజ్ఞం చేసి ఆ మట్టి ప్రసాదాన్ని రైతులకు అందించిన నృసింహ ఉపాసకులు డా.కృష్ణ చైతన్య స్వామిని ప్రత్యేకంగా తుమ్మల అభినందించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పినపాక నియోజకవర్గం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్రావు టిపిసిసి జనరల్ సెక్రటరీ నాగ సీతారాములు పార్టీ శ్రేణులు కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు

# దేశంలో పరీక్షల నిర్వహణలో పారదర్శకత లోపించింది..

- నీట్ పేపర్ లీక్‌తో యువత భవిష్యత్తుతో బీజేపీ ప్రభుత్వం చెలగాటం..



సూర్యాపేట జూన్ 27:(విజన్ ఆంధ్ర) : దేశ యువత భవిష్యత్తును బీజేపీ ప్రభుత్వం నాశనం చేస్తోందని మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, జిల్లా కాంగ్రెస్ కోశాధికారి కక్కిరేణి శ్రీనివాస్ విమర్శించారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రం వాణిజ్య భవన్ సెంటర్ లో నీట్ పరీక్ష పేపర్ లీకేజీని నిరసిస్తూ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఎలిమినేటి అభినయ్ ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమం యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి, ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తంరెడ్డి ఆదేశాలు, డీసీసీ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య సూచనల మేరకు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నీట్ పేపర్ లీకేజీ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు ఎంతో కష్టపడి పరీక్షలకు సిద్ధమవుతుంటే, పేపర్ లీకేజీలతో వారి భవిష్యత్తును బీజేపీ ప్రభుత్వం ప్రమాదంలోకి నెడుతోందని ఆరోపించారు. దేశంలో పరీక్షల నిర్వహణలో పారదర్శకత లోపించిందని, యువత ఆశయాలను దెబ్బతీసే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. విద్యా వ్యవస్థను రాజకీయ, కార్పొరేట్ ప్రయోజనాలకు బలిచేయకుండా విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో రెబల్ శ్రీనివాస్, ఎస్.ఎస్. సాజిద్, నరేందర్ నాయుడు, చెంచాల నిఖిల్ నాయుడు, డి.ఆర్., వినయ్, సుదీర్, సైదులు, అబ్బాస్, నాగరాజు, కిరణ్, అశోక్, లక్ష్మణ్, శివ, సందీప్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో లబ్ధిదారునికి అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది..

సూర్యాపేట జూన్ 27:(విజన్ ఆంధ్ర) : ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో లబ్ధిదారునికి అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని రాష్ట్ర అగ్రికల్చర్ కోఆపరేటివ్ సెక్రటరీ, మార్కెటింగ్ డైరెక్టర్ ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక సూర్యాపేట జిల్లా ప్రత్యేక అధికారి కే సురేంద్రమోహన్ అన్నారు. శనివారం ఆయనసూర్యాపేట జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం పై జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తో కలిసి సమీక్షించారు. ప్రభుత్వం చేపట్టిన వివిధ అభివృద్ధి ,సంక్షేమ పథకాలు,కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో లబ్ధిదారునికి అందుతున్నది, లేనిది తెలుసుకోవడంతోపాటు, అలాగే వివిధ పథకాల అమలులో ప్రజలకు అవగాహన కల్పించి సమస్యలను తెలుసుకునేందుకు 99 రోజులపాటు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని వివరించారు. ప్రభుత్వ పథకాల ఫలితాలు లబ్ధిదారులకు అందాలంటే అన్ని పథకాలను పకడ్బందీగా అమలు చేయాలని, అప్పుడే లబ్ధిదారులకు సరైన విధంగా లబ్ధి చేకూరుతుందన్నారు. విద్య, వైద్యం, ఆరోగ్యం తదితర రంగాలలో ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కరించడం, లబ్ధిదారుల నుండి సమస్యలను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు కృషి చేయడం, ప్రభుత్వ పథకాల పై ప్రజలకు అవగాహన కల్పించడం వంటివి అధికారులు చేయాల్సిన అవసరం ఉందన్నారు ఎక్కడైతే ప్రజలకు విద్య, వైద్యం సక్రమంగా అందుతుందో అక్కడ పేదరికం ఉండదని అన్నారు. సూర్యాపేట జిల్లాలో ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని ప్రభుత్వ ఆదేశాల మేరకు క్రమ పద్ధతిలో విజయవంతంగా నిర్వహించడం పట్ల ఆయన జిల్లా కలెక్టర్ తో పాటు, అధికారులందరినీ అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇదే ఒరవడిని కొనసాగించాలని, ఎట్టి పరిస్థితులలో లబ్ధిదారున్ని మర్చిపోకూడదని చెప్పారు. అందుబాటులో ఉన్న వనరులతో ప్రజలకు మేలు చేసేందుకు కృషి చేయాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా వచ్చే నిధులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు ఆయా శాఖల అధికారులు రొటీన్ పనుల పై కాకుండా అదే పనిని ఇతర ప్రాంతాలలో ఎలా చేస్తున్నారో అధ్యయనం చేసుకొని సాధ్యమైనంత ఎక్కువ లాభాన్ని ప్రజలకు చేకూర్చేందుకు కృషి చేయాలని, ఇందుకుగాను వినూత్నంగా ఆలోచన చేయాలని తెలిపారు. ఇందుకు సమర్థవంతమైన షెడ్యూల్ ను, ప్రణాళికను రూపొందించుకోవాలని, అప్పుడే ఆశాజనక ఫలితాలు వస్తాయని చెప్పారు . పథకాల అమలులో వివిధ




శాఖలు సమ్మిళితంతో అమలు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన విద్య , వైద్యం ఆరోగ్యం, సంక్షేమ కార్యక్రమాలు అమలులో జిల్లాలో ప్రజా పాలన- ప్రగతి ప్రణాళికలో చేపట్టిన కార్యక్రమాలను అభినందిస్తూ ప్రపంచంలో ఎక్కడ చేయని విధంగా తెలంగాణ ప్రభుత్వం 99 రోజుల ప్రజాపాలన ప్రణాళిక అనే గొప్ప కార్యక్రమాన్ని చేపట్టిందని, నిధులు లేకున్నప్పటికీ జిల్లాలో సమర్థవంతమైన కార్యక్రమాలను నిర్వహించారని అన్నారు. అధికారులు ఆర్థిక విషయాలు పట్ల పూర్తి అప్రమత్తంగా ఉంటూ పథకాలను అమలు చేయాలని , ప్రభుత్వం ఏ ఉద్దేశంతో అయితే ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందో ఈ కార్యక్రమం సూర్యాపేట జిల్లాలో వందకు వంద శాతం విజయవంతం అవ్వడం చాలా సంతోషంగా ఉందని, ఇదే విధంగా ముందు ముందు జిల్లాలో ఏ కార్యక్రమాన్ని పెట్టినా అందరూ సమిష్టిగా కలిసి విజయవంతం చేయుటకు కృషి చేయాలని ఆకాంక్షించారు. రైతులకు వ్యవసాయ శాఖ యాప్ ల మీద అవగాహన కల్పించాలని, ప్రజలు అనారోగ్య బారిన పడకుండా రైతులు ఆర్గానిక్ పంటలు పండించే విధంగా వ్యవసాయ, హా ర్టికల్చర్ అధికారులు అవగాహన కల్పించాలని, వ్యవసాయ అధికారులు భూసార పరీక్షలు చేసి రైతులు ఏ విత్తనాలు, ఏ ఎరువులు వాడితే లాభంగా ఉంటుందో అవగాహన కల్పించాలని, రైతు వేదికలలో రైతులకు సన్న వడ్ల సీడ్, ఫెర్టిలైజర్స్ అందించాలని, దీనికి నోడల్ ఆఫీసర్ గా అదనపు కలెక్టర్ ఉంటారని, రైతులకు ఆయిల్ ఫామ్ సాగు పై అవగాహన కల్పించి జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగు ప్రోత్సహించాలని, అగ్రికల్చర్, హార్టికల్చర్ అధికారులకు సూచించారు. వ్యవసాయ శాఖకు సంబంధించిన సమాచారం, యూరియా యాప్, సందేహాల నివృత్తి కోసం టోల్ ఫ్రీ నెంబర్ 18001237157 ద్వారా తెలుసుకోవచ్చు అన్నారు. అదే విధంగా సంక్షేమ హాస్టల్స్ లో సంక్షేమ అధికారులు వారానికి ఒక సారి సందర్శించి బడ్జెట్ మీద ఆధారపడకుండా మానవతా దృక్పథంతో ఫ్యాన్లు రిపేర్ చేయించడం, చెప్పులు లేని విద్యార్థులకు చెప్పులు కొనివ్వాలని సంక్షేమ అధికారులకు సూచించారు. అంతకు ముందు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ప్రజా



పాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ లో భాగంగా సూర్యాపేట జిల్లాలో 99 రోజులపాటు ఆయా అంశాల వారిగా చేపట్టిన కార్యక్రమాలను ప్రత్యేక అధికారికి వివరించారు. అనంతరం ఆయా శాఖలకు సంబంధించి చేపట్టిన కార్యక్రమాలను జిల్లా శాఖల అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రత్యేక అధికారికి వివరించారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ కార్యాలయం చేరుకున్న ప్రత్యేక అధికారి కి జిల్లా కలెక్టర్ తో పాటు, జిల్లా ఎస్పీ కె నరసింహ ఇతర అధికారులు పుష్పగుచ్చం అందజేసి స్వాగతం పలికారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం పై ఏర్పాటుచేసిన ఫోటో ఎగ్జిబిషన్ ను ప్రత్యేక అధికారి తిలకించి చాలా బాగా చేశారని అభినందించారు. చివరిగా జిల్లా కలెక్టర్ ప్రత్యేక అధికారిని సత్కరించి తమరు సూచించిన ఆదేశాలు జిల్లాలో తప్పకుండా అమలు చేస్తామని, ముందు ముందు ప్రభుత్వం ఏ కార్యక్రమాలు ప్రవేశపెట్టినా విజయవంతం చేయడం జరుగుతుందని, తమరి ఆదేశాలు తప్పకుండా అమలు చేస్తామని అన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ బి హరి సింగ్, జెడ్పి సీఈవో శిరీష, డిఆర్ఓ ప్రేమ్ రాజ్, డి ఆర్ డి ఏ సన్యాసయ్య , డి ఇ ఓ అశోక్, సిపిఓ కిషన్ నాయక్, డి ఏ ఓ శ్రీధర్ రెడ్డి, జిల్లా అధికారులు ఈ సమీక్ష సమావేశానికి హాజరయ్యారు.

# విద్యార్థులు విద్యతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలి

- విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి.
- కలెక్టర్ రాహుల్ శర్మ.



భూపాలపల్లి జిల్లా 27 జూన్ (విజన్ ఆంధ్ర) : శనివారం రేగొండ మండలం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 10వ తరగతి విద్యార్థులతో బయాలజీ, 9వ తరగతి విద్యార్థులతో లెక్కలు చేపించి ప్రతిభను అభినందించారు. అనంతరం విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, గ్రామానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. భవిష్యత్తులో ఏం కావాలని కోరుకుంటున్నారో విద్యార్థులను అడిగి తెలుసుకోగా, ఐఏఎస్, ఐపీఎస్, డాక్టర్, సాఫ్ట్‌వేర్, ఉపాధ్యాయులుగా ఎదగాలనుకుంటు న్నట్లు విద్యార్థులు తెలిపారు. ఈ సందర్భంగా వారి లక్ష్యాలను కలెక్టర్ అభినందించారు. కష్టంగా కాకుండా ఇష్టపడి చదివితేనే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకుని ప్రజలకు సేవ చేసే అవకాశం సాధ్యమవుతుందని కలెక్టర్ తెలిపారు. చెంచుకాలని నుండి వచ్చే విద్యార్థులు సుదూరం కావడం వల్ల ఇబ్బందులు పడుతున్నారని ప్రధానోపాధ్యాయులు తెలుపగా అట్టి విద్యార్థులకు రవాణా సౌకర్యం లేదా సైకిల్ ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ శ్వేతా, ఎంపిడిఓ వెంకటేష్, ఎంఈఓ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సర్పంచ్ మోనిక తదితరులు పాల్గొన్నారు.




# నిరుపేద కుటుంబం నుండి ఇండియన్ ఆర్మీ అగ్ని వీర్ గా గోపు మహేష్

**గోపు మహేష్ ను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపి సత్కరించన డిసిసి కార్యదర్శి ఆర్కే నాయుడు బేతాళ పాడు కాంగ్రెస్ నాయకులు.**

**అమ్మ నాన్నా కష్టాలు అన్నయ్య ప్రోత్సాహం నాకు ధైర్యాన్ని నింపి ముందుకు నడిపాయి.**

**అభ్యర్థి గోపు మహేష్.**







జూలూరుపాడు జూన్ 28 (విజన్ ఆంధ్ర ) జూలూరుపాడు మండలం బేతళ పాడు గ్రామానికి చెందిన గోపు మహేష్ ఇండియన్ ఆర్మీ అగ్ని వీర్ ఉద్యోగం సంపాదించడం పట్ల మాకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తుందని భద్రాద్రి జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి ఆర్కే నాయుడు మాట్లాడుతూ గోవు మహేష్ మంచి వ్యక్తిత్వం కలిగిన విద్యార్థిగా చూసాము మహేష్ పట్టుదల గ్రామం లో అనేకమందికి మార్గదర్శకం కావాలని ఆశిస్తున్నట్లు తెలిపారు మహేష్ ఉద్యోగ రీత్య పై స్థాయిలోకి వెళ్లాలని కోరుతున్నట్లు తెలిపారు.

విజన్ ఆంధ్ర ప్రతినిధి:- నీ పట్టుదలకు కారణాలేమిటి.

మహేష్ :- మా అమ్మానాన్న రామయ్య ఉదయశ్రీ , కూటి కోసం కోటి విద్యలు అన్నట్లు అనేకరకాల రోజువారి కూలీలకు వెళ్లి నిరుపేద రైతు కూలీ ప్రతి రోజు రైతు వారి వ్యవసాయ కూలికి పోయి జీవనం సాగించే వారికి నేను మా అన్నయ్య పెద్ద బిడ్డ గోపి కాగా చిన్న బిడ్డ నేను మహేష్ మా కోసం అమ్మ నాన్న ఒక నిర్ణయం తీసుకొన్నారు, వారి ఆర్థిక పరిస్థితులు కష్టాలు పిల్లకు రాకూడదు అని, మా చదువుల పట్ల ప్రత్యేక శ్రద్ద చూపి మా కోసం వారు పడుతున్న కష్టాలను వివరిస్తూ చదువు తో ఉద్యోగం వస్తే జీవితం బాగ ఉంటుంది అని చదువల పట్ల అవగాహనా తెలుపుతూ మమ్మళ్ళను పెంచారు. ఇద్దరి చదువు ప్రభుత్వ పాఠశాల లో చదివిచ్చారు . పెద్ద కుమారుడు మా అన్నయ్య గోపి తన పదివ తరగతి పూర్తి చేసి కూలీ నాలి పనులలో మా నాన్నకి తోడుగా వుంటూ ఇంటర్ డిగ్రీ పూర్తి చేస్తూ తన తమ్ముడు అంటే నేను నా చదువల పై ప్రత్యేక దృష్టి సాధించాడు తను చదువుకుంటూ ప్రతి శనివారం హైదరాబాద్ నుండి కొత్తగూడెం సంతకు రైలు ప్రయాణం చేసి నాన్న తో వీధి వ్యాపారం చేసి సంపాదించిన డబ్బుతో తన తమ్ముడు చదులు తన చదుల ఖర్చు చేస్తూ జీవనం సాగించే వాడు నా కోసం తన కష్టాన్ని త్యాగం చేస్తూ తన ఉద్యోగం సంపాదించి అమ్మ నాన్న లకు గ్రామానికి గొప్ప పేరు తేవాలని చెప్పేవాడు అని మహేష్ తన ఆవేదన వెక్తం చేస్తూ అమ్మ నాన్న కష్టాలు చూసి అన్నయ్య త్యాగం అందదండలే నన్ను ముందుకు నడిపాయి అని ఇండియన్ ఆర్మీ అగ్ని వీర్ ఉద్యోగానికి సెలెక్ట్ అయిన మహేష్ అన్నారు తమ తల్లిదండ్రులకు అన్నకు ఉద్యోగం రావడానికి ప్రత్యేకంగా పరోక్షంగా సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞత అభినందనలు తెలిపారు.

# జాడ లేని తనిఖీలు.. వార్తలు వచ్చినా చలనం లేదా..

**- అధికారుల మౌనం వెనుక మర్మమేంటి..?**
**- ప్లాస్టిక్ నిషేధం కాగితాలకే పరిమితమా..!**
**- ప్రచారం ఒకటి... అమలు మరోటా..?**
**- సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై ప్రచారం జోరు...**
**- అమలులో మాత్రం శూన్యం..!**
**- ప్లాస్టిక్ పై నిషేధం ఉన్న కంట్రోల్ కరువైంది..**
**- ప్లాస్టిక్ నిషేధం అమలుపై అధికారుల నిర్లక్ష్యమా..?**



సూర్యాపేట జూన్ 27:(విజన్ ఆంధ్ర) : సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించినా, నిబంధనల అమలు విషయంలో మాత్రం ఆశించిన స్థాయిలో పురోగతి కనిపించడం లేదనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.పలు మీడియా సంస్థలు ఈ అంశంపై కథనాలు ప్రచురించినప్పటికీ, సంబంధిత శాఖల నుంచి అధికారిక స్పందన లేకపోవడం చర్చనీయాంశమైంది. నిషేధిత ప్లాస్టిక్ వస్తువుల విక్రయం కొనసాగుతోందని కొందరు వ్యాపారులు, ప్రజలు చెబుతున్నారు.ప్రభుత్వం నిషేధం అమలుపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసిన నేపథ్యంలో,తనిఖీలు ఎంతవరకు జరుగుతున్నాయి..? ఉల్లంఘనలపై చర్యలు ఎన్ని తీసుకున్నారు..? స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ పరిమాణం ఎంత..? అనే ప్రశ్నలకు అధికారుల నుంచి స్పష్టత రావాల్సి ఉందని స్థానికులు కోరుతున్నారు. అవగాహన కార్యక్రమాలతో పాటు క్షేత్రస్థాయిలో నిరంతర తనిఖీలు, పారదర్శక చర్యలు ఉంటేనే నిషేధం ప్రభావవంతంగా అమలవుతుందని పర్యావరణ ప్రేమికులు అభిప్రాయపడుతున్నారు.సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై వరుసగా వార్తలు వెలువడుతున్నప్పటికీ,సంబంధిత అధికారుల నుంచి ఇప్పటివరకు స్పష్టమైన స్పందన లేకపోవడం చర్చనీయాంశంగా మారింది.ప్రభుత్వం నిషేధం అమలు చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో అమలు ఎంతవరకు జరుగుతోందనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. నిషేధిత ప్లాస్టిక్ విక్రయాలు కొనసాగుతున్నాయనే ఆరోపణలపై సంబంధిత అధికారులు వివరణ ఇవ్వకపోవడం ప్రజల్లో సందేహాలకు తావిస్తోంది.వార్తలు ప్రచురితమైన తర్వాత తనిఖీలు జరిగాయా..? ఎన్ని కేసులు నమోదు చేశారు..? ఎన్ని దుకాణాలపై చర్యలు తీసుకున్నారు..? ఎంత మేరకు ప్లాస్టిక్ స్వాధీనం చేసుకున్నారు..? అనే అంశాలపై అధికారిక సమాచారం వెలువడాల్సి ఉందని స్థానికులు కోరుతున్నారు.ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పడం, అమలు పురోగతిని వెల్లడించడం అధికారుల బాధ్యత అని పలువురు అభిప్రాయపడుతున్నారు. నిషేధం నిజంగా అమలవుతోందా, లేక ప్రచార కార్యక్రమాలకే పరిమితమైందా అనే సందేహాలకు సమాధానం రావాలని ప్రజలు ఎదురుచూస్తున్నారు. ప్రచార కార్యక్రమాలతో సరిపెట్టకుండా అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి నిషేధిత ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలు కఠినంగా అమలు చేసినప్పుడే ప్లాస్టిక్ రహిత సమాజం లక్ష్యం నెరవేరుతుందని అభిప్రాయపడుతున్నారు.

## జాడ లేని తనిఖీలు...

సూర్యాపేట పురపాలక శాఖ అధికారులు నిషేధిత ప్లాస్టిక్ ను వాడితే జరిమానాలు విధిస్తామని ఆయా దుకాణాలను సీజ్ చేస్తామని చెబుతున్న మాటలు ఆచరణకు నోచుకోవడం లేదు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం 125 మైక్రాన్ల కంటే తక్కువ గల ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని నిషేధించారు.కానీ అధికార యంత్రాంగం ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. మున్సిపల్ సిబ్బంది నామమాత్రం తనిఖీలకే పరిమితం అవుతున్నారు. గత నాలుగేళ్లలో కేవలం రెండు మూడు సార్లు మాత్రమే తనిఖీలు చేపట్టినట్టు తెలిసింది.ఇది నిరంతరం కొనసాగితే కట్టడికి అవకాశం ఉంటుంది.

**- ఒకే పార్టీ.. మూడు వర్గాలా..?**
**- వర్గాలుగా విడిపోయిన కాంగ్రెస్..**
**- సూర్యాపేట కాంగ్రెస్ లో ఎవరికి వారే... ఐక్యత కరువైందా..?**
**- ఆధిపత్య పోరుతో హస్తం పార్టీలో కలకలం..**
**- నాయకుల వర్గ పోరుతో కార్యకర్తల్లో అయోమయం..**
**- ఐక్యతకు బదులు అంతర్గత రాజకీయాలేనా..?**
**- సమన్వయం లోపం.. కాంగ్రెస్ కు శాపమా..?**
**- వర్గ విభేదాలకు చెక్ పడేదెప్పుడు..?**

# కాంగ్రెస్ లో కలవని హస్తాలు..




**సూర్యాపేట ప్రతినిధి జూన్ 27:(విజన్ ఆంధ్ర) :** కార్యక్రమాలు ఏదైనా వేదిక ఎక్కడైనా మూడు గ్రూపుల నేతలు ఆధిపత్య ప్రదర్శనలకు దిగడం ఉద్రిక్తతలకు దారితీస్తుంది. ఎవరికి వారే తమ యాక్షన్ ప్లాన్ తో దూసుకుపోవడంతో కార్యకర్తలను ఇరకాటంలో పెడుతుందట.. ఈమధ్య అది కాస్త ముదిరి ఒక నేత ఇంటికి వెళ్లిన కార్యకర్తలు ఈ ఇంటికి వస్తే నిర్మమాటంగా నో ఎంట్రీ బోర్డు పెట్టేస్తున్నట్లు తెలుస్తుంది. దీనితో ఎవరి ఇంటికి వెళ్తే ఏమవుతుందో ఎవరికి స్వాగతం పలికితే ఏం తండాలో వస్తాయో అని ఇన్ యాక్టివ్ 3 లోకి వెళ్తున్నారని సమాచారం.. ముఖ్య నేతలు హాజరవుతున్న ప్రభుత్వ, పార్టీ, ప్రైవేటు కార్యక్రమాలకు ముగ్గురు నేతలు విడివిడిగా హాజరవడం రొటీన్ అవుతుందని చర్చించుకుంటున్నారు.నాయకుల మధ్య సమన్వయం లేకుంటే రానున్న జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికలపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.ఒకప్పుడు ఐక్యతకు, క్రమశిక్షణకు చిరునామాగా నిలిచిన సూర్యాపేట కాంగ్రెస్ రాజకీయాలు నేడు వర్గ విభేదాల మధ్య చిక్కుకున్నాయనే చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. పార్టీ విజయానికి అహర్నిశలు శ్రమించిన కిందిస్థాయి కార్యకర్తలు ప్రస్తుతం నాయకుల మధ్య జరుగుతున్న ఆధిపత్య పోరులో నలిగిపోతున్నారనే ఆవేదన వ్యక్తమవుతోంది. పార్టీ కోసం కష్టపడిన వారికి నేడు అండగా నిలిచే నాయకత్వం కనిపించడం లేదని కార్యకర్తలే వాపోతున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి గ్రామస్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు వేలాది మంది కార్యకర్తలు శ్రమించారు. ఎన్నికల సమయంలో ప్రజల వద్దకు వెళ్లి పార్టీ సిద్ధాంతాలను తీసుకెళ్లి, నాయకత్వంపై నమ్మకం కల్పించి విజయానికి బాటలు వేసింది కార్యకర్తలేనని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. అయితే అధికారం వచ్చిన తర్వాత వారి ఆశలు, ఆకాంక్షలు నెరవేరలేదనే భావన క్రమంగా పెరుగుతోందని తెలుస్తోంది. ప్రస్తుతం సూర్యాపేట కాంగ్రెస్‌లో మూడు వర్గాలుగా రాజకీయాలు సాగుతున్నాయనే చర్చ బలంగా వినిపిస్తోంది. మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి తనయుడు సర్వోత్తమ్ రెడ్డి వర్గం ఒక వైపు, మరోవైపు టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి వర్గం, ఇంకో వైపు 40 ఏళ్లుగా రాంరెడ్డి దామోదర్ రెడ్డి ముఖ్య అనుచరుడుగా ఉన్న మార్కెట్ కమిటీ చైర్మెన్ కొప్పుల వేణారెడ్డి వర్గం తమ తమ రాజకీయ వ్యూహాలతో ముందుకు సాగుతుండటం తో సాధారణ కార్యకర్తలు ఎటువైపు వెళ్లాలో అర్థంకాని పరిస్థితిలో ఉన్నారని పార్టీ వర్గాలే చెబుతున్నాయి. నాయకుల మధ్య సమన్వయం లేకపోవడం, ఒకరిపై ఒకరు ఆధిపత్యం చాటుకునే ప్రయత్నాలు చేయడం వల్ల పార్టీ బలహీనపడుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. స్థానికంగా చిన్న సమస్య వచ్చినా కార్యకర్తలు ఎవరిని సంప్రదించాలో తెలియని పరిస్థితి ఏర్పడిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు పార్టీ కోసం జైలు పాలైన వారు, ఆర్థికంగా నష్టపోయిన వారు, కష్టకాలంలో పార్టీ జెండా మోసిన వారు నేడు గుర్తింపుకు నోచుకోవడం లేదని అంటున్నారు. అధికారంలో ఉన్న పార్టీకి కార్యకర్తలే వెన్నెముక అయినప్పటికీ, ప్రస్తుతం ఆ వెన్నెముకే బలహీనపడుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయని రాజకీయ పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.సీనియర్ నాయకుడు,మాజీ మంత్రి దామోదర్ రెడ్డి రాజకీయాల్లో చురుకుగా ఉన్న కాలంలో పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉండేదని సీనియర్ కార్యకర్తలు గుర్తు చేసుకుంటున్నారు.ఆయన నాయకత్వంలో వర్గాలకు అతీతంగా అందరూ కలిసి పనిచేసేవారని, సమస్య వచ్చిన ప్రతి కార్యకర్తకు ధైర్యం చెప్పే నాయకత్వం ఉండేదని చెబుతున్నారు. పార్టీ కుటుంబంలా ఉండేదని,నాయకులు,కార్యకర్తల మధ్య సమన్వయం బలంగా ఉండేదని వారు పేర్కొంటున్నారు. అయితే కాలక్రమేణా నాయకత్వ మార్పులు, వ్యక్తిగత రాజకీయ ఆశయాలు, స్థానిక స్థాయిలో పెరిగిన విభేదాలు సూర్యాపేట కాంగ్రెస్‌ను వర్గాలుగా విభజించాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ పరిస్థితి కొనసాగితే పార్టీ కేడర్‌లో మరింత నిరుత్సాహం పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.ఇప్పటికైనా రాష్ట్ర నాయకత్వం, ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి చొరవ తీసుకుని సూర్యాపేట నాయకులతో ప్రత్యేకంగా సమావేశమై విభేదాలను పరిష్కరించాలని కార్యకర్తలు కోరుతున్నారు. నాయకులందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి పార్టీ శ్రేణులకు స్పష్టమైన దిశానిర్దేశం ఇవ్వాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడుతున్నారు.లేకపోతే అంతర్గత విభేదాలు మరింత ముదిరి పార్టీకి రాజకీయంగా నష్టం కలిగించే అవకాశాలు ఉన్నాయని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. పార్టీని బలోపేతం చేయాల్సిన సమయంలో అంతర్గత విభేదాలు పెరగడం ప్రతిపక్షాలకు అవకాశం కల్పిస్తుందని అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కార్యకర్తలకు నమ్మకం కల్పించి, వారికి అండగా నిలిచే నాయకత్వం ఏర్పడితేనే సూర్యాపేట కాంగ్రెస్ మళ్లీ పాత వైభవాన్ని సాధించగలదని రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు.అయితే ఈ ప్రచారాలపై కాంగ్రెస్ పార్టీ నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు. పార్టీ పెద్దలు త్వరలో జోక్యం చేసుకుని విభేదాలకు తెరదించి అందరినీ ఒకే తాటిపైకి తీసుకువస్తారా..? లేక వర్గ రాజకీయాలు మరింత ముదురుతాయా..? అన్నది వేచి చూడాల్సి ఉంది..



## గ్రామ పంచాయతీ కార్యాలయమా... కాంగ్రెస్ పార్టీ కార్యాలయమా..?

**- ప్రభుత్వ కార్యాలయంలో పార్టీ సమావేశాలా..?**
**- ఎంపీ, ఎమ్మెల్యే పాల్గొనడంతో అధికారుల తీరుపై అనుమానాలు**
**- విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నేతల డిమాండ్**



శాలిగౌరారం, జూన్ 27 (విజన్ ఆంధ్ర): శాలిగౌరారం మండల కేంద్ర గ్రామ పంచాయతీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన ఎస్ఐఆర్ ప్రత్యేక సవరణపై బూత్ లెవెల్ ఏజెంట్ల అవగాహన సమావేశం నిర్వహించడంపై వివాదం చెలరేగింది. ప్రభుత్వ కార్యాలయాన్ని పార్టీ కార్యక్రమాలకు వినియోగించడం నిబంధనలకు విరుద్ధమని బీఆర్ఎస్ నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సమావేశానికి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేలు హాజరుకావడం మరింత చర్చనీయాంశమైంది. ఇది అధికారిక ప్రభుత్వ కార్యక్రమమా లేక కాంగ్రెస్ పార్టీ కార్యక్రమమా అనే సందేహం ప్రజల్లో నెలకొందని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. గ్రామ పంచాయతీని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలా ఉపయోగిస్తున్నారని, మండలంలోని కొందరు అధికారులు కూడా అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ అంశంపై గ్రామపంచాయతీ కార్యదర్శిని ఫోన్‌లో సంప్రదించినా స్పందించలేదని, ఆయన పాత్రపైనా విచారణ జరిపి అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ కార్యాలయాలను రాజకీయ పార్టీ కార్యక్రమాలకు వినియోగించడం ఎంతవరకు సమంజసమో జిల్లా ఉన్నతాధికారులు స్పష్టం చేయాలని, ఈ ఘటనపై సమగ్ర విచారణ నిర్వహించి వాస్తవాలు వెలికితీసి, నిబంధనలు ఉల్లంఘించి ఉంటే సంబంధిత ప్రజాప్రతినిధులు, బాధ్య అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో శాలిగౌరారం బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు నిమ్మల సురేష్ గౌడ్, వార్డు సభ్యురాలు బండారు స్వాతి ధనుంజయ్, గుండ్లపెల్లి రమేష్, బండారు మహేష్, పోతుగంటి సైదులు తదితరులు పాల్గొన్నారు.






EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.